
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 233

మంగళవారం 14-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ 9/9

ప్రపంచకప్ లీగ్ చివరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై ఘనవిజయం. - 14లో



దీపావళి ధమాకా!!

పండుగ సీజన్‌లో ఇప్పటివరకు రూ. 3.75 లక్షల కోట్ల వ్యాపారం -15లో

న్యూస్‌రీల్

కుప్పకూలిన 'ఉత్తర కాశీ' సొరంగం



ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నిర్మాణంలో ఉన్న ఒక సొరంగం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో దాదాపు 40 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. అయితే వారంతా క్షేమంగానే ఉన్నారని... వారికి ఆహారం, తాగునీరు అందించామని అధికారులు తెలిపారు.

- వివరాలు 6లో ▶

ఆర్థిక నేరగాళ్లకు బేడీలు వేయొద్దు..



ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి బేడీలు వేయరాదని, హత్య, అత్యాచారం నిందితులతో కలిపి జైలులో ఉంచరాదని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులు తప్పించుకోకుండా నిరోధించడానికే బేడీలని వివరించింది.

- వివరాలు 6లో ▶

అందుకే మమ్మల్ని కాంగ్రెస్ వదిలేసింది..



కాంగ్రెస్‌తో పొత్తు విచ్ఛిన్నం, ఆ పార్టీతో సీపీఐ వెళ్లిపోవడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరు నేపథ్యంలో తమ పార్టీ భవిష్యత్ కార్యాచరణను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు.

- వివరాలు 7లో ▶

షార్ట్ సర్క్యూట్.. రసాయనాలు

9 ప్రాణాలు బుగ్గి



నాంపల్లి బజార్‌ఘాట్‌లో అగ్నిప్రమాదం జరిగిన భవనం వద్ద సహాయక చర్యలు. (ఇన్‌సెట్)లో చిన్నారిని కాపాడుతున్న దృశ్యం.. చెలరేగుతున్న మంటలు

హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం

- నాంపల్లి బజార్‌ఘాట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- ప్లాస్టిక్ షీట్ల బండిళ్లు, రసాయనాల టిన్నులకు అంటుకోవడంతో ఎగసిన అగ్నికీలలు
- పై అంతస్తులకు వ్యాపించిన మంటలు, దట్టమైన పొగ.. ఊపిరి ఆడక అపస్మారక స్థితికి చేరడంతో ప్రాణ నష్టం
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు
- మరో 9 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, రేవంత్, అసదుద్దీన్ తదితరుల దిగ్భ్రాంతి
- ఘటనా స్థలానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్ తదితర రాష్ట్ర మంత్రులు
- బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కేటీఆర్

5 లో

సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్



కాంగ్రెస్ చెబుతున్న 3 గంటల కరెంటుతో ఒక్క మడీ తడవదు

కాంగ్రెసోళ్లు చెప్పినట్టు చేయాలంటే రైతులు 10 హెచ్‌పీ మోటార్ వినియోగించాలి..

అది సాధ్యమేనా? రైతులకు 10 హెచ్‌పీ మోటార్ ఎవరిస్తారు?

సాధ్యంకాని హామీలు

కాంగ్రెస్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజం

- ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తారట!.. ధరణిని బంగాళాఖాతంలో కలుపుదామా? కాంగ్రెస్‌నా?
- రైతుబంధు లాంటివి ఎలా అమలు చేస్తారంటే సమాధానం లేదు
- అన్నీ పరిశీలించి ఓటు వేస్తే బతుకులు బాగు పడతాయన్న సీఎం
- భద్రాద్రి, వరంగల్ జిల్లాల్లో ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ సాక్షి, వరంగల్/నర్సంపేట: 'సాగుకు సంబంధించి బాగోగులు తెలియని కాంగ్రెస్ నేతలు వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలని చెబుతున్నారు. 3 గంటల కరెంటు ఇస్తే ఒక్క మడి కూడా తడవదు. ఒకవేళ కాంగ్రెస్ చెప్పినట్టు చేస్తే రైతులు 10 హెచ్‌పీ మోటార్లు వినియోగించాలి. అది సాధ్యమయ్యే పనేనా? వీటిని రైతులకు ఎవరు కొనుగోలు చేసి ఇస్తారు? మీ అయ్యలు ఇస్తారా? ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తమ రాష్ట్రంలో 5 గంటల విద్యుత్ ఇస్తున్నామంటూ సవాల్ చేశారు. కానీ తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఇస్తున్నాం. అయితే ప్రధాని మోదీ రాష్ట్రమైన గుజరాత్‌లో 24 గంటల విద్యుత్ లేదు. ఎలాగైనా గెలవాలనే తపనతో మిగతా 2వ పేజీలో ▶

17న రాష్ట్రానికి రాహుల్

పాలకుర్తి, వరంగల్, భువనగిరి సభలకు హాజరు

వారం రోజులపాటు రాష్ట్రంలో ఉండేలా షెడ్యూల్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోమారు రాష్ట్రానికి రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 17న రాష్ట్రానికి రానున్న ఆయన వారంపాటు ఇక్కడే బస చేసే అవకాశముంది. ఈ మేరకు రాహుల్‌గాంధీ షెడ్యూల్‌ను టీపీసీసీ రూపొందిస్తుండగా, ఈనెల 17న ఆయన వరంగల్, పాలకుర్తి, భువనగిరిల్లో ఏర్పాటు చేసే బహిరంగ సభలకు హాజరు కానున్నట్టు తెలుస్తోంది. ఈనెల 16 తర్వాత ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించిన కాంగ్రెస్ పార్టీ రాహుల్‌తో పాటు ప్రియాంకాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను కూడా రంగంలోకి దించనుంది. రాహుల్ తెలంగాణలో ఉన్నప్పుడే ఏదో ఒక రోజు ఆ ఇద్దరూ కూడా ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

రెబెల్స్‌కు బుజ్జగింపులు

రెబెల్స్‌గా బరిలోకి దిగిన పార్టీ నేతలతో కాంగ్రెస్ మంతనాలు జరుపుతోంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ సోమవారం పలువురు రెబెల్స్‌తో సంప్రదింపులు జరిపారు. రాష్ట్రంలో 15 చోట్ల రెబెల్స్ బరిలో ఉన్నట్లు నాయకత్వం గుర్తించిందని, వారితో సంప్రదింపులు మంగళవారం పూర్తవుతాయని సమాచారం. రెబెల్స్ పోటీలో లేకుండా చూస్తామని పార్టీ వర్గాలంటున్నాయి.

తెలంగాణకు మోదీ గ్యారంటీలు

- పకడ్బందీగా రూపొందుతున్న బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో
- మోదీ గ్యారంటీల పేరుతో ప్రజలకు భరోసా
- ఉచితంగా విద్య, వైద్యం అమలు.. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తికి జీవిత బీమా
- ఆయుష్మాన్ భారత్ కింద రూ.10 లక్షల దాకా వైద్యం..
- వరికి మద్దతు ధర రూ.3,100
- మహిళా సంఘాలు, రైతులకు వడ్డీలేని రుణాలు
- అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు
- ఈ నెల 17న బీజేపీ మేనిఫెస్టో విడుదల చేయనున్న అమిత్ షా!
- అదేరోజు 4 సభలకు హాజరు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు 'మోదీ గ్యారంటీలు'పేరిట భరోసా కల్పించేందుకు బీజేపీ నాయకత్వం సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ వర్గాల ఓటర్లను ఆకట్టుకునేలా ఎన్నికల మేనిఫెస్టోను పకడ్బందీగా రూపొందిస్తోంది. అధికార బీఆర్ఎస్ మేనిఫెస్టో, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలకు భిన్నంగా బీజేపీ మేనిఫెస్టో ఉండబోతోందని పార్టీనేతలు చెబుతున్నారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, యువత, రైతులు.. ఇలా విభిన్నవర్గాలకు ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే.. అదనంగా సెంటిమెంట్‌ను జోడించి మరింత ఆకర్షణీయంగా మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

ముసాయిదాను నాయకత్వం సమగ్రంగా పరిశీలించిన తర్వాత ఈ నెల 17న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. రాష్ట్రంలో పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంకోసం అమిత్ షా వస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లోని మీడియా సెంటర్‌లో బీజేపీ ఎన్నికల ప్రణాళికను ప్రకటిస్తారని చెపుతున్నారు. ఈ పర్యటన సందర్భంగా నల్లగొండ, వరంగల్, గద్వాల, రాజేంద్రనగర్‌లలో మిగతా 3వ పేజీలో ▶

బీఆర్ఎస్‌పై బీజేపీ చార్జిషీట్లు..

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో చిట్టాల రూపకల్పన

మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలపై ఫోకస్

3 లో

కాంగ్రెస్‌ను బద్నాం చేసే కుట్ర

బీజేపీతో కలిసి బీఆర్ఎస్ యత్నాలు: టీపీసీసీ చీఫ్ రేవంత్



- మాకు సంబంధం లేకున్నా దాడుల విషయంలో నిందలు మోపుతున్నారు.. తప్పుడు ప్రకటనలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై ఈసీ చర్యలు తీసుకోవాలి
- మోదీ మరోమారు మాదిగలను మోసం చేశారు
- మోదీ, అమిత్‌షా సన్నిహితుడికి అసద్ తన ఇంట్లో పార్టీ ఇచ్చారు

2 లో

ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ





కర్ణాటకకు జస్టిస్ సుమలత, మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ సుధీర్‌కుమార్

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం

16 లో

బ్రిటన్ మంత్రివర్గంలో కుదుపు

- హోం మంత్రి బ్రేవర్మన్‌పై వేటు.. ప్రధాని రిషి సునాక్ నిర్ణయం
- విదేశాంగ మంత్రిగా కామెరాన్..
- విదేశాంగం నుంచి హోంకు క్లెవరీ.. తప్పుకున్న మరో ఏడుగురు మంత్రులు

6 లో



బ్రేవర్మన్

సోమవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు తరలివచ్చిన ప్రజలు



కేసీఆర్ పథకం అందని ఇల్లు ఉండదు

కేసీఆర్ సింహం.. సింగిల్‌గానే వస్తడు

- కాంగ్రెస్ ఆరు నెలలకో సీఎంను మారుస్తుంది
- ఒక్క బక్క కేసీఆర్‌ను కొట్టనీకే ఢిల్లీ నుంచి అంతమంది వస్తుండ్రు
- 'రేటెంతరెడ్డి' అనే దొంగ మనకు సీఎం కావాలా?
- వికారాబాద్ జిల్లా కుల్కచర్ల రోడ్ షోలో మంత్రి కేటీఆర్

3 లో

772 సెట్ల నామినేషన్ల తిరస్కరణ

- ముగిసిన నామినేషన్ల పరిశీలన
- రేపటితో ముగియనున్న ఉపసంహరణ గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారంతో ముగిసింది. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 4,798 మంది అభ్యర్థులు మొత్తం 5,716 సెట్ల నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. పరిశీలన అనంతరం 3,307 సెట్ల నామినేషన్లను స్వీకరించగా, మరో 772 సెట్ల నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన సెట్ల పరిశీలనకు సంబంధించిన వివరాలను సోమవారం రాత్రి వరకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయలేదు. ఈ నెల 15తో నామినేషన్ల మిగతా 5వ పేజీలో ▶

చట్టం చేసైనా సరే ఎస్సీ వర్గీకరణ: కిషన్‌రెడ్డి

- ప్రాధాన్యతాంశాల పర్యవేక్షణకే కమిటీ
- ఇప్పటివరకు కంటితుడుపు చర్యలే.. ఎవరూ పట్టించుకోలేదు
- మోదీ చొరవతోనే కదలిక.. రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని, వర్గీకరణను అమలు చేసే బాధ్యతను భుజస్కంధాలపై పెట్టుకుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రం సానుకూలంగా ఉందని సుప్రీంకోర్టుకు తెలియజేయడంతో పాటు దీనిపై ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఒకవేళ కోర్టు ద్వారా ఇది సాధ్యం కాకపోతే చట్ట పరంగా చేసేందుకు కూడా బీజేపీ, కేంద్రం కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. తాజాగా కేంద్రం ఏర్పాటు చేసే టాస్క్‌ఫోర్స్ కమిటీ వర్గీకరణ చేయాలా..? వద్దా..? అన్న అంశంపై కాదని, వర్గీకరణపై కోర్టు కేసులు, ఇతర ప్రాధాన్యతాంశాలను రోజువారీ పర్యవేక్షించేందుకేనని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి సోమవారం మిగతా 3వ పేజీలో ▶

ఇదంజగత్



కార్యకర్తలకు ఖర్చుపెట్టడానికి డబ్బుల్లేవట!

క్లుప్తంగా...

మామ, అల్లుడు కలిసే నన్ను వెళ్లగొట్టారు: ఈటల



కొండపాక (గజ్వేల్): మామ, అల్లుడు కలిసే తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టారని, పార్టీలో ఎదుగుతుండటంతో జీర్ణించుకోలేకపోయారని మాజీ మంత్రి, గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, రాంపల్లి, మర్పడ్గ, ఖమ్మంపల్లి, సిర్సనగండ్ల, కొండపాక, దమ్మక్కపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ వైద్యారోగ్య మంత్రిగా పని చేస్తూ ఆస్పత్రులకు వెళ్లి ధైర్యం నింపుతూ ఎదుగుతున్న తనను మామా అల్లుడు కలిసి పార్టీ నుంచి బయటకు వెళ్లగొట్టారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. హుజూరాబాద్‌లో ఓడించడానికి రూ.600 కోట్లు ఖర్చు చేశారన్నారు. కానీ హుజూరాబాద్ ప్రజానీకం మాత్రం తనను కాపాడుకొని చరిత్ర సృష్టించారని ఈటల వ్యాఖ్యానించారు.

'పదేళ్లలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని అనుకున్నామని, అందుకు విరుద్ధంగా ఈ పదేళ్లలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ప్రజాసంఘాల నేతలు విఠల్, సతీశ్ కమల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో 60 శాతం కేసీఆర్ కుటుంబసభ్యుల చేతుల్లోనే ఉందని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ రేపటి నుంచి నిరుద్యోగ యువత ఎక్స్‌ప్రెస్ ప్రచారం చేయబోతోందని, ఇక 'దంచుడే దించుడే'నినాదంతో ముందుకెళ్తామని చెప్పారు.

ఆర్ఎస్ఎస్ టిల్లు రేవంత్‌రెడ్డి: అక్బరుద్దీన్ ఒవైసీ



చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ టిల్లు అని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఎద్దేవాచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జంగమ్మెట్ డివిజన్‌లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం ఒవైసీ మాట్లాడుతూ ముస్లింలను తామే ఉద్ధరిస్తామన్న ధోరణితో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన రేవంత్‌రెడ్డి త్వరలోనే బీజేపీలో చేరతారన్నారు. రెడ్డి, రావు ఎవరైనా తమ మాట వినాల్సిందేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్ ఎందుకు చేసిందో అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

'బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే!'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ మూలాలు ఢిల్లీలోని మోదీ, అమిత్ షా వద్ద ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కవితను అరెస్టు చేస్తారని తెలియగానే బీజేపీతో బీఆర్ఎస్ రాజీ పడిందని, అందుకే బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనన్నారు. నారాయణ హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఒక్క ఓటుతో మూడు పార్టీలను దెబ్బకొట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. తమకు అనుకూల పవనాలు వీస్తున్నాయని బీఆర్ఎస్ భావిస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. గతంలో ఉన్న పది శాతం కమిషన్ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 50 శాతానికి పెంచిందని, కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు వాటా లేకుండా ఏ కొత్త ప్రాజెక్టు, కొత్త మెడికల్ కాలేజీలు, మాల్స్, రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతి రాదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక 15 ఎకరాల ఫామ్ హౌజ్ 200 ఎకరాలు అయిందని, దాని కోసం కొండ పోచమ్మ రిజర్వాయర్ నుంచి నీళ్లు రప్పించుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పోటీ చేద్దామంటే సింబల్ ఇవ్వలేదు: కేఏ పాల్



సాక్షి,హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేద్దామంటే తమ పార్టీకి సింబల్ ఇవ్వలేదని, దీనిపై హైకోర్టుకు వెళ్తామని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబపాలనకు చరమగీతం పాడాలన్నారు. 'మా పార్టీలో చేరాలని మందకృష్ణ మాదిగను కోరితే, రూ. 25 కోట్లు అడిగారని, ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీకి ఆయన అమ్ముడుపోయారు'అని ఆరోపించారు. మరోవైపు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన మాదిగల బహిరంగసభ నిమిత్తం మందకృష్ణకు రూ.72 కోట్లు ముట్టాయని, ఎంపీ పదవి ఇస్తారని ఆశతోనే ఆయన అమ్ముడుపోయారని విమర్శించారు. మాదిగలకు మోదీ ఇన్నిరోజుల్లో చేయని న్యాయం ఇప్పుడు చేస్తారా అని కేఏ పాల్ నిలదీశారు.



సోమవారం బూర్గంపాడులో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. సభకు భారీగా హాజరైన ప్రజలు



దమ్మపేట ప్రజాఆశీర్వాద సభకు హాజరైన జనం

సాధ్యంకాని హామీలు..

▶ మొదటి పేజీ తరువాయి

గోల్‌మాల్ మాటలు చెబుతున్నారు. ఆ మాటలు విని మోసపోవద్దు..' అని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ధరణి పోర్టల్‌తోనే రైతుల భూములకు రక్షణ అని పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని కూడా కాంగ్రెస్ నేతలు అంటున్నారని, బంగాళాఖాతంలో కలపాల్సింది ధరణినా? కాంగ్రెస్‌నా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు, దమ్మపేట మండలాల్లో, వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

రైతులకు మేలు చేయడం దుబారానా?

'ప్రభుత్వాల తోడ్పాటు లేనిదే ప్రపంచ వ్యాప్తంగా కూడా వ్యవసాయం ముందుకు నడిచే పరిస్థితి లేదు. ఆ దృష్టితోనే రైతుబంధు పథకాన్ని అమల్లోకి తెచ్చాం. అయితే పన్నుల రూపంలో వచ్చిన డబ్బులు రైతుబంధు పేరుతో దుబారా చేస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు అంటున్నారు. రైతులకు మేలు చేయడం దుబారా ఎలా అవుతుంది? రైతు సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే మేం రైతుబంధు, నీటి తీరువా రద్దు, రైతుబీమా అందుబాటులోకి తెచ్చాం. 7,500 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తున్నాం' అని కేసీఆర్ తెలిపారు.

ధరణితో అన్ని హక్కులూ రైతులకే..

'గతంలో ప్రభుత్వ భూములపై రెవెన్యూ పెత్తనం ఉండేది. ప్రతి పనికీ వీర్వోలు.. ఎమ్మార్వోల మీద ఆధారపడాల్సి వచ్చేది. కానీ ధరణి వచ్చిన తర్వాత భూములపై అన్ని రకాల హక్కులు రైతులకే బదలాయించాం. రైతు వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా బయటకు పోదు. అంతేకాదు ప్రభుత్వం అందించే ప్రతి ఆర్థిక సాయం నేరుగా రైతు ఖాతాలోకే చేరిపోతుంది. ఈ మేరకు మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఇలాంటి ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తానంటూ కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు రేవంత్, ఆ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ అంటున్నారు. అసలు రాహుల్ సహా కాంగ్రెస్ నేతలకు వ్యవసాయం గురించి, రైతుల కష్టాల గురించి ఏం తెలుసు? ధరణిని రద్దు చేస్తే రైతుబంధు లాంటి పథకాలు ఎలా అమలు చేస్తారంటే వారి వద్ద సమాధానం లేదు. ధరణిని తీసేస్తే మళ్లీ రెవెన్యూ పెత్తనం పెరుగుతుంది. దళారులు, లంచగొండులు, పైరవీకారులు పుట్టుకొస్తారు..' అని సీఎం హెచ్చరించారు.

2 వేల పింఛను ఇచ్చేది తెలంగాణ, ఏపీ మాత్రమే..

'వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛను అందించడం సామాజిక బాధ్యత. రాష్ట్రం వచ్చిన కొత్తలో పెన్షన్ రూ.200 ఉండేది. అప్పుడు పింఛను పెంచాలని అధికారులకు చెబితే, వారు రూ.600 ఇస్తే సరిపోతుందంటూ సిఫారసు చేశారు. కానీ మేం ఆ మొత్తాన్ని రూ.1000కి పెంచాలని నిర్ణయించాం. ఇప్పుడు దేశం మొత్తం మీద రూ.2 వేల పింఛను అందిస్తున్న రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాత్రమే..' అని కేసీఆర్ తెలిపారు.

ఇంత అహంకారమా?

'ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ నాయకుడు (పొంగులేటి).. ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేనూ అసెంబ్లీ గేటు తాకనివ్వనని అంటున్నాడు. ఇంత అహంకారంతో కూడిన మాటలు మాట్లాడొచ్చా? ధనబలంతో ప్రజాస్వామ్యాన్ని కొంటారా? పక్క రాష్ట్రం నుంచి వచ్చి డబ్బు కట్టలు పంచుతున్నారు. ఇలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలి. గ్రామాలకు వచ్చే టూరిస్టులకు ఓటు వేయొద్దు..' అని కోరారు.

ఆషామాషీగా ఓటేయొద్దు

'తెలంగాణ రాకముందు రాష్ట్ర వ్యాప్తంగా కేవలం మూడు డయాలసిస్ సెంటర్లు ఉండేవి. కానీ ఇప్పుడు 103 ఉన్నాయి. ఇంటింటికీ తాగునీరు అందుతోంది. రైతుబంధుతో పాటు దళిత బంధు కూడా వచ్చింది. నా కంటే పొడుగు, దొడ్డు ఉన్నోళ్లు రాష్ట్రాన్ని పరిపాలించినా ఎవరూ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదు. కానీ బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం. ఇక్కడి ప్రజల సంక్షేమమే మా ధ్యేయం. అందుకే గతంలో ఎన్నడూ లేని పథకాలు అమలు చేశాం. ఓటు హక్కును వినియోగించుకునేటప్పుడు ఆషామాషీగా నిర్ణయం తీసుకోవద్దు. పోటీలో నిలిచే అభ్యర్థులు, వారి వెనక ఉన్న పార్టీ, ఆ పార్టీ విధానాలు, ప్రజల పట్ల ఆ పార్టీకి ఉన్న నిబద్ధత.. అన్నీ పరిశీలించి ఓటు హక్కును వినియోగించుకుంటేనే జీవితాలు బాగుపడతాయి..' అని కేసీఆర్ అన్నారు. ఆయా సభల్లో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ అభ్యర్థులు రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, తెల్లం వెంకట్రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆడబిడ్డకు బీజేపీ అన్యాయం: కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన తుల ఉమ, ఆలేరు నేతలు



తుల ఉమ, స్రవంతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తుల ఉమకు బీ ఫారం ఇవ్వకుండా చివరి నిమిషంలో నిరాకరించడం ద్వారా బీసీ ఆడబిడ్డను బీజేపీ అవమానించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. బీసీ ముఖ్యమంత్రిని చేస్తానని బిల్డప్ ఇచ్చిన బీజేపీ, బీసీ నేతలను అవమానాలకు గురి చేస్తోందన్నారు. కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ సోమవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం తుల ఉమతో పాటు ఆమె వెంట వచ్చిన నేతలను కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో బీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన తుల ఉమకు మరింత సమున్నత స్థానం కల్పిస్తామన్నారు. బీజేపీ నేతలు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండరని, వేములవాడ టికెట్ విషయంలో మరొకరికి దొంగదారిలో బీ ఫారం ఇచ్చారని తుల ఉమ అన్నారు. బీజేపీలో బీసీ ముఖ్యమంత్రి కల అని, కేవలం రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని మాత్రమే ఆ పార్టీ నేతలు చూస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా, ఆలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు సుదగోని హరిశంకర్‌గౌడ్ నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం హరిశంకర్‌గౌడ్‌తో పాటు పల్లెపాటి సత్యనారాయణ ముదిరాజ్, మేడబోయిన పరశురాములు, ఉదయకిరణ్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులను కేటీఆర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. నల్లగొండ డీసీసీబీ వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి పాల్వాయి స్రవంతి

మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి ఆదివారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలోకి, తిరిగి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో అర్థంకాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డబ్బు మదంతో విర్రవీగుతున్న రాజగోపాల్‌రెడ్డికి మునుగోడులో బుద్ధి చెప్పాలన్నారు. గౌరవం లేనిచోట ఉండకూడదనే తన తండ్రి మాటలు స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్‌ను వీడినట్లు పాల్వాయి స్రవంతి పేర్కొన్నారు.

నా గెలుపు ఏపీ రాజకీయాల్లో కీలక మలుపు



- నేను విజయం సాధిస్తే అది తెలుగు ప్రజల గెలుపు
- టీడీపీ ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'నా గెలుపు మీరు గెలవడం.. ఖమ్మం జిల్లా ప్రజలు గెలవడం, తెలంగాణ గెలవడమే కాదు తెలుగు ప్రజల గెలుపు. నా గెలుపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ఒక కీలక మలుపు అవుతుంది. మీ కష్టం నేను ఉంచుకోను. దీనికి మీకు చాలా రుణపడి ఉంటా'అని మాజీ మంత్రి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు టీడీపీ కేడర్‌ను ఉద్దేశించి అన్నారు. ఖమ్మంలోని 2, 4వ డివిజన్లకు సంబంధించి టీడీపీ ఆధ్వర్యంలో పాండురంగాపురంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితం అందరికీ తెలిసిందేనని, ఆంధ్రాలో ఉన్న ప్రతిఒక్కరూ వచ్చి ఈరోజు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. తన జీవితంలో తెలిసి ఏ తప్పు చేయలేదని, ఎవరైనా తన మనుషులు తప్పు చేసినా సహించలేదని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో ఎవరూ తనకు దూరం కాలేదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని ఒక స్థాయికి తీసుకొచ్చానని, బీఆర్ఎస్‌ను కూడా ఆ స్థాయికి తీసుకువద్దామనుకుంటే తండ్రీకొడుకులే ఆ పార్టీని ముంచుకున్నారని సీఎం కేసీఆర్, కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'మంత్రి పదవి నాకు చిన్నప్పుడే ఎన్టీఆర్ ఇచ్చారు, మీరు ఇచ్చేదేమిటి' అని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. చంద్రబాబు వద్ద మాట్లాడి తాను కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించానే తప్ప, ఆయన తనకు ఇప్పించిందేమీ లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన టీడీపీ నేతలు, ఖమ్మంలోని 2, 4 డివిజన్లలోని టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

రాష్ట్ర అభివృద్ధి ఘనత కాంగ్రెస్‌దే

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- వైఎస్సార్ హయాంలో రైతులకు ఏక కాలంలో రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇచ్చాం
- హామీలను అమలు చేయకుండా కేసీఆర్ మళ్లీ వస్తున్నారు.. దళితులకు ఇస్తామన్న మూడెకరాలు హామీ ఎక్కడ?



నారాయణపేట జిల్లా కోస్గి కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/దౌల్తాబాద్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వైఎస్సార్ హయాంలో రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇవ్వడంతోపాటు పేదల కోసం తమ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా కోస్గిలోని శివాజీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ మాట్లాడుతూ.. సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకుంటే కేసీఆర్ కుటుంబ పరిస్థితి ఎలా ఉండేదో ప్రతిఒక్కరికి తెలుసునని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, దళితులకు ఇస్తామన్న మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇల్లు, రైతు రుణమాఫీ, కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి ఎన్నో పథకాలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఆనాడు కాంగ్రెస్ ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిందని, హన్మాండ్ల గుడి లేని ఊరు లేదు.. ఇందిరమ్మ ఇల్లు లేని కాలనీ లేదంటే.. కాంగ్రెస్ పార్టీ ఎందరికి ఇళ్లు ఇచ్చిందో అర్థమవుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రైతుబంధు రూ.15 వేలు, ఆసరా పింఛన్లు రూ.4 వేలు, ఉపాధి పనికి వెళ్లేవారికి ఏడాదికి రూ.12 వేలు, పేదలకు ఇళ్లు, ఉచిత కరెంట్ వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తామన్నారు.

కొడంగల్‌కు అన్యాయం

రాష్ట్రానికి పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా పడావు పెట్టారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లోని గాంధీ కూడలి వద్ద కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, కొడంగల్‌కు కృష్ణా జలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, సిమెంట్ ఫ్యాక్టరీ, రైల్వే లైన్ తెస్తామన్న కేసీఆర్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మన ఓట్లతో ముఖ్యమంత్రి అయి కొడుకును, అల్లుడిని మంత్రులుగా చేశారని విమర్శించారు.

గజ్వేల్ బరిలో 114 మంది

- 13 నామినేషన్ల తిరస్కరణ..
- ఉపసంహరింప జేసేందుకు జోరుగా యత్నాలు

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో అధిక నామినేషన్లను ఉపసంహరించేందుకు అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగారు. నియోజక వర్గంలో 127 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 13 స్క్రూటినీలో తిరస్కరణకు గురికాగా 114 మంది పోటీలో మిగిలారు. సీఎం నియోజకవర్గంలో నామినేషన్లు వేస్తేనే తమసమస్య బయటి ప్రపంచానికి తెలుస్తుందని భావించిన 90 మంది బాధితులు వ్యూహాత్మకంగా నామినేషన్లు వేశారు. శంకర్‌హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, చెరుకు రైతుల సమస్యలపై, అమర వీరుల కుటుంబాల తరఫున, మల్లన్నసాగర్ నిర్వాసితుల తరఫున మరికొందరు నామినేషన్లు వేశారు. నిరుద్యోగుల సమస్యలపై, అవినీతి రాజకీయాలపై ఇంకొందరు నామినేషన్లు వేశారు. ఇప్పుడీ నామినేషన్లను ఆయా వర్గాల చేత ఉపసంహరించే బాధ్యతను అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్య నేత తన భుజాన వేసుకున్నారు. బాధితులు ఎవరు చెబితే వింటారో వారితో సముదాయించి నామినేషన్ల ఉపసంహరణకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం 14, 15 తేదీలను అధికార పార్టీ నేతలు స్పెషల్ డ్రైవ్‌గా తీసుకుంటున్నారు. 15వ తేదీ సాయంత్రానికల్లా ఎంతమంది బరిలో ఉండనున్నారనే దానిపై స్పష్టత రానుంది.

సోనియా అనుకుంటే సీఎం అవుతా: కోమటిరెడ్డి



నల్లగొండ రూరల్: కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత సోనియా గాంధీ అనుకుంటే తాను సీఎం అవుతానని భువనగిరి ఎంపీ, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరో నెలరోజుల్లో కేసీఆర్ పాలన అంతం కాబోతుందని, ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగాలు భర్తీ చేయలేదని, పోటీపరీక్షల పేపర్లు అమ్ముకోవడంతో నిరుద్యోగులు చాలా నిరాశగా, ఆవేదనగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల విద్యుత్ సరఫరా కావడంలేదని, రైతుల రుణమాఫీ కూడా చేయలేదని విమర్శించారు. కేసీఆర్ మాయ మాటలు నమ్మితే గోస పడతామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే.. కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో నియంత పాలన సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కూతురు షర్మిల కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం వల్ల పార్టీకి అదనపు బలం చేకూరిందన్నారు.

బీఆర్ఎస్ ఎంపీలకు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులకు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ అయ్యాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా సెప్టెంబర్ 18న నిబంధనలకు విరుద్ధంగా రాజ్యసభలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపినందుకు బీఆర్ఎస్ ఎంపీలు కె.కేశవరావు, కె.ఆర్.సురేశ్‌రెడ్డి, దామోదర్‌రావు, రవిచంద్ర, లింగయ్య యాదవ్‌లకు ప్రివిలేజ్ నోటీసులు జారీ అయ్యాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్లకార్డులు ప్రదర్శించడం ద్వారా సభా మర్యాదను బీఆర్ఎస్ ఎంపీలు తగ్గించారని బీజేపీ ఎంపీ వివేక్ ఠాకూర్.. రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కడ్‌కు ఫిర్యాదు చేశారు. ఠాకూర్ ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న చైర్మన్.. విచారణ జరపాల్సిందిగా రాజ్యసభ ప్రివిలేజెస్ కమిటీకి సూచించారు. బీఆర్ఎస్ ఎంపీలపై వచ్చిన ఫిర్యా దుపై ఈనెల 8న జరిగిన సమావేశంలో విచారణ జరిపిన రాజ్యసభ ప్రివిలేజెస్ కమిటీ.. తదుపరి చర్యలు తీసుకునే ముందు ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీల సమాధానాన్ని ఈనెల 28 లోగా తమకు తెలియజేయాలని ఆదేశించింది.

కాంగ్రెస్‌ను బద్నాం చేసే కుట్ర



బీజేపీతో కలిసి బీఆర్ఎస్ యత్నాలు: టీపీసీసీ చీఫ్ రేవంత్

- మాకు సంబంధం లేకున్నా దాడుల విషయంలో నిందలు మోపుతున్నారు
- తప్పుడు ప్రకటనలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై ఈసీ చర్యలు తీసుకోవాలి
- మోదీ మరోమారు మాదిగలను మోసం చేశారు
- మోదీ, అమిత్‌షా సన్నిహితుడికి అసద్ తన ఇంట్లో పార్టీ ఇచ్చారు
- దీనిపై మక్కామసీదులో ప్రమాణానికి నేను సిద్ధం.. అసద్ వస్తారా అని సవాల్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌ను బద్నాం చేసేందుకు బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ నేతలపై జరిగే దాడులతో కాంగ్రెస్‌కు సంబంధం లేకపోయినా తమకు అంటగట్టే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటనలో కాంగ్రెస్ ప్రమేయం ఉందని కేసీఆర్ కుటుంబమంతా ప్రచారం చేసిందని, కానీ ఆ దాడిలో కుట్ర కోణం లేదని, సంచలనం కోసమే నిందితుడు దాడి చేశాడని పోలీసులు చెప్పారన్నారు. ఈ కేసులో ఇంతవరకు రిమాండ్ రిపోర్టు ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దాడి ఘటనను కూడా రాజకీయం చేస్తున్నారని, పరామర్శ పేరుతో మంత్రి కేటీఆర్ కొత్త డ్రామాకు తెరతీశారని వ్యాఖ్యానించారు. మరో 15 రోజుల్లో ఇలాంటి దాడులు ఇంకా జరుగుతాయని కేటీఆర్ చెప్పడాన్ని, తమ ఫోన్లను హ్యాకింగ్ చేస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం మౌనంగా ఉండటం తగదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ (ఈసీ) సుమోటోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, కొండ్రు పుష్పలీల తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక నుంచి కూలీలను తెచ్చి కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేయాలని చూస్తే ప్రజలు తిప్పికొట్టారని, దీంతో అక్కడ బీజేపీకి మద్దతిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామితో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కుమారస్వామి ప్రెస్‌మీట్‌ను తెలంగాణలోనూ ప్రసారం చేయాలని హరీశ్‌రావు మీడియాకు ఫోన్లు ఎందుకు చేశారని నిలదీశారు. బీజేపీతో పొత్తులో ఉన్న కుమారస్వామి ప్రెస్‌మీట్‌ను హరీశ్ సమన్వయం చేయడం దేనికి సంకేతమన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయడానికి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, జేడీఎస్ పార్టీల దుష్టచతుష్టయం కుట్ర చేస్తోందని ఆరోపించారు.

బిల్లు పెడితే మేం మద్దతిస్తాం

తాము మైనార్టీలకు మేలు చేస్తామని డిక్లరేషన్ ప్రకటిస్తే మైనార్టీలను బీసీల్లో కలుపుతారని కేటీఆర్ తప్పుడు ప్రయత్నం చేస్తున్నారని, మోకాలికి, బోడిగుండుకు ముడిపెట్టి అపోహలు సృష్టిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ఎస్సీల వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన కమిటీలు ఇప్పటికే నివేదికలు ఇచ్చాయని, డిసెంబర్ 4 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెడితే మద్దతిస్తామని చెప్పారు. అలా కాకుండా మాదిగలను మరోసారి మోసం చేసేందుకు బీజేపీ, మోదీ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ఒవైసీవి అబద్ధాలు

మోదీ, కేసీఆర్ లాంటి దొంగలను కాపాడేందుకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అబద్ధాలు ఆడుతున్నారని రేవంత్ ఆరోపించారు. 'ఆయనకు షేర్వాణీ లోపల పైజామా ఉందని అనుకున్నా. కానీ ఖాకీ నిక్కర్ ఉంది. ముస్లింల హక్కుల కోసం పోరాడాలని అసదుద్దీన్‌ను ఆయన తండ్రి బారిష్టర్ చదివించారు. కానీ ముస్లింలను ఇబ్బంది పెడుతున్న బీజేపీకి అసద్ మద్దతిస్తున్నారు'అని వ్యాఖ్యానించారు. రాజాసింగ్‌పై గోషామహల్ నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థిని ఎందుకు పోటీకి పెట్టలేదని ప్రశ్నించారు. కర్ణాటక ఎన్నికల సమయంలో మోదీ, అమిత్‌షాలకు సన్నిహితుడైన ఒక వ్యక్తికి అసదుద్దీన్ ఒవైసీ తన ఇంట్లో పార్టీ ఇచ్చారని ఆరోపించారు. అలా ఇవ్వలేదని ప్రమాణం చేయడానికి ఒవైసీ సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రమాణం చేసేందుకు భాగ్యలక్ష్మి ఆలయానికైనా, దర్గాకైనా వస్తానని, లేదా మక్కా మసీదులో ప్రమాణం చేయడానికి రమ్మన్నా వస్తానని చెప్పారు. దీనికి అసదుద్దీన్ వస్తారా అని సవాల్ విసిరారు.

వారు తెలంగాణను తాకట్టు పెడతారు

మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక • బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్సార్‌టీపీ నేతలు



హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వైఎస్సార్‌టీపీ నాయకుడు గట్టు రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: సీమాంధ్ర నాయకుల సూట్‌కేసులు మోయడానికి అలవాటు పడిన వెన్నెముక లేని కొందరు నాయకులు తెలంగాణను సమైక్య పాలకుల పాదాల దగ్గర తాకట్టు పెడతారని రాష్ట్ర మంత్రి టి.హరీశ్‌రావు హెచ్చరించారు. పార్టీ పెట్టడం అంటే పాన్‌డబ్బా పెట్టడమంత సులభం కాదని అవహేళన చేసినా 14 ఏళ్ల పాటు ఉద్యమించి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. అంతేకాకుండా తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. సోమవారం తెలంగాణ భవన్‌లో వైఎస్సార్‌టీపీకి చెందిన పలువురు నాయకులు గట్టు రాంచందర్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ నాయకులు కించ పరుస్తున్నారని, నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కర్ణాటక మోడల్ ప్రచారం విఫలం కావడంతో తోక ముడిచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కనీసం 50 స్థానాల్లో అభ్యర్థులు లేని పరిస్థితి నెలకొందని అన్నారు. తెలంగాణ అమరుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని కించ పరుస్తున్న రేవంత్‌కు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇలావుండగా ములుగు జిల్లాకు చెందిన బీజేపీ నేత తాటి కృష్ణ ఆదివారం హరీశ్‌రావు సమక్షంలో తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్‌లో చేరారు.

గువ్వల బాలరాజుకు కేటీఆర్, హరీశ్ పరామర్శ



గువ్వల బాలరాజును పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/అచ్చంపేట: అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆదివారం పరామర్శించారు. బాలరాజు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు ఆందోళన చెందవద్దని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. డీజీపీతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరుతానన్నారు. ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కొందరు తమపై దాడులకు పాల్పడుతున్నారని బాలరాజు కుటుంబసభ్యులు కేటీఆర్‌కు తెలిపారు. కాగా, మంత్రి హరీశ్‌రావు కూడా బాలరాజును పరామర్శించారు. బాలరాజుపై దాడి జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు జరగటం హేయమని, ఇలాంటి సంస్కృతికి ఓట్లతో ప్రజలు బుద్ధి చెప్పాలని హరీశ్ అన్నారు.

ప్రజాదరణ చూడలేకే దాడులు: గువ్వల బాలరాజు

బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రౌడీమూకలు తనపై దాడి చేశాయని, కానీ ఘటనా స్థలంలో తాను లేనని అడ్డంగా దొరికిన కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్‌కు ఓటు ద్వారా ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ అచ్చంపేటతోపాటు రాష్ట్రంలో కూడా అధికారంలోకి వస్తుందని, జరిగిన సంఘటనకు చట్టపరమైన చర్యలు తప్పవని బాలరాజు హెచ్చరించారు.

కేసీఆర్ పథకం | అందని ఇల్లు ఉండదు

కేసీఆర్ సింహం... సింగిల్‌గానే వస్తడు: మంత్రి కేటీఆర్

వికారాబాద్: 'ఒక్క చాన్స్ ఇవ్వండని కాంగ్రెసోళ్లు వస్తున్నరు.. వాళ్లను ప్రశ్నించండి.. స్వాతంత్ర్యం వచ్చాక వారికి 11 చాన్సులు ఇచ్చింన్రు.. అప్పుడేమి చేసింన్రు.. గుడ్డి గుర్రాల పళ్లు తోమింన్రా.. అప్పుడేమీ చేయని పార్టీ ఇప్పుడేం చేస్తది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలతో కలిసి పాల్గొని ప్రసంగించారు. హన్మంతుడి గుడి లేని ఊరు లేనట్టే.. కేసీఆర్ పథకం లేని అందని ఇల్లు ఉండదన్నారు. కేసీఆర్ చాలా మొండోడని, ఆయన ఏమి చెప్పినా చేసి చూపిస్తాడని పేర్కొన్నారు. '52 కిలోల బక్క కేసీఆర్‌ను కొట్టనీకే ఢిల్లీ నుంచి అంతమంది వస్తుంన్రు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు గుంపులు గుంపులుగా వస్తుంన్రు. ఎంత మంది వచ్చినా ఆయన్ను ఏమీ చేయలేరు. కేసీఆర్ సింహం లాంటోడు.. సింగిల్‌గానే వస్తడు.. గుంపులు గుంపులుగా ఎవరొస్తారో.. మీకు తెలుసు నేను చెప్పను'అంటూ కాంగ్రెస్, బీజేపీలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్, బీజేపీలో ఉన్న మన రాష్ట్ర వెధవలు మనల్ని తిట్టనీకే ఢిల్లీకెళ్లి నాయకులను పిలిపిస్తున్నారని విమర్శించారు. 'ఒకాయన ఢిల్లీకెళ్లి వస్తడు.. బీఆర్ఎస్ బీజేపీకి బీటీమ్ అంటాడు. పశ్చిమ బెంగాల్‌కు వెళ్లి మమతాబెనర్జీ బీజేపీకి బీటీమ్ అంటాడు.. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను బీజేపీకి బీటీమ్ అంటాడు.. ఎలాంటి ఆధారాలు లేని కేసులో మా నాయకులను అరెస్టు చేయలేదని బీజేపీకి బీటీమ్ అంటారా..? అలా అయితే సోనియా, రాహుల్ మీద కూడా కేసులు ఉన్నాయి.. వాళ్లను కూడా అరెస్టు చేయలేదు.. అయితే మీరు కూడా బీజేపీకీ బీటీమేనా'అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ గెలిస్తే ఎవరు ముఖ్యమంత్రో ఎవరికీ తెలియదు.. వాళ్ల దగ్గర పది మంది సీఎం అభ్యర్థులు ఉన్నారు. నిన్నటిదాకా కనిపించని జానారెడ్డి కూడా ఇప్పుడు సీఎం అభ్యర్థేనంట.. ఇంకో దొంగ.. నేను సీఎం అంటూ తిరుగుతున్నాడు.. మొన్న ఓటుకు నోటు కేసులో.. నిన్న రేటుకు సీటు.. ఇలాంటి రేటెంతరెడ్డి అనే దొంగ మనకు ముఖ్యమంత్రి కావాలా'అని వ్యాఖ్యానించారు. వారి ఆరు గ్యారంటీల సంగతేమో కానీ.. ఆరు నెలలకో సీఎంను మార్చడం మాత్రం ఖాయమన్నారు.



కుల్కచర్ల రోడ్‌షోలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో రంజిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ వస్తే సంక్షోభమే

బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే సంక్షేమం.. కాంగ్రెస్ వస్తే సంక్షోభమేనని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు పాలమూరు నీళ్ల పరిగిలో పారిస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజ్‌లకు శుభవార్త చెబుతామన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశామన్నారు. ఖరీఫ్, యాసంగి సీజన్ల ఆరంభంలోనే రైతుబంధు డబ్బు వేస్తున్నామని, ట్రింగ్ ట్రింగ్ మంటూ సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు రావటం మీరు చూస్తూనే ఉన్నారని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మతం పేరుతో ఒకరు.. కులం పేరుతో మరొకరు కుంపట్లు పెట్టడానికే చూస్తున్నారని కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

ఎస్సీ వర్గీకరణకు మళ్లీ కమిటీ ఎందుకు?



సాక్షి, హైదరాబాద్: కులాల పేరుతో కాంగ్రెస్ పార్టీని పడగొట్టాలని ప్రధాని మోదీ చూస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ దళితులను అవమానించిందని మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందని, దళితులను గుర్తించి వారికి అనేక అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో సీడబ్ల్యూసీ సభ్యుడు అజయ్‌కుమార్, ఏఐసీసీ అధికార ప్రతినిధి షామా అహ్మద్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంబేడ్కర్ మేధస్సును గుర్తించి ఆయనను రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌ను చేసింది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. ఎన్నికల్లో కులాలను ఉపయోగించుకోవాలని మోదీ చూస్తున్నారని, అందుకే రాజ్యాంగ సవరణ చేస్తే అమల్లోకి వచ్చే ఎస్సీల వర్గీకరణ విషయంలో మరోమారు కమిటీ వేస్తామని చెబుతున్నారన్నారు. ఎస్సీల వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టినా తమ పార్టీ మద్దతిస్తుందని చెప్పారు. కేవలం ఓట్ల విభజన కోసమే మోదీ ప్రయత్నిస్తున్నారని, దళితులు అన్ని విషయాలు గమనిస్తున్నారని, వారంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని దామోదర వ్యాఖ్యానించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడితే పాతరేస్తాం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు

లిబర్టీ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే బీజేపీని సమాధి చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎస్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్క శ్యామ్‌కుమార్ హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా మనువాద దోపిడీ శక్తులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేయిస్తున్న ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినా, దానికి మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీలను సమాధి చేస్తామన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని పరివర్తనా ఛాంబర్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమం అవాస్తవాల పునాదితో కూడినదని, తెలంగాణలో మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, విద్యా, ఉపాధి, ఉద్యోగం, రాజకీయ, వ్యాపార, ఆర్థిక రంగాల్లో ముందు వరుసలో ఉన్నారన్నారు. ఎన్నికల్లో మాదిగ ఓటు బ్యాంకును రాబట్టుకోవడం కోసం బీజేపీ వర్గీకరణ ప్రకటన చేసిందని తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ఉపకులాలను పెద్దఎత్తున సమీకరించి లక్షలాది మందితో హైదరాబాద్‌లో మాలల సత్తా చాటుతామని ప్రకటించారు.

మందకృష్ణవి అవకాశవాద రాజకీయాలు

మోదీ ఏనాడూ మాదిగలను పట్టించు కోలేదు: మాజీ మంత్రి పుష్పలీల

సాక్షి, హైదరాబాద్: మంద కృష్ణ మాదిగ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కొంద్రు పుష్పలీల విమర్శించారు. ఆయనను చూసి మాదిగ సమాజం ఆశ్చర్యపోతోందని ఆమె వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలసి ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ సభలో ప్రధాని మోదీ, కృష్ణ మాదిగల వ్యవహారం సినిమా స్టంట్‌ను తలపించిందన్నారు. మోదీ నటనా చక్రవర్తి అని, దళితుల విషయంలో మోదీ, కేసీఆర్‌లు ఇద్దరూ ఇద్దరేనని అన్నారు.

చట్టం చేసైనా సరే ఎస్సీ వర్గీకరణ

▶ మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్సే మొదటి ముద్దాయి

సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాల్లో ప్రధాని మోదీ స్వయంగా పాల్గొని న్యాయం, ధర్మం గురించి మాట్లాడిన తీరు యావత్ దేశాన్ని ఆశ్చర్యానికి గురి చేసిందని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాని స్థాయి వ్యక్తి ఒక సమస్యపై చొరవ తీసుకుని చర్చిస్తే దానిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ నేతలు కోడిగుడ్డుమీద ఈకలు పీకినట్టుగా ఇష్టారీతిన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక 75 ఏళ్లలో ఎస్సీ వర్గీకరణపై వివిధ కమిటీలు వేయగా, అనేక పోరాటాలు జరిగాయని చెప్పారు. దీనికి అనుకూలమంటూ కంటి తుడుపు చర్యలు చేపట్టడమే తప్ప ఎవరూ దీని గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ విషయంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్సే మొదటి ముద్దాయి అని పేర్కొన్నారు. ఉషా మెహ్రా కమిషన్ సమర్పించిన నివేదికను కనీసం చదవకుండా కోల్డ్ స్టోరేజీలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ధ్వజమెత్తారు.

తీర్మానంతో చేతులు దులుపుకున్న బీఆర్ఎస్

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీకి వెళ్లి దీని సాధనకు ఎలాంటి కృషి చేయలేదని, పార్లమెంట్‌లో సైతం బీఆర్ఎస్ ఎంపీలు ఏనాడూ ఈ అంశాన్ని లేవనెత్తలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యపై బీజేపీ జాతీయ నాయకత్వం స్పందించిందని, ప్రధాని మోదీ సూచనలతో గతనెల 2న ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ నేతలు, మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులతో అమిత్‌షా భేటీ అయ్యాక ఈ అంశంపై కదలిక వచ్చిందని చెప్పారు. కేంద్రం వర్గీకరణకు సానుకూలంగా ఉందని గతనెల 2న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారని, ఏడుగురు జడ్జీల బెంచ్‌ను వేయాలని కోరగా గతనెల 10న సీజే రాజ్యాంగ ధర్మాసనాన్ని వేశారని తెలిపారు. మోదీ ఉంటే ఏదైనా సాధ్యమనే దానికి ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్, రామజన్మభూమి ఆలయ నిర్మాణం, మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం వంటివి నిదర్శనమన్నారు.

తెలంగాణకు మోదీ గ్యారంటీలు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించే బహిరంగ సభల్లో అమిత్ షా పాల్గొంటారని పార్టీ నాయకులు వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిశాక, అన్నిసీట్లలో పోటీ చేసే అభ్యర్థులపై స్పష్టత వచ్చాక బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిని కొనసాగించడంలో భాగంగా ఈ నెల 17న ప్రకటన ఉంటుందని పార్టీ నాయకులు చెపుతున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు బీజేపీ మేనిఫెస్టోలో ముఖ్యాంశాలు..

- అర్హులైన అందరికీ ఉచితంగా విద్య, వైద్యం అమలుకు చర్యలు
- యూపీఎస్సీ మాదిరిగానే టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు జాబ్ కేలెండర్
- ప్రతి వ్యక్తికి జీవిత బీమా వర్తింపు • ఆయుష్మాన్ భారత్ కింద రూ. 10 లక్షల దాకా ఉచిత వైద్యం • వరి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,100
- వివాహిత మహిళలకు ఏడాదికి రూ.12 వేల భృతి
- వంట గ్యాస్ సిలిండర్ రూ.500 కే అందించేలా చర్యలు
- తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా జన ఔషధ కేంద్రాలు ఏర్పాటు చేసి అందరికీ చౌకగా మందులు అందుబాటులోకి తేవడం • వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ. 20వేలు చెల్లింపు • దేవస్థానాలు, తీర్థస్థానాల పర్యాటకానికి ఊతం (రెలీజియస్ టూరిజం) • ఐఐటీ, ఎయిమ్స్ తరహాలో ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థల ఏర్పాటు • ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన ప్రతి పేద వ్యక్తికి ఇల్లు • ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు • మహిళా సంఘాలు, రైతులకు వడ్డీలేని రుణాలు
- రెండు పెన్షన్లు (ఇంట్లో వృద్ధులైన భార్యా, భర్తలు ఇద్దరికీ వర్తింపు)
- ప్రమాదవశాత్తు చనిపోతే రైతులకే కాకుండా కౌలు రైతులు, రిక్షాకార్మికులు, ఇతర వర్గాల పేదలకు ప్రమాదబీమా రూ. 5 లక్షలు చెల్లింపు
- జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు

ప్రజల్లోకి బీసీ సీఎం నినాదం..

బీసీ సీఎం నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు.. ఉమ్మడి ఏపీలో, తెలంగాణ ఏర్పడ్డాక ఇప్పటిదాకా సీఎం పదవిని బీసీ వర్గాలకు చెందిన వ్యక్తి చేపట్టకపోవడాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని బీజేపీ భావిస్తోంది. అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలు బీసీ నాయకుడిని సీఎం చేసే పరిస్థితే ఉత్పన్నం కాదని, అందుకు భిన్నంగా బీజేపీ జాతీయ నాయకత్వం బీసీ నినాదాన్ని తలకెత్తుకోవడంతో పాటు బీసీ నేతను సీఎంగా చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో అన్ని వర్గాల వారు, ముఖ్యంగా బీసీ వర్గాల వారు మద్దతు తెలపాలని కోరనుంది. బీసీలకు టికెట్లు కేటాయించే విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేవలం మొక్కుబడిగా వ్యవహరిస్తే, బీజేపీ 36 సీట్లు బీసీలకు కేటాయించినందున వచ్చేఎన్నికల్లో ఆదరించాలని కోరనుంది.

అసెంబ్లీ సెగ్మెంట్లకు కాంగ్రెస్ సమన్వయకర్తలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 118 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల ప్రచారసరళి, జాతీయస్థాయి నేతల ప్రచారం, పోలింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై అభ్యర్థులు, స్థానిక నేతలతో సమన్వయం కోసం ఈ ఏర్పాటు చేసినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ట్విట్టర్ వేదికగా నిరసన తెలుపుతాం

ప్రకటనలను నిలిపివేయాలన్న ఈసీ ఉత్తర్వులపై కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి చెందిన అసెంబ్లీ ఎన్నికల అడ్వర్టైజ్‌మెంట్ల వీడియోలను నిలిపివేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడాన్ని ఆ పార్టీ ఖండించింది. బీఆర్ఎస్, బీజేపీల ఒత్తిడులకు తలొగ్గిన ఈసీ ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ప్రకటనలు నిషేధించిందని తెలంగాణ కాంగ్రెస్ పేరిట ఉన్న ట్విట్టర్(ఎక్స్) అకౌంట్‌లో పోస్టు చేసింది. ఈసీ ఆదేశాలపై తాము నిరసన తెలియజేస్తామని, ఈసీ నిషేధించిన ప్రకటనలను ట్విట్టర్‌లో పోస్టు చేస్తామని పేర్కొంది.

మైనారిటీ డిక్లరేషన్‌పై అయోమయం సృష్టిస్తున్నారు

కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు, ఎంపీ నాసర్ హుస్సేన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్, మజ్లిస్ మూకుమ్మడిగా కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్‌పై ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు, ఎంపీ నాసర్ హుస్సేన్ ఆరోపించారు. కాంగ్రెస్ వైపు మైనారిటీలు మొగ్గు చూపుతుండటంతో బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టారని విమర్శించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీలు అజయ్‌కుమార్, అజహరుద్దీన్‌తో కలిసి నాసర్ మాట్లాడారు. మైనారిటీలను బీసీల్లో కలిపేందుకు కాంగ్రెస్ చూస్తోందని అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రతి ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, కోట్ల విలువ చేసే భూములు, ఔటర్ రింగ్ రోడ్డు అన్నీ అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీకి బీఆర్ఎస్, ఏఐఎంఐఎంలు బీ టీంలని నాసర్ ఆరోపించారు.



హింసను ప్రేరేపించేలా ప్రసంగిస్తున్నారు

- మా అభ్యర్థులపై దాడులే ఇందుకు నిదర్శనం
- రేవంత్‌రెడ్డిపై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: హింసను ప్రేరేపించేలా అసభ్య పదజాలంతో కూడిన ప్రసంగాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రెచ్చగొడుతున్నారంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. అసాంఘిక శక్తులను రెచ్చగొట్టి తమ పార్టీ నాయకులు, అభ్యర్థులపై దాడులు చేయిస్తున్నారని, ఇటీవల తమ పార్టీ అభ్యర్థులపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని పేర్కొంది. రేవంత్‌రెడ్డి ప్రసంగాలకు, ఈ దాడులకు సంబంధం ఉందని ఆరోపించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ గుప్తా నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం ఈసీకి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ)కి సోమవారం ఫిర్యాదు చేసింది. రెండువారాల వ్యవధిలో పార్టీ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, అచ్చంపేట అభ్యర్థి గువ్వల బాలరాజుపై జరిగిన దాడులను ఇందులో ప్రస్తావించింది.

అసభ్య ప్రచారం అడ్డుకోండి


అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇతర పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఉపన్యాసాలు ఇస్తున్నారని ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేలా అసభ్య పదజాలంతో రేవంత్ చేస్తున్న ప్రసంగాలతో ప్రభావితమవుతున్న కాంగ్రెస్ కేడర్‌తో పాటు అరాచక శక్తులు బీఆర్ఎస్ కార్యకర్తలపై భౌతికంగా, మౌఖికంగా దాడులకు దిగుతున్నాయని ఆరోపించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నేతలను చంపేందుకు కాంగ్రెస్ నేరపూరిత ఆలోచనలు చేస్తోందనడానికి దుబ్బాక, అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థులపై జరిగిన దాడులే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలను సైతం భయభ్రాంతులకు గురిచేసేలా జరుగుతున్న ఈ దాడులను అరికట్టాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ అభ్యర్థులు ప్రచారం చేసుకునే వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రసారం చేస్తున్న ప్రకటనలను నిలువరించాలని ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ కోరింది. కాంగ్రెస్ పార్టీ ఫేస్‌బుక్ ఖాతాతో పాటు వివిధ చానెళ్లలో ప్రసారమవుతున్న ప్రకటనలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

బీఆర్ఎస్‌పై బీజేపీ చార్జిషీట్లు

- అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో చిట్టాల రూపకల్పన
- మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలపై ఫోకస్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చార్జిషీట్ల విడుదలకు బీజేపీ సిద్ధమౌతోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో బీఆర్ఎస్ సర్కార్ అవినీతి, అక్రమాలతోపాటు హామీల అమల్లో వైఫల్యాలు వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావించింది. దీనిని ఇప్పుడు శాసనసభ స్థానాల స్థాయిలో గత పదేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేల వైఫల్యాలు, ఇచ్చిన హామీల్లో ఏ మేరకు నెరవేర్చారు, ఎక్కడెక్కడ అక్రమాలకు పాల్పడ్డారు తదితర అంశాలపై చార్జిషీట్లు వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. అధికార పార్టీకే పరిమితం కాకుండా కాంగ్రెస్ అభ్యర్థుల ట్రాక్ రికార్డ్‌పైనా దృష్టిపెట్టినట్టు సమాచారం. 2014, 2018 ఎన్నికల్లో గెలిచాక చాలా మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడం వంటి అంశాలను లేవనెత్తాలని నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ ఎన్నికల ప్రచారంలోనూ ఈ అంశాలకే ప్రాధాన్యత ఇవ్వాలని అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి చార్జిషీట్‌లో ఏముందంటే...

వారం క్రితమే రాష్ట్రస్థాయిలో బీఆర్ఎస్ అవినీతి, నియంతృత్వ, కుటుంబ పాలనపై ప్రజాకోర్టులో చార్జిషీట్ అంటూ బీజేపీ విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి అత్యంత ముఖ్యమైన అంశంగా ముందుకొచ్చిందని బీజేపీ పేర్కొంది. దేశంలోనే అవినీతికి, లంచగొండితనానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఉదాహరణగా మారిందని మండిపడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం–అవినీతి అనేవి రెండూ పర్యాయపదాలుగా మారిపోయాయని దుయ్యబట్టింది. రైతులకు మోసం, దళితులకు దగా, గిరిజనులు, బీసీలకు ద్రోహం, నీటిపారుదల, విద్యారంగాల ఆగం, వైద్య రంగంలో హామీల బుట్టదాఖలు, మహిళలకు అన్యాయం, నిరుద్యోగులకు మోసం, సింగరేణి, విద్యుత్, పారిశ్రామిక రంగాల్లో వైఫల్యాలు తదితరాలను ఈ చార్జిషీట్‌లో బీజేపీ ప్రస్తావించింది.



జీవితాన్ని సంతోషమయం చేసుకోవడానికి అవసరమైనవి అతి కొద్ది అనే విషయాన్ని గుర్తుంచుకోండి.
- మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 14 నవంబర్ 2023

ఇది మూణ్ణాళ్ళ కథ కాదు!

ప్రజల ఆరోగ్యం విషయంలోనూ పాలకులకు న్యాయస్థానాలు గడువు విధించాల్సి రావడం విచిత్రమే. అయితే, ఇప్పటికే అదే పనిలో ప్రభుత్వముంటే, త్వరితగతిన పనులు జరగడానికి ఈ గడువు విధింపు తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. శానిటరీ న్యాప్కిన్ల పంపిణీపై దృష్టి పెడుతూ, జాతీయ స్థాయిలో 'వాంఛనీయ' ఋతుస్రావ కాల ఆరోగ్య విధానాన్ని 4 వారాల్లో ఖరారు చేయాలంటూ సుప్రీమ్ కోర్ట్ గత సోమవారం అన్నమాట అలాంటిదే. ప్రభుత్వ ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సగటున ఎంతమంది ఆడపిల్లలకు ఎన్ని మరుగుదొడ్లు ఉండాలన్న దానిపైనా జాతీయ స్థాయిలో ఒక మోడల్‌ను నిర్ణయించాల్సిందిగా కోర్ట్ ఆదేశించింది. దాదాపు 37.5 కోట్ల మంది ఋతుస్రావ వయసువారున్న దేశంలో... 2011 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో... దేశ ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం ఇచ్చిన ఈ ఆదేశం మహిళా లోకానికి కొంత ఊరట.

ఋతుస్రావ ఆరోగ్య ప్రాధాన్యాన్ని కోర్ట్ గుర్తించడం, ప్రస్తావించడం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలో అనేకసార్లు ఆ పని చేసింది. పట్టని ప్రభుత్వాలకు అక్షింతలు వేసింది. ఏడు నెలల క్రితం ఏప్రిల్‌లో కూడా ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంలో స్పందిస్తూ, ఋతుకాలపు ఆరోగ్యంపై ఏకరూప జాతీయ విధాన రూపకల్పనకు కేంద్రాన్ని సుప్రీమ్ ఆదేశించింది. తాజాగా, కోర్ట్‌లో ప్రభుత్వ వకీలు పేర్కొన్నట్టు జాతీయ విధానం ముసాయిదాను కేంద్రం ఇటీవలే ఆన్‌లైన్‌లో పెట్టింది. సామాన్య ప్రజల మొదలు నిపుణుల దాకా అందరి అభిప్రాయాలు కోరింది. తద్వారా ఋతుస్రావం పట్ల తరతరాలుగా మన దేశంలో నెలకొన్న అనేక అపోహలనూ, సవాళ్ళనూ నిర్వీర్యం చేయాలన్నది ప్రయత్నం. అర్ధంతరంగా బడి చదువు మానేయడం సహా అనేక సమస్యలకు కారణమవుతున్న ఈ ఆరోగ్య అంశం పట్ల దృష్టి పెట్టడానికి స్వతంత్ర దేశంలో ఏడున్నర దశాబ్దాలు పట్టింది.

అలాగని అసలేమీ జరగలేదనలేం. కొన్నేళ్ళుగా ప్రపంచవ్యాప్తంగా ఋతుస్రావ కాల ఆరోగ్యం, పరిశుభ్రత (ఎంహెచ్‌హెచ్) పట్ల దృష్టి పెరుగుతోంది. భారత్‌లో సైతం ప్రజారోగ్య చర్చల్లో ఈ అంశాన్ని భాగం చేశారు. 'జాతీయ ఆరోగ్య మిషన్ 2011'లో గ్రామీణ ప్రాంతాల్లోని కౌమార బాలికల్లో ఋతుస్రావ కాలపు ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో దీన్ని చేర్చారు. కేంద్ర తాగునీటి, పారిశుద్ధ్య శాఖ సైతం 2015లోనే పాఠశాలలకు మార్గ దర్శకాలు జారీచేసింది. దాని ఫలితాలు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల్లో కొంత కనిపించాయి. పీరియడ్స్ వేళ ఆరోగ్యకరమైన పద్ధతులను పాటించడమనేది మునుపటి సర్వేతో పోలిస్తే, అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో 15 నుంచి 24 ఏళ్ళ వయసు యువతుల్లో 20 శాతం పెరిగింది. ఇది కొంత సంతోషకరం. పైగా, ఐరాస పేర్కొన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఎంహెచ్‌హెచ్ కూడా ఒకటనేది గమనార్హం.

నిజానికి, ఆంధ్రప్రదేశ్‌లో 'స్వేచ్ఛ', కేరళలో 'షీ ప్యాడ్', రాజస్థాన్‌లో 'ఉడాన్' ఇలా రకరకాల పేర్లతో వివిధ రాష్ట్రాలు కౌమార బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్కిన్లను పంపిణీ చేస్తున్నాయి. దీర్ఘకాలిక వినియోగ నిమిత్తం కేరళ, కర్ణాటకలు న్యాప్కిన్లకు బదులు ఋతుస్రావ కప్స్ అందిస్తున్నాయి. అయితే, సమాజంలోని దురభిప్రాయాలను పోగొట్టడమనే సవాలు మిగిలే ఉంది. పన్నెండేళ్ళ సోదరి దుస్తుల మీద ఉన్న తొలి ఋతుస్రావ రక్తపు మరకలను చూసిన ఓ అన్నయ్య ఆమెను అనుమానించి, కొట్టి చంపిన ఘటన ఆ మధ్య మహారాష్ట్రలో జరిగింది. ఆడవారికే కాక, మగవారికి సైతం పీరియడ్స్ పట్ల అవగాహన పెంచాలంటున్నది అందుకే. 'ఆ 3 రోజులు' ఆడవారిని ప్రాథమిక వసతులైనా లేని గుడిసెల్లో విడిగా ఉంచే మహారాష్ట్ర తరహా అమానుష పద్ధతుల్ని మాన్పించడం లక్ష్యం కావాలి. ఋతుక్రమం అపవిత్రత కాదనీ, శారీరక జీవప్రక్రియనీ గుర్తెరిగేలా చేయాలి.

తగిన ఎంహెచ్‌హెచ్ వసతులు లేకపోవడంతో ఏటా మన దేశంలో 2.3 కోట్ల మందికి పైగా బాలికలు అర్ధంతరంగా బడి చదువులు మానేస్తున్నట్టు సర్వేల మాట. సరిగ్గా చదువుకోని వారు ఋతుస్రావ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపలేకపోతున్నారన్నది దాని పర్యవసానం. అంటే, ఇది ఒక విషవలయం. దీన్ని ఛేదించాలి. బడిలో వసతులు పెంచడంతో పాటు జాతీయ విధానం ద్వారా ఆరోగ్యంలో, సామాజిక అనాచారాలను మాన్పించడంలో టీచర్లు కీలక పాత్ర పోషించేలా తగిన శిక్షణనివ్వాలి. విధానాల నిర్ణయం, కార్యక్రమాల రూపకల్పనలో తరచూ ఓ పొరపాటు చేస్తుంటారు. యువతుల మీదే దృష్టి పెట్టి, ఋతుక్రమం ఆగిపోయిన లక్షలాది మహిళల ఆరోగ్యాన్ని విస్మరిస్తుంటారు. అది మారాలి. మెనోపాజ్ అనంతర ఆరోగ్యం, అపోహల నివృత్తిపైనా చైతన్యం తేవాలి. ఆరోగ్య కార్యకర్తలకు అందుకు తగ్గ శిక్షణనివ్వాలి. ప్యాడ్ల పంపిణీతో బాధ్యత ముగిసిందనుకోకుండా సంక్లిష్ట సామాజిక అంశాలపై జనచైతన్యం ప్రధానాంశం కావాలి.

ఇన్నేళ్ళకు ఒక జాతీయ విధానం తేవడం విప్లవాత్మకమే కానీ దానితో పని సగమే అయినట్టు! గ్రామప్రాంతాల్లోనూ అందరికీ అందుబాటు ధరలో న్యాప్కిన్లుండాలి. శుభ్రమైన మరుగుదొడ్లు, నీటి వసతి బడిలో భాగం కావాలి. ఆరోగ్యం, ఆచారం లాంటి అంశాల్లో తరతరాలుగా సమాజంలో నెలకొన్న అభిప్రాయాలను పోగొట్టడం సులభం కాకపోవచ్చు. కానీ, అందుకు ప్రయత్నించకపోతే నేరం, ఘోరం. ఋతుస్రావ ఆరోగ్యంపై చైతన్యం తేవడంలో భారత్ మరింత ముందడుగు వేసేందుకు సత్వర జాతీయ విధానం తోడ్పడితే మేలు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సైతం ఏళ్ళు పూళ్ళు తీసుకొని, మరో అయిదేళ్ళ తర్వాత అమలు అంటున్న పాలక వర్గాలు ఆకాశంలో సగమనే ఆడవారి తాలూకు శారీరక, మానసిక ఆరోగ్యం గురించి వెంటనే పట్టించుకుంటే అదే పదివేలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.2.21 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** అనూరాధ తె.4.10 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.7.54 నుండి 9.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.26 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** సా.5.36 నుండి 7.13 వరకు

సూర్యోదయం: 6.08
సూర్యాస్తమయం: 5.21
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

వ్యర్థాలూ ఆదాయ మార్గం కావాలి!



అభిప్రాయం
టి.కె. అరుణ్

పంట వ్యర్థాలను సేకరించే శ్రమను తీసుకోవాలంటే రైతులకు ఒక ప్రేరణ అవసరం. అన్ని రకాల వ్యవసాయ వ్యర్థాలూ ఎరువులను ఉత్పత్తి చేయడానికి అనువైనవి. దీని నుంచే వచ్చే ఘన ఎరువు స్వయంగా ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు. ఇందులో వెలువడే మీథేన్‌ను వెంటనే వాడుకునే వీలుగా వేరే చోటికి పైపుల ద్వారా తరలించాలంటే, దానిలోని ఇతర వాయువులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రాంతంలో లభించే పంట అవశేషాలు, ఇతర వ్యవసాయ వ్యర్థాల పరిమాణంపై ప్రభుత్వం నమ్మదగిన అంచనాలతో ముందుకు వస్తే, వ్యవస్థాపకులు తగిన పరిమాణాలలో బయోడైజెస్టర్లను ప్లాన్ చేయవచ్చు. అప్పుడు కాలుష్యానికి కారణమయ్యేలా పంట వ్యర్థాలను వృథాగా కాల్చే పనివుండదు.

ప్రభుత్వ సీనియర్ అధికారులు కచ్చితంగా క్వాంటమ్ కణాలకు చాలా భిన్నమైనవారు. అయినప్పటికీ, కణాలకూ, అధికారులకూ ఒక సారూప్యమైన గుణం ఉంటుంది. గమనించినప్పుడు స్థితి మార్చుకోవడం! పరిశీలనకు సంబంధించిన తక్షణ చర్యే మార్పును ప్రేరేపిస్తుంది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం పంట అవశేషాల దహనానికి స్వస్తి చెప్పాలని ఉత్తర భారత రాష్ట్రాల అధికారులను ఆదేశించినందున, అది ఎలా చేయాలో వారికే వదిలేస్తే, మనం ఎంతో కొంత చర్యను ఆశించవచ్చు. తదుపరి పంటను వేయడానికి తమ పొలాల్లోని పంట అవశేషాలను తొలగించాల్సిన రైతులతో విభేదాలు లేకుండా కోర్టు ఆదేశాలపై ఎలా చర్య తీసుకోవాలనే విషయంపై ఇక్కడ కొన్ని సూచనలు ఉన్నాయి.

ప్రపంచంలోని ఐదు అత్యంత కాలుష్య నగరాలలో నాలుగు దక్షిణాసియా నగరాలే. అవి: లాహోర్, ఢిల్లీ, ముంబై, ఢాకా. భారత దేశం, పాకిస్తాన్ సరిహద్దుకు ఇరువైపులా ధాన్యాన్ని వేరుచేసిన తర్వాత పొలాల్లో మిగిలినదాన్ని తగుల బెట్టే ఆచారం సమస్యలకు కారణం అవుతోంది. వాస్తవానికి, గాలిలో సాంద్రతలో ఈ మసి గరిష్ఠంగా 40 శాతం వరకు ఉంటుంది. దీంతో గాలి వేగాన్ని తగ్గించే వాతావరణం ఏర్పడడం వల్ల, కురుస్తున్న వర్షాన్ని అరికట్టడం వల్ల ఈ కాలుష్య కారకాలు చాలాకాలం పాటు అలా గాలిలో నిలిచివుంటాయి. ఇది గాలి నాణ్యతను గణనీయంగా క్షీణింపజేస్తుంది.

వాహనాల పొగ, నిర్మాణపరమైన పనుల వల్ల ఏర్పడే దుమ్ము కాలుష్య కారకాలలో ఎక్కువ భాగంగా ఉంటున్నాయి. ఈ కాలుష్య మూలాలను అరికట్టడం చాలా కష్టం. వాహనాల కాలుష్యాన్ని తొలగించాలంటే, శిలాజ ఇంధనాలను వినియోగించే అంతర్గత దహన యంత్రాల స్థానంలో వాహనాలకు విద్యుచ్ఛక్తిని ఇవ్వాల్సి ఉంటుంది. శుభ్రపర్చిన ఇంధనాలు, మెరుగైన ఇంజన్లు తాత్కాలికంగా సహాయపడతాయి. కాలుష్య కారక వాహనాలను శుభ్రపరిచి వాటిని మార్చే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దీనికి సమయం పడుతుంది. రోడ్లపై నుండి వాహనాలు వెలువరించే ధూళిని ఎలా తగ్గించవచ్చు అంటే... అన్ని రోడ్ల పక్కన బహిర్గతమైన నేల, బహిరంగ ప్రదేశాలను కప్పడానికి గడ్డిని నాటడం ద్వారా. వెంటనే మొదటి గాలికే దుమ్మును దులిపే రకం చెట్లను కాకుండా, ఆ దుమ్మును నిలుపుకోగలిగే పచ్చదనాన్ని నాటడం కూడా మేలుచేస్తుంది. అయితే ఎడారి నేల మీదుగా వీచే గాలుల ద్వారా కొట్టుకువచ్చే దుమ్మును తగ్గించడానికి చేయగలిగేది తక్కువ.

నగరాల్లో జరిగే నిర్మాణ పనుల్లో దాని స్థానిక రూపంలోని పొడి సిమెంట్‌ను కాకుండా ముందే కలిపిన కాంక్రీట్‌ను మాత్రమే ఉపయోగించేట్టు చేయాలి. కాంక్రీట్ కలపడం కూడా బహిరంగంగా కాకుండా పరివేష్టిత ప్రదేశాలలో జరగాలని పట్టుబట్టడం ద్వారా చాలావరకు నిర్మాణాల పరమైన ధూళిని అరికట్టవచ్చు. ఇవి అవసరమైన చర్యలు.



సంపూర్ణంగా ఆచరణీయమైనవి. అలాగని 19వ శతాబ్దానికి చెందినట్లుగా ఇంకా పంట అవశేషాలను తగులబెట్టడం కొనసాగాలని అర్థం కాదు. ఆ అలవాటు అంతరించిపోవాలి. కానీ ఎలా?

పంట వ్యర్థాలు, అలాగే అన్ని రకాల వ్యవసాయ వ్యర్థాలు, జీవ జీర్ణక్రియలో చిక్కుకున్న శక్తిని విడుదల చేయడానికీ, ఎరువులను ఉత్పత్తి చేయడానికీ అనువైనవి. నీటి ఆవిరి, కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, పేడనీళ్లతో కలిపిన మొక్కల అవశేషాలు మీథేన్‌గా కుళ్లిపోతాయి. దీని నుండి అవసరమైతే ఘన ఎరువులను తీయవచ్చు. దీనికిదే స్వయంగా ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు. ఇందులో వెలువడే మీథేన్‌ను వెంటనే వాడుకునే వీలుగా వేరే చోటికి పైపుల ద్వారా తరలించాలంటే, దానిలోని ఇతర వాయువులను శుభ్రం చేయాల్సి ఉంటుంది.

బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించడం, వాటిని నిర్వహించడం అనేవి వ్యవసాయానికి భిన్నమైన కార్యకలాపాలు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్వాహకులు కొనుగోలు చేయగలిగిన పంట అవశేషాలను కుప్పలుగా సేకరించడానికి రైతుకు ఒక ప్రేరణ అవసరం. పంట వ్యర్థాలను వదిలించుకోవడానికి ఒక మార్గం ఏమిటంటే, హ్యాపీ సీడర్ అనే యంత్రాన్ని ఉపయోగించడం. ఇది పొలాల నుండి వ్యర్థాలను అటు తీస్తూనే, ఇటు తదుపరి పంట విత్తనాలను నాటుతుంది. ఆ వ్యర్థాలను పొలంలోనే నశించేట్టు చేస్తుంది. అయితే ఈ పరికరం విస్తృతమైన కొనుగోలుకు లేదా అద్దెకు నోచుకోలేదు. తదుపరి పంటను నాటడానికి ఉన్న విరామం చాలా స్వల్పం. రైతులందరికీ ఆ వ్యవధిలో పని చేయడానికి సరిపడా హ్యాపీ సీడర్లు అందుబాటులో లేవు.

బయోగ్యాసును ఉత్పత్తి చేసే శక్తిమంతమైన కొత్త పరిశ్రమకు ముడి పదార్థంగా ఈ పంట అవశేషాలను అందించడమే మేలైన ప్రత్యామ్నాయంగా కనబడుతోంది. దీనిద్వారా రైతులు తమ పంట అవశేషాలను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతారు. పైగా సింథటిక్ ఎరువుల ధరతో పోల్చదగిన ధరకు సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంటాయి. కానీ పంట అవశేషాలు అనేవి చురుకైన కాలుష్య కారకాల నుండి అదనపు వ్యవసాయ ఆదాయానికి పనికొచ్చే ప్రయోజనకరమైన ప్రవాహంగా మారడం దానంతటదే జరగదు. దానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బయోడైజెస్టర్లు వివిధ స్థాయిల సాంకేతిక అధునాతనత్వంతో రావచ్చు. ఇది ఎక్కువగా ముడి పదార్థంగా ఉపయోగించే వివిధ రకాల సేంద్రియ పదార్థాల ముందస్తు చికిత్సపై ఆధారపడి ఉంటుంది. ఒక భారతీయ బహుళజాతి సంస్థ బయోగ్యాస్ కోసం పెద్ద ప్రణాళికలను కలిగి ఉంది. బహుశా అధునాతన బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించి సరఫరా చేస్తుంది. ఇది ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లో చెరకు పంట వ్యర్థాలను నిర్వహిస్తోంది.

ప్రతి ప్రాంతంలో లభించే పంట అవశేషాలు, ఇతర వ్యవసాయ వ్యర్థాల పరిమాణంపై ప్రభుత్వం నమ్మదగ్గ అంచనాలతో ముందుకు వస్తే, వ్యవస్థాపకులు తగిన పరిమాణాలలో బయోడైజెస్టర్లను ప్లాన్ చేయవచ్చు. ఈ ప్రక్రియ పట్ల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు బాగా ఆలోచించి సబ్సిడీతో బలం చేకూర్చినప్పటికీ, ప్లాంట్లను నిర్మించడం, గ్యాసు కోసం పైప్‌లైన్ నెట్వర్క్ వేయడం, గ్యాసును ఎలా ఉపయోగించాలో నిర్ణయించడం వంటి వాటికి కాస్త సమయం పడుతుంది.

అయితే ఇప్పుడు పంట వ్యర్థాలను తగలబెట్టడం ఆపేయాలని కోర్టు ఆదేశం. దీని వల్ల మంటలను ఎలాగైనా ఆర్పడానికి పోలీసులను ఉపయోగించాలనే ఆలోచన కలిగించవచ్చు. ఇది ఓటర్లుగా కూడా ఉన్న రైతుల్లో భిన్నమైన మంటలను రేకెత్తిస్తుంది. అందువల్ల పంట వ్యర్థాలను సేకరించడం, నిల్వ చేయడమే సరైన పరిష్కారం. వ్యర్థాలను బయటకు తీయడానికి, రవాణా చేయడానికి రైతులకు అయ్యే ఖర్చును భరించడానికి ఒక సేకరణ ఏజెన్సీ సరిపోతుంది. భాక్రానంగల్ డ్యామ్ నిర్మిస్తున్నప్పుడు, దాని నిర్మాణానికి చెల్లించాల్సిన పన్ను గురించి రైతులు నిరసన వ్యక్తం చేసినప్పుడు, రాజకీయ నాయకులు, సీనియర్ అధికారులు ఆ ప్రాంతాన్ని రైతులు సందర్శించేలా చూశారు. తమ ముందు రూపుదిద్దుకుంటున్న ఆధునిక అద్భుతాన్ని స్వయంగా చూసేందుకు రైతులను ప్రాజెక్ట్ స్థలానికి తీసుకెళ్లారు. ప్రతాప్ సింగ్ కైరోన్(పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి), అప్పటి వ్యవసాయ కార్యదర్శి ఆర్ఎస్ రంధావా, అప్పటి శాఖ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ సింగ్ వంటి వారు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించారు. రైతులు మరింత ఆహారాన్ని పండించాలనీ, మార్పునకు ఏజెంట్లుగా ఉండాలనీ కోరారు. నేడు పంజాబ్‌లోని రాజకీయ, పరిపాలనా నాయకులు మార్పుకు ఏజెంట్లుగా మారడానికి అవకాశం ఉంది. అయితే వారు ఈ సందర్భానికి తగినట్టుగా ప్రవర్తించగలరా అనేది ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉన్నదే!



యూదు వ్యతిరేకత అనేది కొత్తగా పెరిగిందేమీ కాదు. కాకపోతే కొన్ని వారాలుగా పదులు, వేలమంది ధైర్యంగా తమను తాము వ్యక్తపరుచుకుంటున్నారంతే. అదే తేడా!

- కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యాఖ్యాత

బాగా చేస్తున్నారు!



మా కంపెనీకి 2023-24 సంవత్సరానికి గానూ ఇన్‌కమ్ టాక్స్ రిటర్నులు ఫైలింగ్ చేసిన మూడు వారాల్లోనే ఆదాయ పన్ను డబ్బు వాపసు వచ్చింది. ఇంత వేగంగా, కచ్చితంగా పని జరగడం ఇంతకుముందు వినలేదు. ఆదాయ పన్ను శాఖ చూపుతున్న సామర్థ్యం, పారదర్శకత నమ్మలేనట్టుగా ఉంది. ఈ పనితీరు నచ్చింది, సంభ్రమం కలిగించింది.

- ఆర్. మాధవన్, నటుడు

అన్యాయం



బ్రిటన్‌లో వెన్నెముక ఉన్న ఒకే ఒక్క రాజకీయ నేత సువెల్లా బ్రేవెర్‌మాన్‌ను హోం మంత్రిగా తొలగించడం సిగ్గుచేటు. ప్రధాని రిషీ సునాక్ ఆమెకు అండగా నిలబడలేకపోయారు.

- హారిస్ సుల్తాన్, యాక్టివిస్ట్

అసలు బాధ్యత



బ్రిటన్ హోం మంత్రిగా నియమితుడిని కావడం నాకు దక్కిన గౌరవం. లక్ష్యం స్పష్టం. ఈ దేశంలోని ప్రజలందరినీ సురక్షితంగా ఉంచడం నా బాధ్యత.

- జేమ్స్ క్లెవెర్లీ, బ్రిటన్ నూతన హోంమంత్రి

తగని పని



'టైగర్ 3' సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్‌లో టపాకాయలను కాల్చినట్టుగా విన్నాను. అది ప్రమాదకరం. మనల్నీ, ఇతరులనూ ప్రమాదంలోకి నెట్టకుండా సినిమాను ఎంజాయ్ చేద్దాం. సురక్షితంగా ఉండండి.

- సల్మాన్ ఖాన్, నటుడు

మంచి ఆటగాళ్లు



రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్), శ్రేయస్ అయ్యర్ (ఇండియా), మార్కో జాన్ సెన్ (దక్షిణాఫ్రికా), అజ్మతుల్లా ఒమర్జాయి (అఫ్గానిస్తాన్), దిల్‌శాన్ మదుశంకా (శ్రీలంక) - ప్రపంచ కప్‌లో కొత్తగా ఆడుతున్న ఈ ఐదుగురు క్రికెటర్లు నాకు ఎంతగానో నచ్చారు. వీళ్ల ఆటతీరు వీరిని ఎంతో ఎత్తుకు ఎదిగేలా చేస్తుంది. మీకు నచ్చిన ఐదుగురు ఎవరు?

- ఇర్ఫాన్ పఠాన్, మాజీ క్రికెటర్

సహించరా?



బక్రీద్ రోజున అనాలోచితంగా జంతువులను చంపడం గురించీ, మసీదుల్లో లౌడ్ స్పీకర్ల గురించీ, కొత్త సంవత్సరం రోజున అక్కర్లేని టపాకాయల గురించీ, ప్రేమికుల దినోత్సవం రోజున మద్యం, మాదక ద్రవ్యాల వాడకం గురించీ, ఖరీదైన పెళ్లిళ్లలో డబ్బులు, ఆహారం వృథా చేయడం గురించీ నేను వ్యాఖ్యానిస్తూనే ఉంటాను. కానీ ఎందుకో దీపావళి కాలుష్యం గురించి ఎత్తితే మాత్రం నేను హిందూ ద్వేషిని అయిపోతాను.

- యానా మీర్, యాంకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

పెద్దలకో విజ్ఞప్తి!

పెద్దలు ఎప్పుడూ పిల్లలకి బుద్ధులూ, సద్దిమూట సుద్దులూ చెబుతారే గానీ తాము వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మాత్రం పట్టించుకోరు. పిల్లల్ని చూస్తే రైతన్న దున్నగా విత్తడానికై సంసిద్ధంగా ఉన్న మెత్తటి నేలలు గుర్తొస్తాయి. 'యథా బీజం తథోత్పత్తిః' అన్నట్టుగా మనం ఏ బీజాలైతే చల్లుతామో, అవే మొలకెత్తుతాయి. వాటి ఫలాలే లభిస్తాయి. అంటే ఇక్కడ రైతన్న పాత్ర పోషించేది పెద్దలే. ఏమీ తెలియని వయసులో ఈ బాలలు పెద్దల చేతికి అందిన మట్టి ముద్దలు. ఇక్కడనే ఒక పెద్దగా మన బాధ్యత కాస్త గుర్తెరగాలి.

రోజువారీ యాంత్రిక జీవనంలో పిల్లల్ని పట్టించుకునే తీరిక ఎవరికీ ఉండడం లేదు. వారిని ఎవరికో ఒకరికి అప్పగించాల్సి వస్తోంది. ఎక్కువ కాలం పిల్లలతో గడిపేవారి ప్రభావాలే పిల్లలపై పడతాయనేది గమనార్హం. బడిలో చేర్చేస్తే చాలు పిల్లలు చక్కగా తయారైపోతారని అనుకుంటారు. కానీ ఇంటిల్లిపాదీ ఒక ప్రాక్టికల్ రంగస్థలం అని తెలుసుకోవాలి.

పిల్లవాని మనస్తత్వంపై ఆతడు చేసే సహవాసం అత్యంత ప్రభావం చూపుతుంది. అలాగే సెల్ ఫోన్, ట్యాబ్‌లు వంటివి చూపే ప్రభావం అంతా ఇంతా కాదు. పిల్లలందరూ లోతైన ఊర బావి లాంటి వారు. పిల్లలు దేవునితో సమానం అనే మాటను గుర్తు చేసుకొని, దైవారాధనకు ఎంత నిష్ఠగా కూర్చొంటామో, పిల్లల్ని సక్రమ పద్ధతిలో పెంచే పవిత్ర కార్యక్రమం కూడా అంతే శ్రద్ధగా పాటించాలి. పిల్లల్లోని సద్గుణాల్ని వ్యవసాయం చేసి వెలికి తీయాలని భగవద్గీత చెబుతూ ఉంది. పిల్లలు చేసే ప్రతీ పనినీ ప్రోత్సహించాలి. తప్పులుంటే వారిని అవమాన పరచి, వారిలోని జిజ్ఞాసను అణచి వేయగూడదు. వారిని దగ్గరకు పిలుచుకొని హక్కున చేర్చుకోవాలని ప్రభువు చెబుతాడు. పరలోకం చేరాలంటే మీరు పసిపిల్లల్లా కావాలని సూచిస్తాడు.

- డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు । విజయవాడ

బాలల వికాసం కోసం ఏం చేస్తున్నాం?



సందర్భం
వారాల ఆనంద్

పిల్లల మనో వికాసానికీ, సమగ్ర ఎదుగుదలలో సాహిత్య, సాంస్కృతిక అంశాల పాత్ర ఎంతో ఉంది. చదువు మేధస్సు ఎదుగుదలకూ, క్రీడలు శారీరక ఎదుగుదలకూ తోడ్పడితే సాంస్కృతిక విషయాలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. వారిలో సాటి మనిషిని ప్రేమించే తత్వాన్ని ఇస్తాయి. సాంస్కృతిక విషయాల్లో అధ్యయన అంశాలు, దృశ్య మాధ్యమాలు పిల్లల పైన అనితర సాధ్యమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. అయితే మనం నవంబర్ నెలలో నెహ్రూ జయంతి సందర్భంలో మాత్రమే పిల్లల గురించి మాట్లాడతాం. తర్వాత మరచిపోతాం. ఏ రాజకీయ పార్టీ కూడా బాలల కోసం ఏదయినా చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం ప్రకటించదు. అన్ని పథకాలూ ఓటర్ల కోసమే. బాలలు ఓటర్లు కాదు కనుక వాళ్ళకోసం ఎలాంటి ఆలోచనా లేదు, రాదు.

అంతేకాదు బాలల కోసం ప్రత్యేకంగా రాసేవాళ్ళు తక్కువ. రాసిన వాళ్ళకు ప్రోత్సాహకాలు తక్కువ. పిల్లల పుస్తకాలకు మార్కెట్ తక్కువ. పిల్లల్ని చేరే సాహిత్యం తక్కువ. కథలు లేదా కవితలు రాయడానికి పిల్లల్ని ప్రోత్సహించడం అరుదు. పిల్లల్ని మార్కుల వెంట పరుగెత్తిస్తాం. మెరిట్ అంటూ హింస పెడతాం. అంతేకాని పిల్లలను సాహిత్య పఠనం వైపుకానీ, రచన వైపుకానీ ప్రోత్సహించం. కేవలం బెంగాలీ, మలయాళం, కన్నడ, మరాఠీ భాషల్లో తప్ప మిగతా ఇతర భాషల్లో బాలసాహిత్యం తక్కువ.

ఇక 'బాలల సినిమాల'ది మరీ దారుణమయిన పరిస్థితి. మలయాళం, బెంగాలీ లాంటి కొన్ని భాషల్లో వేళ్ళ మీద లెక్కించే కొన్ని మంచి సినిమాలు మాత్రం తీశారు. ఇక ముంబై లోని బాలల చిత్ర సమితి (చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా) నిర్మించిన వందలాది పిల్లల సినిమాలు ప్రదర్శనకు నోచుకోకుండా ముంబైలో పడి ఉన్నాయి. ఈ సంస్థ ప్రథమ భారత ప్రధాని నెహ్రూ ఆలోచనల మేర నియమితమైన ఎస్.కె. పాటిల్ కమిటీ సూచనల ప్రకారం 1955లో ఏర్పాటయింది. చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ చురుగ్గా ఉన్నప్పుడు ముఖ్యంగా కేదార్ శర్మ, భీమ్



సేన్, జయా బచ్చన్, సాయి పరంజపే, గుల్జార్ తదితరులు దానితో వున్నప్పుడు ఎన్నో గొప్ప సినిమాలు వచ్చాయి.


బాలల కోసం సినిమాలు నిర్మించడం, నిర్మాతలకు ఆర్థికంగా సహాయం చేయడం, రెండేండ్లకోసారి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు నిర్వహించడం ఈ సంస్థ ప్రధాన కర్తవ్యాలు. అందులో భాగంగానే దేశంలోని వివిధ నగరాల్లో 1979 నుంచి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్ని నిర్వహిస్తూ వస్తున్నది. 1995లో మొదటిసారిగా మన హైదరాబాద్‌లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు నిర్వహించారు. తర్వాత 1999లో మరోసారి నిర్వహించారు. అనంతరం బాలల చిత్రోత్సవాలకు ఒక శాశ్వత వేదిక ఉండాలని హైదరాబాద్‌ని ప్రతిపాదించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇతోధిక సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. చిల్డ్రన్స్ ఫిలిమ్ సొసైటీకి భూమి ఇస్తామని అన్నది. భూమి ఇచ్చినట్టే ఇచ్చారు కానీ అధీనం చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదేమీ జరగ లేదు. ఇంతలో కేసులు వగైరాలతో అది మూల బడింది. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం హైదరాబాద్‌లో టూరింగ్ ఫెస్టివల్ గానే మిగిలిపోయింది. చిల్డ్రన్ ఫిలిమ్ సొసైటీ అధికారులు రెండేండ్లకోసారి హైదరాబాద్ వచ్చి ఏదో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నిర్వహించాము అనిపించి, అది అయిపోగానే పెట్టె బేడా సర్దుకుని వెళ్ళి పోయే వాళ్లు. ఇప్పుడు అదీ లేదు.

అంతర్జాతీయ స్థాయిలో ఇరాన్, రష్యాల నుంచి వచ్చిన పిల్లల సినిమాలు అద్భుతంగానూ, భావస్ఫోరకంగానూ ఉంటాయి. అవి మొత్తం ప్రపంచాన్ని కట్టి పడేశాయి. ఇరాన్ సినిమాలకున్న నేపథ్యం మనకూ ఉన్నది. కావలసిందల్లా ఇరాన్‌లో లాగా ప్రభుత్వం తోడ్పాటును అందించాల్సి ఉన్నది. మన దర్శకులు కూడా రొడ్డకొట్టుడు నీతి బోధల సినిమాలు కాకుండా భిన్నంగా బాలల మనసుల్ని గెలుచుకునే సినిమాలు నిర్మించగలిగితే తెలంగాణ గొప్ప బాలల చిత్రాలకు వేదికయ్యే అవకాశం ఉన్నది. బాలల కోసం ప్రత్యేకంగా ఆలోచించాల్సి ఉంది. పిల్లల కోసం ఎవరయినా ఏ కొంత చేసినా ఎంతో చేసిన వాళ్ళవుతారు.

వ్యాసకర్త ప్రముఖ సినీ విశ్లేషకుడు
(నేడు బాలల దినోత్సవం)

భగవంతుడి సృష్టి

ఒక ఆశ్రమంలో గురువు శిష్యులకు ఒక కథ చెబుతున్నారు. ''అనగనగా ముగ్గురు సాధువులు ఉండేవారు. వారు పుణ్యం చేయడంతో దేవదూతలు స్వర్గానికి తీసుకుపోతున్నారు. అప్పుడు మార్గమధ్యంలో ఒక డేగ ఒక పాముని నోట కరచుకుని పోతుండటం సాధువులు చూశారు. అయితే ఆ సాధువులలో ఒకరు 'పాముని వేధించడం పాపం. కనుక దానిని విడిచి పెట్టు' అని డేగతో అన్నాడు. ఈ మాట విన్న దేవదూతలు ఆ సాధువుని వెంటనే నెట్టేశారు. దాంతో ఆ సాధువు భూలోకాన పడ్డాడు. ఇదంతా గమనించిన ఇంకొక సాధువు తనకూ అదే



జ్యోతిర్మయం

గతి పడుతుందేమోనని భావించి 'డేగా డేగా, పాములు ఈ ప్రపంచంలో బతకడం వల్ల మిగిలిన ప్రాణులకు ఎప్పటికైనా ప్రమాదమే, కనుక నువ్వు దాన్ని చంపడమే మంచిది' అన్నాడు. ఈ మాటలన్నీ విన్న దేవ దూతలు అతనిని కూడా భూలోకానికి నెట్టేశారు. అయితే మూడో సాధువు ఏమీ చెప్పకుండా జరిగినదంతా గమనిస్తూ మౌనంగా ఉండిపోయాడు. దేవ దూతలు అతనిని స్వర్గలోకానికి తీసుకుపోయారు' అని గురువుగారు కథ ముగించారు.

మొదటి ఇద్దరు సాధువులు ఎందుకు భూలోకానికీ, మూడో సాధువు స్వర్గానికీ పోవడానికి కారణమేమిటి అని ఆయన శిష్యులను ప్రశ్నించారు. గురువుగారి ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో శిష్యులకు తెలియలేదు. అందుకే గురువు గారినే విడమరిచి చెప్పమన్నారు.

'స్వర్గానికి వెళ్ళాలనుకున్నవారు భగవంతుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. భగవంతుడి సృష్టిలో ఫలానా ప్రాణి ఉండాలి అనీ, ఫలానా ప్రాణి ఉండకూడదనీ చెప్పే అర్హత సామాన్యుడైన మనిషికి లేద'ని వివరించారు గురువుగారు.

- యామిజాల జగదీశ్

ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా

● ప్రగతిభవన్‌లో 'కాంగ్రెస్ చేసిందేంది ?' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, జూలూరు


సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురుతుందని, సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని ఇప్పటికే ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంకలనం చేసిన 'కాంగ్రెస్ చేసిందేంది?' అనే పుస్తకాన్ని సోమవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వానికి ఆత్మలాంటిదని, రాష్ట్రానికి కేసీఆర్ ప్రాణమని ఈ సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కరువు, వలసలకు తెలంగాణ చిరునామాగా ఉండేదన్నారు. అయితే ఇప్పుడు బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం పసిడి పంటలకు చిరునామాగా వర్ధిల్లుతోందన్నారు. కాంగ్రెస్ ఏలుబడిలో తెలంగాణ మొత్తం సంక్షోభంలో కూరుకుపోగా బీఆర్ఎస్ అధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దేశానికే మోడల్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ అవకతవకలపై కళ్లకు కట్టినట్లుగా పుస్తకాన్ని వెలువరించిన జూలూరు గౌరీశంకర్‌ను కేటీఆర్ అభినందించారు.

కేసీఆర్‌కు కోటి అప్పు ఇచ్చిన వివేక్

● కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికీ కోటిన్నర అప్పు ఇచ్చారట
● ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి
● రాష్ట్రంలోనే అత్యధిక ఆస్తులున్న రాజకీయ నేతగా వివేక్


సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల అఫిడవిట్లలో ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. మంచిర్యాల జిల్లా చెన్నూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎంపీ వివేక్.. సీఎం కేసీఆర్‌కు రూ.కోటి అప్పు ఇచ్చినట్టుగా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా రామలింగారెడ్డికి రూ.10లక్షలు, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రూ.1.50కోట్లు అప్పుగా ఇచ్చినట్టు వెల్లడించారు. మొత్తంగా రూ.23.99 కోట్లను వ్యక్తిగత అప్పులు ఇచ్చినట్లుగా పేర్కొన్న వివేక్ ఆయనకు రూ.600కోట్ల ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. ఆస్తుల విషయంలో ఈ మాజీ ఎంపీ రాష్ట్రంలోనే అత్యధిక ఆస్తులున్న రాజకీయ నాయకుడిగా ఉన్నారు. ఆయన సతీమణి జి.సరోజ పేరుతో రూ.377కోట్లు ఉండగా, విశాఖ కంపెనీతో సహా పలు కంపెనీలు, మీడియా సంస్థల్లో పెట్టుబడులు ఉన్నట్లు తెలిపారు.

రెండో స్థానంలో పొంగులేటి: ఆ తర్వాత పాలేరు స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకే చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూ.460కోట్ల ఆస్తులతో ధనిక అభ్యర్థుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అధినేత సీఎ కేసీఆర్ తన అఫిడవిట్‌లో తన కుటుంబ ఆస్తులు రూ.59కోట్లు ఉన్నట్లు, సొంత కారు కూడా లేదని పేర్కొనడం తెలిసిందే.



Name(s). Amount outstanding, nature of Loan	2).G.Vivekanand, O/s. of Rs.1,06,00,000/- Intra Family Account dues: Payable To

కేసీఆర్ అఫిడవిట్



PERSONAL LOANS & ADVANCES RECEIVABLES

Description	Dr.G.VIVEKANAND
K.Chandra Shekar Rao	1,00,00,000
Ramalinga Reddy	10,00,000
Komati Reddy Raj Gopal Reddy	1,50,00,000

వివేక్ అఫిడవిట్

అయితే తాను మాజీ ఎంపీ వివేక్‌కు రూ.1.06కోట్లు అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మాజీ ఎంపీ వివేక్ సీఎం కేసీఆర్‌కు మధ్య లావాదేవీలు జరిగినట్లు, గతంలో టీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ సందర్భంగా ఈ డబ్బులు ఇచ్చినట్లు పార్టీ నాయకులు అనుకుంటున్నారు.



బజార్‌ఘాట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్



అగ్ని ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ వద్ద రసాయన డ్రమ్ములు

షార్ట్ సర్క్యూట్.. రసాయనాలు | 9 ప్రాణాలు బుగ్గి

హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం ● నాంపల్లి బజార్‌ఘాట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్ నాంపల్లి బజార్‌ఘాట్‌లోని బాలాజీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో సోమవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికీలలు ఎగసి పడటం, రసాయనాల వల్ల వెలువడిన పొగ పీల్చి అపస్మారక స్థితిలోకి చేరడం, ఆపై మంటలు అంటుకోవడంతో ఇద్దరు చిన్నారుల సహా తొమ్మిది మంది అసువులు బాసారు. మరో తొమ్మిది మందికి గాయాలు కాగా..వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మరణించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా అపార్ట్‌మెంట్‌లో ఉన్న మరో 21 మందిని అగ్నిమాపకశాఖ అధికారులు కాపాడారు. ఘటనాస్థలిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తలసాని, మహమూద్ అలీ తదితరులు సందర్శించారు. ప్రమాదంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి వచ్చిన కాంగ్రెస్ నాంపల్లి అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్‌ను ఎంఐఎం కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

గ్రౌండ్ ఫ్లోర్‌లో హార్డ్‌వేర్ గోదాం...

బజార్‌ఘాట్‌కు చెందిన రమేష్ జైస్వాల్‌కు స్థానికంగా బాలాజీ రెసిడెన్సీ పేరుతో అపార్ట్‌మెంట్ ఉంది. జీ+ఫోర్‌గా నిర్మితమైన ఇందులో ప్రస్తుతం ఎనిమిది ఫ్లాట్లు ఉన్నాయి. ఆరింటిలో వేర్వేరు కుటుంబాలు, నాలుగో అంతస్తులో ఉన్న రెండింటిలో కలిపి ఒకే కుటుంబం నివస్తోంది. నగర శివార్లలో ప్లాస్టిక్ పరిశ్రమ ఉన్న రమేష్ జైస్వాల్ నీలోఫర్ ఆస్పత్రి రోడ్డులో బాలాజీ హార్డ్‌వేర్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. తన పరిశ్రమకు, దుకాణానికి సంబంధించిన రసాయనాలు, వస్తువులను నిల్వ చేయడానికి బాలాజీ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్‌ను గోదాముగా మార్చుకున్నాడు. ఇందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఇందులో ఫైబర్ ఎయిర్ కూలర్ల బాడీలు తయారీకి వినియోగించే బెంజైల్ నైట్రేట్ (మిథైల్ బెంజిన్) టిన్నులు, గేట్లకు వాడే ప్లాస్టిక్ షీట్లు (పాలీ షీట్లు), ప్లాస్టిక్ కార్పెట్లతో పాటు వీటిని అతికించడానికి ఉపకరించే రెజిన్ రసాయనం డ్రమ్ములు నిల్వ ఉంచాడు. వీటితో పాటు ప్రింటింగ్ ప్రెస్‌లకు సరఫరా చేసే సామాగ్రిని కూడా దాచాడు. సమీపంలోని ఇంకో అపార్ట్‌మెంట్ వద్ద కూడా ఇలాంటిదే మరో గోదాం ఉంది.

ప్లాస్టిక్ బండిళ్లు కరిగి రోడ్డు పైకి..

ఉదయం 9.15 సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. నిప్పు రవ్వలు లోపల ఉన్న పాలీ షీట్లపై పడటంతో మంటలు చెలరేగాయి. తర్వాత రసాయనాలకు సైతం అంటుకోవడంతో పెద్దయెత్తున మంటలతో పాటు పొగ, విష వాయువులు వెలువడ్డాయి. మంటల్లో పాలీ షీట్లు ఇతర ప్లాస్టిక్ బండిళ్లు కరగడంతో మంటలతో కూడిన ఆ ద్రవం బయటకు రోడ్డుపైకి సైతం ప్రవహించింది. ఆ మంటలు కాస్తా రోడ్డుపై ఉన్న వాహనాలకు అంటుకున్నాయి.

రెండు, మూడు అంతస్తుల్లో ప్రాణ నష్టం

మొదటి అంతస్తులో నివసిస్తున్న కుటుంబాలు మంటలు గమనించి అప్రమత్తమై కిందికి వచ్చేశాయి. కొద్దిసేపటికే మంటలు, పొగ రెండు, మూడు, నాలుగు అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో నాలుగో అంతస్తులో ఎవరూ లేరు. రెండో అంతస్తులో నివసించే మహ్మద్ ఆజం (58), ఆయన భార్య రెహానా సుల్తానా (50), కుమారుడు హసీబ్ ఉర్ రెహ్మాన్ (32), చిన్న కుమార్తె ఫైజా సమీన్ (26), పెద్ద కుమార్తె తహోరా ఫరీన్ (35), ఈమె కుమార్తెలు తోబా (6), తరోబాలతో (13) పాటు మూడో అంతస్తులో నివసించే మహ్మద్ జకీర్ హుస్సేన్ (66), ఆయన భార్య నిఖత్ సుల్తానా (55) పొగ పీల్చడంతో అపస్మారక స్థితికి చేరుకుని మంటలు అంటుకోవడంతో మరణించారు. మరో 21 మందిని అగ్నిమాపక శాఖ అధికారులు రక్షించారు. వీరిలో కొందరికి కాలిన గాయాలయ్యాయని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెబుతున్నారు. తల్హా (19) అనే యువతి 75 శాతం కాలిన గాయాలతో ఉస్మానియాలో చికిత్స పొందుతున్నారు.



గోదాములో పాలీ షీట్లు

లోపలికి వెళ్లలేకపోయిన స్థానికులు..

సెలవు దినం కావడంతో సోమవారం ఉదయం బజార్‌ఘాట్ ప్రాంతంలో పెద్దగా హడావుడి లేదు. కాగా అగ్నిప్రమాదంతో అపార్ట్‌మెంట్‌తో పాటు బయటి వాహనాలూ దగ్ధమయ్యాయి. రసాయనాల డ్రమ్ములు పగిలిపోయాయి. కరిగిన ప్లాస్టిక్ ద్రవంతో పాటు మంటలూ రోడ్డు పైకి వచ్చాయి. రసాయనాల కారణంగా తీవ్రమైన ఘాటు వాసనలు వెలువడ్డాయి. దీంతో స్థానికులు అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చినా సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. ఏడు ఫైరింజన్లతో పాటు వచ్చిన అగ్నిమాకప శాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అపార్ట్‌మెంట్ కుడి భాగం తీవ్రంగా దెబ్బతింది. దీంతో మొత్తం భవనంలో ఎవరూ ఉండకుండా ఖాళీ చేయించారు. మంటలు ఆరిన తర్వాత కూడా డ్రమ్ముల్లోని రసాయనాలు వీధుల్లో మురిగి నీరులా ప్రవహించాయి. అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో పాటు స్థానికుల కాళ్ళు, వస్త్రాలు, పాదరక్షలకు ఇవి మందమైన పొరలా అంటుకున్నాయి. మేయర్ గద్వాల విజయలక్ష్మి, నాంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు తదితరులు కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఫైర్స్ డీజీ వై.నాగిరెడ్డి, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, డీసీపీ వెంకటేశ్వర్లు సహాయ చర్యలను పర్యవేక్షించారు. ఐపీసీతో పాటు ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసిన అధికారులు పరారీలో ఉన్న అపార్ట్‌మెంట్ యజమాని రమేష్ జైశ్వాల్ కోసం గాలింపు చేపట్టారు. మృతదేహాలకు ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

గవర్నర్, సీఎం సంతాపం

అగ్నిప్రమాదంలో 9 మంది మరణించడంపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి రెండురోజుల్లోగా నివేదిక అందజేయాలని సీఎస్‌ను గవర్నర్ ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

ఘటనా స్థలానికి కిషన్‌రెడ్డి, కేటీఆర్

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, హోం మంత్రి మహమూద్ అలీ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. నగరంలో తరచూ ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్రమంగా జనావాసాల్లో కార్ఖానాలు ఏర్పాటు చేయడమే ఇందుకు ప్రధాన కారణమని కిషన్‌రెడ్డి అన్నారు. వీటన్నింటినీ సుదూర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, పీఎం రిలీఫ్ ఫండ్ కింద త్వరలోనే సహాయం అందజేసే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాగా అగ్ని ప్రమాదంలో 9 మంది చనిపోవడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, ఈ ఘటనపై విచారణకు ప్రత్యేక కమిటీని వేస్తామని తెలిపారు. నగరంలో వెలిసిన ఫ్యాక్టరీలను శివారు ప్రాంతాలకు తరలించేందుకు ఆరు నెలల క్రితమే ఒక ప్రణాళిక రూపొందించామని, త్వరలోనే దీనిని అమలు చేసే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

అవి ప్రభుత్వ హత్యలే..

సీపీఐ నేతలు కె.నారాయణ, అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు కూడా బజార్‌ఘాట్‌ను సందర్శించారు. అగ్ని ప్రమాదం కారణంగా సంభవించిన తొమ్మిది మరణాలూ ప్రభుత్వ హత్యలేనని నారాయణ ఆరోపించారు. ప్రమాదానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ఇలావుండగా ఘటనా స్థలంలో కాంగ్రెస్ పార్టీ నాంపల్లి అసెంబ్లీ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కొందరు ఎంఐఎం కార్యకర్తలు ఆయన్ను అడ్డుకునే ప్రయత్నం చేయడం వాగ్వాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్వల్ప లాఠీఛార్జితో ఇరు వర్గాలకు చెదరగొట్టారు.

సెలవుల్లో పుట్టింటికి వచ్చి పిల్లలతో సహా..

అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఓ మహిళా డెంటల్ డాక్టర్ ఉన్నారు. రెండో అంతస్తులో నివసించే మహ్మద్ ఆజం పెద్దకుమార్తె తహోరా ఫరీన్ తన భర్త, ఇద్దరు కుమార్తెలతో కలిసి మెహదీపట్నం ప్రాంతంలో నివసిస్తోంది. తన కుమార్తెలకు వరుస సెలవులు రావడంతో శుక్రవారం రాత్రి పుట్టింటికి వచ్చింది. సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో కుమార్తెలతో సహా మరణించింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..



దాదాపు 25 ఏళ్లుగా అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో గోదాం కొనసాగుతోంది. గత ఏడాది వాచ్‌మెన్ కుమార్తె అక్కడున్న రసాయనాలతో ఆడుకుంటూ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆ తర్వాత అనేకసార్లు ఈ అక్రమ గోదాంపై అధికారులకు ఫిర్యాదు చేశా. కానీ వారు పట్టించుకోలేదు. రమేష్ జైస్వాల్‌కు ముందు ఆయన తండ్రి కూడా ఇలానే నిర్వహించారు.

– మేరీ ప్రియ పాల్, స్థానికురాలు

బతుకు'బండి'ని కోల్పోయా...



నా తండ్రి అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఇంటిలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. మేము కుటుంబంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్నాం. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఫుడ్ డెలివరీ చేయడాన్ని బతుకుతెరువుగా మార్చుకున్నా. నేను ప్రతిరోజూ బైక్‌ను అపార్ట్‌మెంట్‌కు, నా యజమాని ఇంటి మధ్య ముందు భాగంలో ఉంచుతా. ఆదివారం రాత్రి కూడా అలాగే పార్క్ చేశా. సోమవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ వాహనం కాస్తా కాలిపోవడంతో బతుకుతెరువు కోల్పోయా.

– కిషోర్

అన్నీ అడ్డగోలు ఉల్లంఘనలే!

● ఆ అపార్ట్‌మెంట్‌లో అనేక లోపాలు
● అగ్నిమాపక శాఖ పరిశీలనలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి/హిమాయత్‌నగర్: బజార్‌ఘాట్‌లో అగ్నిప్రమాదం జరిగిన బాలాజీ రెసిడెన్సీ నిబంధనల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. ఇందులో అడుగడుగునా అగ్నిమాపక నిబంధనలు (ఫైర్ సేఫ్టీ మెజర్స్) అతిక్రమించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అగ్నిమాపక శాఖ అధికారుల పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్, నాలుగు అంతస్తులుగా నిర్మితమైంది. అయితే దీని స్టెయిర్ కేస్ వెడల్పు ఒక మీటరు మాత్రమే ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ సహా ప్రతి అంతస్తు 354.66 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైంది. భవనం ముందు పక్క సెట్ బ్యాక్ ఏరియా లేదు. మిగిలిన మూడు పక్కల కేవలం 0.9 మీటర్లు చొప్పున మాత్రమే ఉంది. భవనం చుట్టూ ఫైరింజన్ తిరిగేలా ఖాళీ స్థలం ఉండాలన్న నిబంధన తుంగలో తొక్కారు. భవనంలో అగ్ని ప్రమాదం జరిగితే లోపల ఉన్న వాళ్ళు బయటపడటానికి వెలుపల వైపు స్టెయిర్ కేస్ ఉండాలి..కానీ ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌ను పార్కింగ్ కోసం వినియోగించాల్సి ఉండగా అక్రమంగా గోదాముగా మార్చారు.

అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణ

జీహెచ్ఎంసీ అధికారులు సైతం అపార్ట్‌మెంట్‌ను పరిశీలించారు. 1998లో దీన్ని నిర్మించినట్లు నిర్ధారించారు. అప్పట్లో 286 గజాల విస్తీర్ణంలో జీ+1 నిర్మాణానికి జైస్వాల్ అనుమతులు తీసుకున్నారు. మొత్తం ఐదంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మించి అద్దెలకు ఇచ్చారు. అయితే అక్రమంగా నిర్మించిన మిగతా అంతస్తులను 2008లో క్రమబద్ధీకరించుకున్నారని జీహెచ్ఎంసీ సర్కిల్–12 టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణమూర్తి తెలిపారు.

విడివిడిగా ఉండటమే కలిసొచ్చింది

● అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్‌లో ఎనిమిది ఫ్లాట్లు
● నాలుగు చొప్పున రెండు భాగాలుగా సాగిన నిర్మాణం
● రెండింటి మధ్య మెట్లు, లిఫ్ట్ ఉండటంతో వ్యాపించని మంటలు

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి/హిమాయత్‌నగర్: బజార్‌ఘాట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ నిర్మాణం తీరు ప్రాణనష్టం తగ్గించింది. దీని పక్కన ఉన్న మరో ఇల్లు కూడా వాళ్ళు నిర్మించుకున్న గోడ కారణంగా భద్రంగా ఉంది. లేనిపక్షంలో ఆస్తి, ప్రాణనష్టాలు పెరిగేవని పోలీసులు చెబుతున్నారు. ఈ అపార్ట్‌మెంట్‌ను జీ+4 విధానంలో నిర్మించారు. మధ్యలో లిఫ్ట్, మెట్లు ఉండగా... వీటికి కుడి వైపున నాలుగు, ఎడమ వైపున నాలుగు చొప్పున ఫ్లాట్లు ఉన్నాయి. కాగా షార్ట్ సర్క్యూట్‌తో ప్లాస్టిక్ టిన్నుల్లో నిల్వ ఉంచిన ఆర్గానిక్ సాల్వెంట్ మిథేల్ బెంజిన్‌కు మంట అంటుకుంది. లో ఫ్లాష్ పాయింట్‌తో కూడిన రసాయనమైన ఇది అంటుకోవడానికి అగ్ని, నిప్పు రవ్వలే అవసరం లేదని.. నిర్ణీత మోతాదుకు మించిన వేడి తగిలినా చాలని నిపుణులు చెబుతున్నారు. మిథేల్ బెంజిన్‌కు, సమీపంలోని డ్రమ్ముల్లో ఉన్న రెసిన్‌కు మంటలు అంటుకున్నాయి. వాటి చుట్టూ ఉంచిన ఫైబర్, ప్లాస్టిక్ షీట్ల కారణంగా అగ్ని కీలలు వేగంగా విస్తరించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని కుడి వైపు భాగంలో ఉన్న గోదాములో ఈ అగ్నిప్రమాదం జరిగింది. కొద్దిసేపట్లోనే మంటలు నాలుగో అంతస్తు వరకు వ్యాపించాయి. అయితే లిఫ్ట్, స్టెయిర్ కేస్ కారణంగా వీటి ప్రభావం ఎడమ వైపు ఉన్న భాగంపై పడలేదు. దీంతో అక్కడ నివసిస్తున్న వాళ్ళంతా సురక్షితంగా ఉన్నారు. ఇక అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్‌కు కుడి వైపున మరో భవనం నాలుగు అంతస్తులతో నిర్మితమై ఉంది. ఈ రెండింటికీ మధ్య రెండు అడుగుల దూరం మాత్రమే ఉంది. అయితే పక్క భవనం యజమానికి అపార్ట్‌మెంట్ వైపు బాల్కనీతో సహా ముందు వరకు గోడ నిర్మించారు. ఈ కారణంగా భవనంలోకి పొగ వచ్చినప్పటికీ మంటలు మాత్రం విస్తరించలేదు.

మధ్యప్రదేశ్ ఎన్నికల బందోబస్తుకు మన హోంగార్డులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న జరిగే మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు విధుల కోసం రాష్ట్ర పోలీస్‌శాఖలోని రెండు వేలమంది హోంగార్డులు సోమవారం తరలి వెళ్లారు. ఛింద్వారా, సియాన్ జిల్లాలలో బందోబస్తు విధుల్లో వీరు పాల్గొననున్నారు. హోంగార్డ్స్ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ మార్గదర్శకత్వంలో మధ్యప్రదేశ్‌కు వెళ్లిన హోంగార్డుల కంటిజెన్సీకి హోంగార్డ్స్ ఎస్పీ ఐఆర్ఎస్ భాస్కర్, ఏసీపీ ఎం.భాస్కర్ పర్యవేక్షకులుగా ఉన్నారు. హోంగార్డులు ఎన్నికల అనంతరం తిరిగి ఈ నెల 19న హైదరాబాద్ చేరుకుంటారని అధికారులు తెలిపారు.

772 సెట్ల నామినేషన్ల తిరస్కరణ

▶ మొదటి పేజీ తరువాయి

ఉపసంహరణకు గడువు ముగియనుంది.

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 నామినేషన్లను తిరస్కరించారు. నాగార్జునసాగర్‌లో నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి.. ప్రపోజర్స్ సంతకాలు సరిపడా చేయించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. తుంగతుర్తిలో కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలుచేసిన మోత్కుపల్లి నర్సింహులు అఫిడవిట్ అందజేయకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు.

● ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలుచేసిన పలువురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

అశ్రునయనాల నడుమ చంద్రమోహన్ అంత్యక్రియలు



నటుడు చంద్రమోహన్ అంతిమయాత్రలో పాల్గొన్న అభిమానులు

బంజారాహిల్స్(హైదరాబాద్): రెండురోజుల క్రితం కన్నుమూసిన ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఫిలింనగర్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య కొనసాగింది. కుటుంబసభ్యులు, పలువురు సినీప్రముఖులు చంద్రమోహన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. అనంతరం పంజగుట్ట శ్మశానవాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. అంతిమ సంస్కారాలను చంద్రమోహన్ సోదరుడు మల్లంపల్లి దుర్గాప్రసాద్ నిర్వహించారు. అంతిమయాత్రకు ముందు చంద్రమోహన్ భౌతికకాయానికి సినీప్రముఖులు వెంకటేశ్, రాజశేఖర్, జీవిత, ఆదిశేషగిరిరావు, మాదాల రవి తదితరులు నివాళులు అర్పించారు.

సీపీఎం మాజీ ఎంపీ వాసుదేవ్ ఆచార్య కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: సీపీఎం సీనియర్ నేత, 9 సార్లు పార్లమెంటుకు ఎన్నికైన వాసుదేవ్ ఆచార్య(81) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. యాప్రాల్‌లోని ఆయన భౌతికకాయానికి పలువురు కమ్యూనిస్టు నాయకులు నివాళులర్పించారు. ఆచార్య మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నట్లు కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాసుదేవ్ ఆచార్య పశ్చిమబెంగాల్‌లోని బంకూరా నుంచి తొమ్మిదిసార్లు ఎంపీగా ఎన్నికై సీపీఎం పార్లమెంటరీ పక్షనేతగా పనిచేశారని తెలిపారు. ఆచార్య భౌతికకాయానికి సీఐటీయూ అఖిలభారత నేత ఎం.సాయిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహారావు నివాళులర్పించారు. ఆచార్య అంత్యక్రియలు బెంగాల్‌లోని సొంత గ్రామంలో జరుగుతాయని తమ్మినేని వెల్లడించారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఆయన పార్లమెంట్‌లో గళమెత్తారని, వెలుపల అనేక సంఘాలను ముందుండి ఉద్యమపథాన నడిపించారని పలువురు నాయకులు గుర్తుచేశారు. ఆయన మరణం కార్మికులు, ఉద్యోగులు, పేద ప్రజలకు తీరనిలోటని పేర్కొన్నారు. ఆచార్య నిజమైన కమ్యూనిస్టు అని కొనియాడారు.

కాగజ్‌నగర్‌లో ఉద్రిక్తత

● బీఎస్పీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం
● ఇరువర్గాలపై కేసు నమోదు



పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్ టౌన్: ఎన్నికల వేళ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఎస్పీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పట్టణంలోని విజ యబస్తీ ఏరియా లో ఆదివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆ ఏరియాకు బీఆర్ఎస్ ప్రచార వాహనం రావడంతో సౌండ్ తగ్గించాలని బీఎస్పీ అభ్యర్థి, కార్యకర్తలు ప్రచార రథం డ్రైవర్ అలీంను కోరారు. ఈ క్రమంలోనే వాగ్వాదం చోటుచేసుకుని ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. గొడవకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేయాలని ప్రవీణ్‌కుమార్‌తోపాటు కార్యకర్తలు నాలుగు గంటలపాటు పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పతోపాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి లారీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ ప్రచార రథంపై దాడిచేసినట్లు డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బుద్దే స్వామి తెలిపారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కె.సురేశ్‌కుమార్‌ను తక్షణమే ఎన్నికల విధుల నుంచి తొలగించాలని ప్రవీణ్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. బీఎస్పీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం వెనుక కేసీఆర్, కేటీఆర్‌ల హస్తం ఉందని ఆయన ఆరోపించారు.

ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నాటకాలు

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రశాంత్ కిశోర్‌తో కలసి బీఆర్ఎస్ నాటకాలాడుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ కలసి ఎన్నికల సంఘం మీద ఒత్తిడి తెచ్చి తమకు అనుమతినిచ్చిన ప్రకటనలను కూడా నిలిపివేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాము ఎన్నికల ప్రకటనలను మీడియాలో ప్రసారం చేస్తున్నామని, వీటికి ఎన్నికల సంఘం కూడా అనుమతినిచ్చిందని చెప్పారు. అయితే ఇప్పుడు ఆ ప్రకటనలు ఆపాలని బీఆర్ఎస్ ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ దరిద్రపు పాలన పోవాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజలకు అన్నీ తెలుసునని, ప్రకటనలు ఆపినంత మాత్రాన ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి పోదని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు మార్పులు చేసిన ప్రకటనలే తామిస్తున్నామని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను సంప్రదిస్తామని చెప్పారు. అక్కడ న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామని కిరణ్‌రెడ్డి స్పష్టం చేశారు.

రత్నగిరిపై జ్యోతిర్మయి సత్యదేవ వ్రతానికి అనుమతి

అన్నవరం: కాకినాడ జిల్లా రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో మరో విశిష్ట వ్రతం నిర్వహణకు మార్గం సుగమమైంది. రూ.10,116 రుసుముతో 'జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం'నిర్వహించడానికి దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ అనుమతిచ్చినట్లు ఆలయ ఈవో ఎస్ఎస్ చంద్ర శేఖర్ అజాద్ సోమవారం తెలిపారు. రుసుము మొత్తంలో రూ.4,500 వ్రతంలో ఉపయోగించే పూజా సామగ్రికి, మిగిలిన రూ.5,616లో 40% పురోహితులకు పారితోషకంగా నిర్ణయించారు. ఈ వ్రతాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ వ్రతం నిర్వహణకు గాను రత్నగిరి రామాలయం పక్కన గల పాత అకౌంట్స్ కార్యాలయాన్ని జ్యోతిర్మయి సత్యదేవ వ్రతమండపంగా మారుస్తున్నారు. మొత్తం వ్రత మండపాన్ని ఏసీ చేయిస్తున్నట్లు ఈఓ తెలిపారు. అత్యంత మహిమాన్వితమైన ఈ వ్రతం ఆచరించేవారికి సకల కోరికలు నెరవేరతాయని దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ తెలిపారు.

క్లుప్తంగా...

ఖైదీల నుంచి కోట్లలో వసూళ్లకు పాల్పడ్డారు

ఢిల్లీ మాజీ మంత్రి జైన్‌పై సీబీఐ ఆరోపణలు

న్యూఢిల్లీ: జైలులో విలాసవంతమైన జీవితం గడిపేందుకు సుకేశ్ చంద్ర శేఖర్ వంటి హై ప్రొఫైల్ ఖైదీల నుంచి ఢిల్లీ జైళ్ల శాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్, ఆ శాఖ మాజీ డీజీ సందీప్ గోయెల్ కోట్లలో వసూళ్లకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపించింది. ఈ మేరకు వారిపై కేసు నమోదుకు అనుమతివ్వాల్సిందిగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాను కోరింది. సత్యేందర్ జైన్‌తోపాటు జైలు అధికారి రాజ్‌కుమార్‌లపై కేసు నమోదు కోసం లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాకు, సస్పెండైన ఐపీఎస్ అధికారి గోయెల్, రిటైర్డు ఐఏఎస్ ముకేశ్ ప్రసాద్‌లపై చర్యలకు కేంద్ర హోం శాఖకు వినతి పంపినట్లు సీబీఐ వివరించింది. వసూళ్లకు పాల్పడిన ఆరోపణలతో గత ఏడాది గోయెల్‌ను కేంద్ర హోం శాఖ సస్పెండ్ చేసింది. జైలులో విలాసవంతమైన జీవితం గడిపేందుకు మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్ 2018–21 సంవత్సరాల మధ్య సుమారు రూ.12.50 కోట్లను వేర్వేరు మార్గాల్లో వీరికి ముట్టజెప్పినట్లు తమకు సమాచారం ఉందని సీబీఐ అంటోంది.

మొయిత్రాకు తృణమూల్‌లో కొత్త బాధ్యత

కోల్‌కతా: డబ్బులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాకు పార్టీ కొత్త బాధ్యతలు అప్పగించింది. దీంతో 'నగదుకు ప్రశ్నలు' ఆరోపణలు ఎదుర్కొంటున్నా సరే తమ నేతకు అండగా ఉన్నామని టీఎంసీ పరోక్షంగా చెప్పినట్లయింది. మొయిత్రా ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గమైన కృష్ణానగర్ పరిధిలోని కృష్ణానగర్(నదియా నార్త్) జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా ఆమెను టీఎంసీ నియమించింది. ఈ మేరకు సోమవారం పార్టీ ఒక ప్రకటన చేసింది. డబ్బులు తీసుకొని ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలపై ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని వినోద్ సోంకార్ నేతృత్వంలోని లోక్‌సభ నైతిక విలువల కమిటీ.. స్పీకర్ బిర్లాకు సిఫార్సు చేయడం తెల్సిందే. తనకు కొత్త బాధ్యతలు అప్పగించడంపై మొయిత్రా తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో స్పందించారు. జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన పార్టీ చీఫ్ మమతా బెనర్జీకి కృతజ్ఞతలు తెలిపారు.

స్ఫూర్తిదాయక పని కోసం సెలవు

నైరోబీ: కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం కోసం జాతీయ సెలవు దినాన్ని ప్రకటించి కెన్యా తన సామాజిక స్పృహను చాటుకుంది. దేశంలోని వారంతా మొక్కలు నాటే కార్యక్రమంలో విధిగా పాల్గొనేందుకు వీలుగా నవంబర్ 13(సోమవారం) రోజున దేశవ్యాప్త సెలవు ప్రకటిస్తున్నట్లు ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే పది సంవత్సరాల్లో 1,500 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణ మార్పులు, అడవుల నరికివేత, వాయు కాలుష్యం సమస్యలతో సతమతమవుతున్న కెన్యాను కాపాడేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ప్రస్తుతం దేశ విస్తీర్ణంలో కేవలం ఏడు శాతంగా ఉన్న అడవులను 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. సోమవారం నాటి కార్యక్రమం కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా 15 కోట్లకుపైగా మొక్కలను ప్రభుత్వ నర్సరీల్లో పౌరుల కోసం అందుబాటులో ఉంచింది. వీటిని ప్రభుత్వ ఏజెన్సీ నిర్దేశించిన చోట్ల నాటాలి. ఇవిగాక 'ప్రతి కెన్యా పౌరుడు కనీసం రెండు మొక్కలు కొని నాటండి' అని పర్యావరణ మంత్రి సోపాన్ తుయా పిలుపునిచ్చారు.

యూఎస్ అధ్యక్ష రేసు నుంచి వైదొలిగిన టిమ్ స్కాట్

కొలంబియా(యూఎస్‌ఏ): 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, సౌత్ కరోలినా సెనేటర్ టిమ్ స్కాట్ ప్రకటించారు. మరో రెండు నెలల్లో అయోవాలో ఓటింగ్ ప్రారంభం కానున్న వేళ ఆదివారం అర్ధరాత్రి టిమ్ స్కాట్ చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్య పరిచింది. ఉపాధ్యక్ష పదవికి సిద్ధమేనా అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని ఆయన కొట్టిపారేశారు. రిపబ్లికన్ సెనేటర్లలో ఏకైక నల్లజాతీయుడైన స్కాట్ అందరి కంటే ముందుగా మేలోనే అధ్యక్ష పదవికి పోటీ పడనున్నట్లు తెలిపారు.

కాల్పుల్లో టీఎంసీ నేత మృతి.. మూక దాడిలో నిందితుడు హతం

జోయ్‌నగర్: పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా జోయ్‌నగర్‌లో సోమవారం టీఎంసీకి చెందిన స్థానిక నేత ఒకరు దుండగుల కాల్పుల్లో చనిపోయారు. నిందితుడిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి మూకదాడిలో ప్రాణాలు కోల్పోయాడు. బమున్‌గాచి ఏరియా టీఎంసీ అధ్యక్షుడు సైపుద్దీన్ లస్కర్(47) సోమవారం ఉదయం ప్రార్థనలకు బయటకు వచ్చారు. మాటువేసిన దుండగులు దగ్గర్నుంచి జరిపిన తుపాకీ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఘటనతో కోపోద్రిక్తులైన ఆయన మద్దతుదారులు నిందితులుగా భావిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. రెండో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లస్కర్ మద్దతుదారులు పొరుగునే ఉన్న దలువాఖలి గ్రామంలో లూటీకి పాల్పడ్డారు. ఈ ఘటనల నేపథ్యంలో ఆ ప్రాంతంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. లస్కర్ హత్యతో తమకెలాంటి సంబంధం లేదని సీపీఎం పేర్కొంది. అధికార యంత్రాంగం, పోలీసులు టీఎంసీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించింది.

బ్రిటన్ మంత్రివర్గంలో కుదుపు

హోం మంత్రి బ్రేవర్మన్‌పై వేటు ప్రధాని రిషి సునాక్ నిర్ణయం విదేశాంగ మంత్రిగా కామెరాన్

- మాజీ ప్రధానికి కీలక బాధ్యతలు
- విదేశాంగం నుంచి హోంకు క్లెవర్లీ
- తప్పుకున్న మరో ఏడుగురు మంత్రులు



దేవిడ్ కామెరాన్



సుయెల్లా బ్రేవర్మన్, జేమ్స్ క్లెవర్లీ

లండన్: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సోమవారం తన మంత్రివర్గంలో ఆకస్మిక మార్పుచేర్పులు చేశారు. కొంతకాలంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న భారత మూలాలున్న హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్‌ను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముందుగా నిర్ణయం తీసుకున్నారు. ఆ వెంటనే మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్‌ను విదేశాంగ మంత్రిగా నియమిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పటిదాకా విదేశాంగ మంత్రిగా ఉన్న జేమ్స్ క్లెవర్లీని బ్రేవర్మన్ స్థానంలో హోం మంత్రిగా నియమించారు. ప్రధాని సిఫార్సుల మేరకు వారిద్దరి నియామకాలకు రాజు చార్లెస్ ఆమోదముద్ర వేసినట్టు డౌనింగ్ స్ట్రీట్ ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు హౌజింగ్ మంత్రి రేచల్ మెక్లీన్‌ను కూడా సునాక్ పదవి నుంచి తప్పించారు.ఈ నేపథ్యంలో మరో ఆరుగురు జూనియర్ మంత్రులు కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు! థెరెసా కోఫీ, నిక్ గిబ్, నీల్ ఓబ్రియాన్, విల్ క్విన్స్, జెస్సీ నార్మన్ ఈ జాబితాలో ఉన్నారు.

కామెరాన్... అనూహ్య ఎంపిక

57 ఏళ్ల కామెరాన్‌కు రిషి విదేశాంగ బాధ్యతలు అప్పగించడం అనూహ్యమేనని చెప్పాలి. ఒక మాజీ ప్రధానిని ఇలా మంత్రివర్గంలోకి తీసుకోవడం బ్రిటన్‌లో చాలా అరుదు. పైగా ప్రధానిగా రాజీనామా చేశాక కామెరాన్ ఏడేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అంతేగాక ప్రస్తుతం ఎంపీ కూడా కాదు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోకి తీసుకున్నారు. బ్రిటన్లో ఇలా విదేశాంగ మంత్రి ఎగువ సభ్య సభ్యుడిగా ఉండటం 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1980ల్లో లార్డ్స్ సభ్యుడైన పీటర్ కారింగ్టన్ మార్గరెట్ థాచర్ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పని చేశారు. కష్టకాలంలో ప్రధానిగా రిషి పనితీరు గొప్పగా ఉందంటూ కామెరాన్ ఈ సందర్భంగా మెచ్చుకున్నారు. ''కొన్ని వ్యక్తిగత నిర్ణయాల విషయంలో రిషితో నేను గతంలో విభేదించ ఉండొచ్చు. కానీ ఆయన అత్యంత సమర్థుడైన ప్రధాని'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశ భద్రత, ప్రగతి తదితర కీలకాంశాల్లో ఆశించిన ఫలితాల సాధనలో రిషికి శక్తివంచన లేకుండా తోడ్పడతా. ఏడేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు కాస్త దూరంగా ఉన్నా కీలక సవాళ్లను దీటుగా ఎదుర్కోవడంలో రిషికి దన్నుగా నిలిచేందుకు నా రాజకీయ అనుభవమంతటినీ రంగరిస్తా'' అని చెప్పారు. 2010 నుంచి 2016 దాకా ఆరేళ్లపాటు ఆయన బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. బ్రిటన్ యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో కొనసాగాలని గట్టిగా వాదించారు. ఈ విషయమై 2016లో మూడు రెఫరెండాలు తెచ్చారు. కానీ ప్రజలు ఈయూ నుంచి వైదొలగేందుకు (బ్రెగ్జిట్)కే ఓటేయడంతో రాజీనామా చేశారు. సునాక్ కూడా బ్రెగ్జిట్‌కే మద్దతిచ్చారు. పైగా ఆ సమయంలో కామెరాన్ మంత్రివర్గంలో సునాక్ జూనియర్ మంత్రి కూడా కావడం విశేషం! విదేశాంగ మంత్రి జై శంకర్ ఐదు రోజుల పర్యటన నిమిత్తం ప్రస్తుతం ఇంగ్లండ్‌లో ఉన్నారు. ఆదివారం సునాక్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు కూడా. పర్యటనలో భాగంగా క్లెవర్లీతో జై శంకర్ సమావేశాలు జరపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా విదేశాంగ బాధ్యతలు స్వీకరించిన కామెరాన్‌తో జై శంకర్ చర్చలు ఎలా జరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

బ్రేవర్మన్.. రెండోసారి ఉద్వాసన

ఇక రిషి మంత్రివర్గంలో సీనియర్ సభ్యురాలైన 43 ఏళ్ల బ్రేవర్మన్ హోం శాఖ మంత్రిగా తప్పుకోవాల్సి రావడం ఇది రెండోసారి! ఈసారి ఆమెపై వేటు ఒక విధంగా ఊహిస్తున్నదే. గోవా మూలాలున్న ఆమె రెచ్చగొట్టే మాటలు, వివాదాస్పద వ్యాఖ్యలతో పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. ఇటీవల లండన్‌లో జరిగిన పాలస్తీనా మద్దతుదారుల ర్యాలీని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శిస్తూ ద టైమ్స్ పత్రికలో బ్రేవర్మన్ రాసిన వ్యాసంపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తాయి. హోం మంత్రిగా ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదంటూ విపక్షాలతో పాటు అధికార కన్సర్వేటివ్ పార్టీ సీనియర్ నాయకులు కూడా మండిపడ్డారు. వ్యాసంలోని సదరు విమర్శలను తొలగించాలని ప్రధాని కార్యాలయం ఆదేశించినా ఆమె బేఖాతరు చేసినట్టు తేలింది. ఈ నేపథ్యంలో బ్రేవర్మన్‌ను తప్పించడం ఖాయమని అంతా భావించారు. అంతకు ముందు లిజ్ ట్రస్ మంత్రివర్గం నుంచి కూడా ఆమె రాజీనామా చేయడం విశేషం. అప్పుడు కూడా మంత్రిగా పలుసార్లు వివాదాస్పద వ్యాఖ్యాలు చేశారు. పలు కీలకాంశాలపై ట్రస్ సర్కారు అయోమయంలో ఉందని ఆమె బాహాటంగా విమర్శించడం సంచలనం సృష్టించింది. వలసదారులపై ఆమె వ్యాఖ్యలూ దుమారమే రేపాయి. తర్వాత వలసలకు సంబంధించి అధికార పత్రాలను నిబంధనలకు విరుద్ధంగా సహచర పార్టీ ఎంపీకి చూపించిన అంశంలో రాజీనామా చేయాల్సి వచ్చింది. ట్రస్ స్థానంలో రిషి ప్రధాని అయ్యాక బ్రేవర్మన్‌ను అనూహ్యంగా మంత్రివర్గంలోకి తీసుకోవడమే గాక మళ్లీ కీలకమైన హోం శాఖ బాధ్యతలే అప్పగించారు. దీనిపై అప్పట్లోనే ఆశ్చర్యం వ్యక్తమైంది. తాజా వేటు నేపథ్యంలో సునాక్‌కు ఆమె కంట్లో నలుసుగా మారడం ఖాయమంటున్నారు. కన్సర్వేటివ్ పార్టీలోని తన మద్దతుదారుల దన్నుతో ప్రభుత్వానికి సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజీనామా అనంతరం విడుదల చేసిన సంక్షిప్త ప్రకటనలో ఆమె చేసిన వ్యాఖ్యలు కూడా దీన్ని బలపరిచేలానే ఉన్నాయి. ''ఇంతకాలం హోం మంత్రిగా పని చేయడం నాకు గొప్ప గౌరవం. సమయం వచ్చినప్పుడు చాలా సంగతులు చెప్తా'' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు!

వివాదాస్పద వ్యాఖ్యలు

- బ్రిటన్లో వీసా కాల పరిమితి ముగిసినా దేశం వీడని వారిలో అత్యధికులు భారతీయులేనన్న బ్రేవర్మన్ వ్యాఖ్యలు దుమారం రేపాయి.
- భారత్‌తో ఓపెన్ మైగ్రేషన్ విధానాన్నీ ఆమె తప్పుబట్టారు.
- మరో సందర్భంలో బ్రిటన్లోని అక్రమ వలసదారులను ఆఫ్రికాలోని రువాండాకు తరలిస్తానన్నారు.
- బ్రిటన్లో ఎక్కడ పడితే అక్కడ వీధుల్లోనే నివసిస్తున్న వారు చాలావరకు అక్రమ వలసదారులేనన్నారు.
- శరణార్థుల తాకిడిని వలసదారుల దండయాత్రగా అభివర్ణించారు.
- అతి వేగంగా కారు నడిపిన కేసులో జరిమానా, ఫైన్ పడ్డ విషయాన్ని దాచేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఎదుర్కొన్నారు.

ఢిల్లీపై దీపావళి ఎఫెక్ట్..!

- దేశ రాజధానిలో పెరిగిన కాలుష్యం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని నగర ప్రాంతంలో వర్షాలతో కాస్తంత తగ్గుముఖం పట్టిన వాయు కాలుష్యం..దీపావళి పండుగతో మళ్లీ విజృంభించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం పక్కన పెట్టి మరీ ఢిల్లీ ప్రజలు టపాసులు కాల్చడంతో సోమవారం తెల్లవారుజామునకు వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ)500 పాయింట్లకు చేరుకుంది. టపాసుల పొగకు మంచు తోడవ్వడంతో ఢిల్లీలోని రోడ్లన్నీ కాలుష్యంతో చీకట్లు కమ్ముకున్నాయి. ఎదురుగా వస్తున్న సైతం వాహనాలు కనిపించని స్థాయికి వాయు కాలుష్యం చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హరియాణా, రాజస్థాన్, యూపీ, పంజాబ్ రాష్ట్రాల్లో పంట వ్యర్థాల కాల్చివేతల కారణంగా ఢిల్లీ నగరం కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది. పంట వ్యర్థాల దహనాన్ని ఆపేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఢిల్లీలో ఎటువంటి బాణసంచా కాల్చొద్దంటూ సూచనలు చేసింది. అయితే, ప్రజలు ఈ సూచనలను లెక్కచేయకుండా దీపావళి రోజు బాణసంచాను యథా ప్రకారంగా కాల్చేశారు. ఫలితంగా నగరంలోని చాలా చోట్ల వాయు నాణ్యత (ఏక్యూఐ) 500పైగా నమోదయింది. అక్కడక్కడా 900 వరకూ చేరడం గమనార్హం. సోమవారం ఉదయం 6 గంటలకు అత్యధికంగా లజ్‌పత్ నగర్‌లో 959, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతంలో 910, కరోల్ బాగ్ ప్రాంతంలో 779 వరకు నమోదైంది.

వాహనదారులపై 1, 93, 585 చలాన్ల జారీ

రాజధానిలో వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ఈనెల 7న ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతిరోజూ 3వేలకు పైగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 385 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నగర వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నట్లు వివరించింది. అక్టోబర్ 31వ తేదీ వరకు కాలుష్య ఉల్లంఘనలపై 1, 93, 585 చలాన్లు జారీ చేయగా..10 నుంచి 15ఏళ్ల నాటి 32 డీజిల్, పెట్రోల్ వాహనాలతోపాటు 15 ఏళ్ల కంటే పాతవైన మరో 14, 885 వాహనాలను సైతం సీజ్ చేసినట్లు న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో తాజాగా ఢిల్లీ ప్రభుత్వం పేర్కొంది.



కుప్పకూలిన 'ఉత్తర కాశీ' సొరంగం

ఉత్తరకాశీ(ఉత్తరాఖండ్): ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నిర్మాణంలోని ఒక సొరంగం ఒక్కసారిగా కుప్పకూలింది. సిల్‌క్యారాలోని ఈ సొరంగంలో కొంత భాగం కూలడంతో అందులో పనిచేస్తున్న దాదాపు 40 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. విషయం తెల్సుకున్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర విభాగాలు వారిని రక్షించేందుకు రంగంలోకి దిగాయి. రాష్ట్ర పోలీసులు, జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక దళం, 108 ఎమర్జెన్సీ, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల కార్పొరేషన్(ఎన్‌హెచ్ఐడీసీఎల్), ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)కి చెందిన 160కిపైగా సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఈ సహాయక చర్యల్లో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరకాశీలోని యమునోత్రి జాతీయ రహదారి కింద ఈ సొరంగం తవ్వుతున్నారు. సిల్‌క్యారాలో నాలుగున్నర కిలోమీటర్ల పొడవున ఈ సొరంగం నిర్మిస్తున్నారు. ఇందులో 150 మీటర్ల భాగం కూలినట్లు వెల్లడైంది. పైప్‌లైన్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. కార్మికులంతా సురక్షితమేనని చెప్పారు. వారు బయటపడే మార్గం ఏర్పరిచేందుకు డ్రెడ్జింగ్, డ్రిల్లింగ్ చేస్తున్నారు.

ఆర్థిక నేరగాళ్లకు బేడీలు వేయొద్దు

పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి బేడీలు వేయరాదని, హత్య, అత్యాచారం వంటి నేరాలకు పాల్పడిన వారితో కలిపి జైలులో ఉంచరాదని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. బేడీలు తీవ్రమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులు తప్పించుకోకుండా నిరోధించడానికి, అరెస్ట్ సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది భద్రత కోసమే పరిమితమని వివరించింది. అలాగే, నిందితులను అరెస్టయిన తర్వాత 15 రోజులకు మించి పోలీస్ కస్టడీలో ఉంచరాదన్న భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్)లో నిబంధనపై సవరణలను సూచించింది.

ఆ విరాళాల వివరాలు మాకివ్వండి: ఈసీ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందిన విరాళాల వివరాలను నవంబర్ 15 సాయంత్రంలోగా అందించాలని పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆదేశించింది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు అందిన విరాళాల వివరాలను సీల్డ్ కవర్‌లో నివేదించాలని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ఈనెల రెండో తేదీన ఆదేశించిన నేపథ్యంలో ఈసీ పై విధంగా స్పందించింది. '' ఒక్కో ఎలక్టోరల్ బాండ్ విలువ ఎంత? ఆ బాండ్ విలువలో ఎంత మొత్తాన్ని మీ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు? మొత్తం ఎన్ని బాండ్లు మీకు వచ్చాయి? మొత్తం బాండ్ల ద్వారా స్వీకరించిన విరాళాలు..' ఇలా ప్రతీదీ సవివరంగా పేర్కొంటూ జాబితాను డబుల్ సీల్డ్ కవర్‌లో సమర్పించండి'' అంటూ ఆయా పార్టీల చీఫ్‌లకు ఈసీ లేఖలు పంపింది.



దీపావళి సందర్భంగా ఆదివారం లండన్‌లో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ దంపతులతో విదేశాంగ మంత్రి జై శంకర్, ఆయన భార్య క్యోకో

అదే గాజా.. అదే దీన గాథ!

గాజా ఆస్పత్రుల్లో మరణమృదంగం

డెయిర్ అల్ బలాహ్/ఖాన్ యూనిస్ (గాజా): అదే కల్లోలం. అవే దారుణ దృశ్యాలు. అందరి కంటా నిస్సహాయంగా నీటి ధారలు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల ధాటికి గాజాలో మానవీయ సంక్షోభం తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా ఆస్పత్రుల్లో ఎటు చూసినా మరణమృదంగం ప్రతిధ్వనిస్తోంది. గాజాలోని దాదాపు అన్ని ఆస్పత్రులనూ ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టి రోజుల తరబడి దిగ్బంధించడం తెలిసిందే. దాంతో కరెంటుతో పాటు కనీస సౌకర్యాలన్నీ దూరమై అవి నరకం చవిచూస్తున్నాయి. ఐసీయూలు, ఇంక్యుబేటర్లకు కూడా కరెంటు, ఆక్సిజన్ రోజులు దాటింది. వాటిల్లోని రోగులు, నవజాత శిశువులు నిస్సహాయంగా మృత్యువు కోసం ఎదురు చూస్తున్నారు! ఇప్పటిదాకా అరచేతులు అడ్డుపెట్టి అతి కష్టమ్మీద వారి ప్రాణాలు నిలుపుతూ వచ్చిన వైద్యులు కూడా క్రమంగా చేతులెత్తేస్తున్నారు. గాజాలో అతి పెద్దదైన అల్ షిఫాతో పాటు అన్ని ఆస్పత్రుల్లోనూ ఇదే దుస్థితి! షిఫా ఇంకెంతమాత్రమూ ఆస్పత్రిగా మిగల్లేదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనోం గేబ్రెయేసస్ వాపోయారు. ''ఈ దారుణంపై ప్రపంచం మౌనం వీడాల్సిన సమయమిది. కాల్పుల విరమణ తక్షణావసరం'' అని పిలుపునిచ్చారు.

చిన్నారులను కాపాడేందుకు...

ఇంతటి విపత్కర పరిస్థితుల్లోనూ నవజాత శిశువులను కాపాడుకునేందుకు అల్ షిఫా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శాయశక్తులా ప్రయత్నిస్తున్న తీరు కంటతడి పెట్టిస్తున్నాయి. ఆక్సిజన్ సరఫరా తదితరాలన్నీ నిలిచిపోవడంతో చిన్నారులను ఇంక్యుబేటర్ల నుంచి తీసుకెళ్లి సిల్వర్ ఫాయిల్ తదితరాల్లో చుట్టబెట్టిన మంచాలపై ఒక్కచోటే పడుకోబెడుతున్నారు. పక్కన వేడినీటిని ఉంచి శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు.



గాజాలోని షిఫా ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పరిస్థితి ఇది. నెలలు నిండకుండానే జన్మించిన శిశువులను ఇంక్యుబేటర్‌కు బదులు ఇలా సిల్వర్ ఫాయిల్‌ను చుట్టబెట్టిన బెడ్‌లో ఉంచి కాపాడుతున్నారు.

ఇంధన రగడ

ఇంక్యుబేటర్లను నడిపి చిన్నారులను కాపాడేందుకు అల్ షిఫా ఆస్పత్రికి 300 లీటర్ల ఇంధనం అందజేస్తే హమాస్ ఉగ్రవాదులు అడ్డుకున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపించింది. కానీ అరగంటకు కూడా చాలని ఆ సాయంతో ఏం ప్రయోజనమని పాలస్తీనా ఆరోగ్య శాఖ మండిపడింది. ఇది క్రూర పరిహాసమంటూ దుయ్యబట్టింది.

అల్ రంటిసి, అల్ నస్ర్

ఉత్తర గాజాలోని ఈ ఆస్పత్రుల నుంచి రోగులు తదితరులను హుటాహుటిన ఖాళీ చేయిస్తున్నారు. శుక్రవారానికే కొద్దిమంది రోగులు, వైద్య సిబ్బంది మినహా ఇవి దాదాపుగా ఖాళీ అయిపోయాయి. అయితే వాటిలో సాధారణ పౌరులు వందలాదిగా తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్ సైన్యం వీటిని పూర్తిగా తమ అదుపులోకి తీసుకుని వారందరినీ అక్కడినుంచి పంపించేస్తోంది.

అల్ స్వెయిదీ

లోపల కొద్ది మంది రోగులు, వైద్య సిబ్బంది ఉన్నారు. 500 మందికి పైగా శరణార్థులు తలదాచుకుంటున్నారు. శనివారం నాటి రాకెట్ దాడి ఆస్పత్రిని దాదాపుగా నేలమట్టం చేసింది. ఆదివారం రాత్రికల్లా ఇజ్రాయెల్ సైనికులు ఆస్పత్రిలోకి ప్రవేశించారు. ఇంకా మిగిలిన ఉన్న వారందరినీ ఖాళీ చేయించి బుల్డోజర్లతో ఆస్పత్రిని నేలమట్టం చేయించారు.

అల్ షిఫా

700 పడకలతో గాజాలోనే అతి పెద్ద ఆస్పత్రి. కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ సైన్యం పూర్తిస్థాయిలో చుట్టుముట్టింది. దాంతో వైద్య సేవలన్నీ నిలిచిపోయాయి. కరెంటు లేదు. ఇంధనం, ఆహార సరఫరాలు తదితరాలన్నీ నిండుకున్నాయి. ఇక్కడ తలదాచుకున్న శరణార్థుల్లో అత్యధికులు పారిపోయారు. ఇంకో 2,500 మందికి పైగా ఆస్పత్రిలో ఉన్నట్టు సమాచారం. కానీ 20 వేలకు పైగా అక్కడ చిక్కుబడ్డట్టు పాలస్తీనా ఆరోగ్య శాఖ చెబుతోంది. 600 మందికి పైగా రోగులు, 500 మంది దాకా వైద్యులు, సిబ్బంది ఉన్నారు. వందలాది శవాలు ఆస్పత్రి ప్రాంగణంలో పడున్నట్టు చెబుతున్నారు! ఆది, సోమవారాల్లోనే 35 మంది రోగులు, ఐదుగురు చిన్నారులు చనిపోయినట్టు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 36 మంది చిన్నారులు ఏ క్షణమైనా తుది శ్వాస విడిచేలా ఉన్నట్టు వైద్య వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది.

అల్ ఖుద్స్

గాజాలో రెండో అతి పెద్ద ఆస్పత్రి. 500 మందికి పైగా రోగులు, 15 వేలకు పైగా శరణార్థులున్నారు. వీరిలో అత్యధికులు మహిళలే. ఆదివారానికే ఆస్పత్రిలో సేవలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. ఆహార నిల్వలన్నీ నిండుకున్నాయి. పరిసరాల్లోనే గాక ఆస్పత్రిపైకి కూడా భారీగా కాల్పులు జరుగుతున్నాయి. దాంతో ఇక్కడి ఐసీయూ వార్డు రోగులు ఒకట్రెండు రోజుల్లో నిస్సహాయంగా మృత్యువాత పడేలా ఉన్నారు! 6,000 మందికి పైగా శరణార్థులను ఇక్కణ్నుంచి దక్షిణాదికి పంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అల్ అక్సా

ఇక్కడ కూడా వందల సంఖ్యలో రోగులు, వైద్య సిబ్బంది, శరణార్థులున్నారు. రోగుల, ముఖ్యంగా 100 మందికి పైగా ఉన్న నవజాత శిశువుల సామూహిక మరణాలకు ఇంకెంతో సమయం పట్టదని సిబ్బంది చెబుతున్నారు. తూటాలు తరచూ ఆస్పత్రి లోనికి దూసుకొస్తున్నాయంటున్నారు. ఆస్పత్రిని సైన్యం చుట్టుముట్టింది.

మహిళపై ఐదుగురి గ్యాంగ్ రేప్

ఆగ్రా: పాతికేళ్ల వయసున్న మహిళా ఉద్యోగిపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి ఆగ్రాలో జరిగింది. ఈ ఘటనలో ఒక మహిళతోపాటు ఐదుగురు నిందితులను పోలీసుల అరెస్ట్‌చేశారు. కేసు వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. 'కాపాడండి అంటూ శనివారం రాత్రి ఒక హోమ్‌స్టే(పెయింగ్ గెస్ట్‌లకు ఆశ్రయమిచ్చే ఇల్లు) నుంచి ఫోన్‌కాల్ వస్తే వెళ్లాం. అక్కడ తలకు గాయంతో నిస్సహాయంగా పడి ఉన్న హోమ్‌స్టే ఉద్యోగినిని వెంటనే ఆస్పత్రికి తరలించాం. ఈ ఘటనతో సంబంధం ఉన్న మహిళను, ఐదుగురు నిందితులను అరెస్ట్‌చేశాం. బాధిత మహిళను గతంలో అభ్యంతరకరంగా వీడియో తీసిన నిందితులు ఆ వీడియోను బహిర్గతం చేస్తామని బెదిరించారు. శనివారం అర్ధరాత్రి హోమ్‌స్టేకు వచ్చి గ్యాంగ్‌రేప్‌కు ఒడిగట్టారు' అని పోలీసులు తెలిపారు.

లండన్లో ప్రవాసభారతీయుని ఇంట్లో మంటలు.. ఐదుగురు సజీవ దహనం

లండన్: లండన్‌లోని భారత సంతతి వ్యక్తికి చెందిన ఇంట్లో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సజీవ దహనమయ్యారు. ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు జరుపుకున్న కాసేపటికే ఈ విషాదం జరిగినట్టు తెలుస్తోంది. మంటలార్పిన అనంతరం ఫస్ట్ ఫ్లోర్‌లో ఐదు మృతదేహాలు పడి ఉండగా గుర్తించినట్లు చెప్పారు. కాగా, మాంచెస్టర్‌కు చెందిన దిలీప్ సింగ్(54) మాట్లాడుతూ..అది తన బావమరిది ఇల్లు కాగా, అందులో భార్య, ముగ్గురు పిల్లలతో ఆయన ఉంటున్నారన్నారు. మరో ఇద్దరు అతిథులు కూడా ఘటన సమయంలో ఉన్నట్లు తెలిపారు. ఆ కుటుంబం ఇటీవల బెల్జియం నుంచి లండన్‌లోని కొత్త ఇంటికి మకాం మార్చినట్లు చెబుతున్నారు.

మేకల కళ్యాణ్ చక్రవర్తి

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి బరిలోకి దిగడమంటే ఆషామాషీ కాదు. పోటీ చేసి గెలవాలంటే అంత ఈజీ కాదు. పదేపదే పోటీ చేస్తుంటే.. ఓసారి గెలిచి మరోమారు ఓడిపోతుంటే.. పదే పదే గెలుస్తుంటే.. లేదా పదే పదే ఓడిపోతుంటే.. ఆ ఉత్కంఠ అనుభవిస్తేనే కానీ అర్థం కాదు. అలా పదేపదే పోటీ చేయడం కత్తిమీద సాము లాంటిదే. పోటీ చేసిన వారే పదేపదే పోటీ చేయడం.. ఒకే నియోజకవర్గంలో నేతలు రెండు నుంచి ఐదు సార్లు తలపడితే వారినే 'పాతకాపు'లంటారు. నియోజకవర్గం మారినా, పార్టీలు మారినా కొన్ని నియోజకవర్గాల్లో పోటీ వారి మధ్యనే ఉంటుంది. ఆ నియోజకవర్గంలో ఆ ఇద్దరు ప్రధాన ప్రత్యర్థులు అలా పాతుకుపోతారంతే. ఇలాంటి పాతకాపులు ఈసారి కూడా హోరాహోరీ తలపడుతున్నారు. చిరకాల ప్రత్యర్థులపై అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పాతకాపుల పోటాపోటీ ఎలా ఉందంటే..!

అదే బరి.. వీరులు వారే..



- ఈసారి ఎన్నికల్లో మళ్లీ తలపడుతున్న ముఖ్య నేతలు
- పార్టీలు మారినా పలు చోట్ల మారని అభ్యర్థులు
- రాష్ట్రంలోని చాలా సెగ్మెంట్‌లలో పాత అభ్యర్థులే పోటీలో
- ధర్మపురిలో కొప్పుల, అడ్లూరి మధ్య వరుసగా ఐదోసారి పోటీ
- ఇబ్రహీంపట్నం జనరల్ అయినప్పటి నుంచీ మంచిరెడ్డి, మల్‌రెడ్డి మధ్య హోరాహోరీ
- తమ ప్రత్యర్థులతో వరుసగా మూడోసారి తలపడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్

ఉమ్మడి జిల్లాల వారీగా ఎక్కడెక్కడంటే..

నిజామాబాద్ బోధన్‌లో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి హోరాహోరీ తలపడిన షకీల్ అహ్మద్, సుదర్శన్‌రెడ్డి ఈసారి కూడా అవే పార్టీల నుంచి బరిలో ఉన్నారు. నిజామాబాద్ రూరల్‌లోనూ పాతకాపులే మళ్లీ పోటీ పడుతున్నారు. 2018లో నిల్చున్న బాజిరెడ్డి గోవర్దన్ (బీఆర్‌ఎస్), భూపతిరెడ్డి (కాంగ్రెస్)లు ఈసారీ బరిలో ఉన్నారు. బాల్కొండలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్)పై గత ఎన్నికల్లో బీఎస్పీ పక్షాన తలపడిన సునీల్‌కుమార్ ఈసారి కాంగ్రెస్ నుంచి తలపడుతున్నారు.

ఆదిలాబాద్

సిర్పూర్ నియోజకవర్గంలో ఇద్దరు పాతకాపులు పోటీ పడుతున్నారు. గత ఎన్నికల్లో తలపడిన కోనేరు కోనప్ప (బీఆర్‌ఎస్)పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయి హరీశ్ ఇప్పుడు బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్య (బీఆర్‌ఎస్), జి.వినోద్‌లు మళ్లీ పోటీ పడుతున్నారు. అయితే, గత ఎన్నికల్లో వినోద్ బీఎస్పీ నుంచి పోటీ చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. మంచిర్యాలలో ఎన్.దివాకర్‌రావు (బీఆర్‌ఎస్), కె.ప్రేమ్‌సాగర్‌రావు (కాంగ్రెస్) మళ్లీ అవే పార్టీల తరఫున రంగంలోకి దిగారు. నిర్మల్‌లో వరుసగా ఏడోసారి ఇంద్రకరణ్ రెడ్డి పోటీ చేస్తుండగా ఆయనపై రెండు వరుస ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులుగా తలపడిన మహేశ్వర్‌రెడ్డి, కూచాడి శ్రీహరిరావులిద్దరూ ఈసారి ఆయనపై బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి పోటీలో నిలిచారు.

ఖమ్మం

పినపాకలో గత ఎన్నికల్లో రేగా కాంతారావు (కాంగ్రెస్), పాయం వెంకటేశ్వర్లు (బీఆర్‌ఎస్) నుంచి పోటీ చేయగా, ఇప్పుడు కూడా వీరే తలపడుతున్నా పార్టీలు మారారు. ఇల్లెందులోనూ ఇదే పరిస్థితి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన హరిప్రియా నాయక్ ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి, బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన కోరం కనకయ్య కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. మధిరలో గత నాలుగో ఎన్నికల్లోనూ మల్లు భట్టి విక్రమార్క, లింగాల కమల్‌రాజ్‌లే ప్రధాన ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. భట్టి కాంగ్రెస్ అభ్యర్థిగా నాలుగుసార్లు రంగంలో ఉండగా, కమల్‌రాజ్ మాత్రం రెండుసార్లు సీపీఎం నుంచి, రెండోసారి బీఆర్‌ఎస్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. భద్రాచలం నుంచి పొదెం వీరయ్య (కాంగ్రెస్), తెల్లం వెంకట్రావు (బీఆర్‌ఎస్) వరుసగా రెండోసారి పోటీ చేస్తున్నారు.

కరీంనగర్

జగిత్యాల నుంచి సంజయ్‌కుమార్ (బీఆర్‌ఎస్), టి.జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) వరుసగా మూడోసారి తలపడుతున్నారు. గత రెండు ఎన్నికల్లో చెరోసారి విజయం సాధించగా, ఈసారి ఎవరు గెలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)పై అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (కాంగ్రెస్) వరుసగా ఐదోసారి పోటీ చేస్తున్నారు. ఐదు ఎన్నికల్లో ఓటమిపాలైనా గత ఎన్నికల్లో కేవలం 441 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిన ఆయన మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మంథనిలో పుట్టా మధు (బీఆర్‌ఎస్), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (కాంగ్రెస్) వరుసగా నాలుగోసారి ఢీ కొడుతున్నారు. పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), విజయరమణారావు (కాంగ్రెస్) వరుసగా రెండోసారి తలపడుతున్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్)పై బండి సంజయ్ (బీజేపీ) వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. చొప్పదండిలోనూ సుంకె రవిశంకర్ (బీఆర్‌ఎస్), మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) మధ్య రెండోసారి పోటీ నెలకొంది. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ (బీఆర్‌ఎస్)పై పాతకాపు కె.కె.మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్) మరోమారు పోటీ చేస్తున్నారు. ఒక్కసారి మినహా గత నాలుగు ఎన్నికల్లోనూ ఆ ఇద్దరే ముఖాముఖి తలపడటం గమనార్హం.

నల్లగొండ

దేవరకొండ (ఎస్టీ) నియోజకవర్గంలో బాలూ నాయక్ (కాంగ్రెస్), రవీంద్రకుమార్ (బీఆర్‌ఎస్) రెండోసారి తలపడుతున్నారు. కోదాడలో పద్మావతిరెడ్డి (కాంగ్రెస్), బొల్లం మల్లయ్య (బీఆర్‌ఎస్), సూర్యాపేటలో జగదీశ్ రెడ్డి (బీఆర్‌ఎస్), దామోదర్‌రెడ్డి (కాంగ్రెస్)లు వరుసగా రెండుసార్లు తలపడుతున్నారు. నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి మధ్య మూడోసారి పోటీ జరుగుతోంది. మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (కాంగ్రెస్), కె. ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) మధ్య కూడా వరుసగా మూడోసారి పోటీ జరుగుతోంది. భువనగిరిలో పైళ్ల శేఖర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) మధ్య కూడా వరుసగా రెండోసారి సమరం జరుగుతోంది. నకిరేకల్‌లో వేముల వీరేశం, చిరుమర్తి లింగయ్యల నడుమ మూడోసారి పోటీ జరుగుతోంది. అయితే, గత ఎన్నికల్లో ఈ ఇద్దరు పోటీ చేసిన పార్టీలు వేర్వేరు కావడం గమనార్హం.

మహబూబ్‌నగర్

కొడంగల్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) నడుమ రెండోసారి యుద్ధం జరుగుతోంది. అచ్చంపేటలో గువ్వల బాలరాజు (బీఆర్‌ఎస్), చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్) కూడా వరుసగా రెండోసారి తలపడుతున్నారు. కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్ (బీఆర్‌ఎస్), టి.ఆచారి (బీజేపీ) కూడా రెండోసారి పోటీ పడుతున్నారు. కొల్లాపూర్‌లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు (కాంగ్రెస్), హర్షవర్ధన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) మూడోసారి పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ఈ ఇద్దరూ పోటీ చేసిన పార్టీల నుంచి కాకుండా మరో పార్టీ నుంచి పోటీ చేస్తుండటం గమనార్హం.

మెదక్

అందోల్ నియోజకవర్గంలో మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ (కాంగ్రెస్), చంటి క్రాంతి కిరణ్ (బీఆర్‌ఎస్)లు వరుసగా రెండోసారి బరిలో ఉన్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి (కాంగ్రెస్), చింత ప్రభాకర్ (బీఆర్‌ఎస్)లు వరుసగా నాలుగోసారి అమీతుమీ తేల్చుకుంటున్నారు. పటాన్‌చెరులోనూ 2018 ఎన్నికల్లో తలపడిన మహిపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్), శ్రీనివాస్‌గౌడ్ (కాంగ్రెస్)లే 2023 ఎన్నికల్లోనూ పోటీ పడుతున్నారు.

వరంగల్

డోర్నకల్‌లో రెడ్యానాయక్ (బీఆర్‌ఎస్), రామచంద్రునాయక్ (కాంగ్రెస్) మధ్య రెండోసారి పోటీ జరుగుతోంది. నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్), పెద్ది సుదర్శన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) మూడోసారి తలపడుతున్నారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి (బీఆర్‌ఎస్), గండ్ర సత్యనారాయణరావు (కాంగ్రెస్) రెండోసారి పోటీపడుతున్నారు. గత ఎన్నికల్లో వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ నుంచి, సత్యనారాయణరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు.

రంగారెడ్డి జిల్లా

మల్కాజిగిరిలో వరుసగా రెండోసారి మైనంపల్లి హనుమంతరావు, ఎస్.రాంచందర్‌రావు (బీజేపీ)ల నడుమ పోరు జరుగుతోంది. మైనంపల్లి గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి దిగగా, ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. కుత్బుల్లాపూర్‌లో కేపీ వివేకానంద (బీఆర్‌ఎస్), కూన శ్రీశైలం గౌడ్ మధ్య రెండోసారి పోటీ జరుగుతోంది. శ్రీశైలం గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి, ఈసారి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం జనరల్ స్థానంగా మారిన తర్వాత జరుగుతున్న నాలుగు ఎన్నికల్లోనూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలే ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నారు. అయితే గతంలో బీఎస్పీ నుంచి, ఇండిపెండెంట్‌గా పోటీచేసిన మల్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2009, 2014లో టీడీపీ నుంచి పోటీ చేయగా, 2018, 2023లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉంటున్నారు. పరిగిలో కొప్పుల మహేశ్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి మధ్య బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వరుసగా రెండోసారి పోటీ జరుగుతోంది. వికారాబాద్‌లోనూ మెతుకు ఆనంద్ (బీఆర్‌ఎస్), గడ్డం ప్రసాద్‌కుమార్ (కాంగ్రెస్) రెండోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.



- కమ్యూనిస్టుల ఐక్యతకు కట్టుబడి ఉన్నాం... సీపీఐ వైఖరిపై నో కామెంట్
- బీఆర్‌ఎస్ వంటి ప్రాంతీయ పార్టీలవన్నీ అవకాశవాద రాజకీయాలే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

అందుకే మమ్మల్ని కాంగ్రెస్ వదిలేసింది

బొల్లోజు రవి

కాంగ్రెస్ పార్టీతో పొత్తు కుదరకపోవడంతో సీపీఎం ఒంటరిగా బరిలోకి దిగింది. 19 స్థానాల్లో పోటీ చేస్తోంది. పొత్తు కోసం ఇన్నాళ్లు ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయింది. కాంగ్రెస్ మిర్యాలగూడ స్థానం సహా రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని చెప్పింది. మిర్యాలగూడ, వైరా స్థానాలు ఇస్తేనే మద్దతు ఉంటుందని, లేకుంటే ఉండదని సీపీఎం తేల్చిచెప్పింది. దీంతో పొత్తు కుదరకపోవడంతో సీపీఎం సొంతంగా బరిలోకి దిగింది. కాంగ్రెస్‌తో పొత్తు విచ్ఛిన్నం, కాంగ్రెస్‌తో సీపీఐ వెళ్లిపోవడం, ఒంటరిపోరు నేపథ్యంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది.

Interview

కాంగ్రెస్‌తో పొత్తు విఫలమయినట్లేనా? ఇంకా ఏమైనా ఆశలున్నాయా?

- కాంగ్రెస్‌తో పొత్తు కథ ముగిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక పొత్తు ఉండదు. ఎలాంటి ఆశలు కూడా పెట్టుకోలేదు. మేం ప్రకటించిన 19 స్థానాల్లో అభ్యర్థులు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లడుగుతారు. మిర్యాలగూడను ఒకవేళ వాళ్లు మాకిచ్చినా కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని ఏదో రకంగా రంగంలోకి దింపేది. అయినా ఖమ్మం జిల్లాలో ఒక్క సీటు లేకుండా పొత్తు ఎలా ఉంటుంది.

కాంగ్రెస్, వామపక్షాలు విడిగా పోటీ చేయడం వల్ల కాంగ్రెస్‌కు నష్టమే కదా... అలాంటిది మీతో పొత్తు విషయంలో ఎందుకు ఇలా చేస్తుందని భావిస్తున్నారు?

- మాతో ప్రయోజనం లేదని కాంగ్రెస్ మమ్మల్ని వదిలేసింది. పొత్తు పెట్టుకుంటేనే కాంగ్రెస్‌కు నష్టమట. మాకు సీట్లు ఇస్తే ఓడిపోతామని, అదే ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తే గెలుస్తారని వారి నమ్మకం. మేము పోటీ చేయడం వల్లే వారికి లాభమట. మాతో చర్చల సందర్భంగా కూడా కాంగ్రెస్ నాయకులు ఈ విధంగానే మాట్లాడారు. అందుకే పొత్తు విషయంలో ముందుకు రావడంలేదు.

సీపీఐకి కొత్తగూడెం స్థానంలో మద్దతు ఇస్తారా? అలాగే మీరు పోటీ చేసే 19 స్థానాల్లో మద్దతు కోరతారా?

- కొత్తగూడెంలో సీపీఐ తరఫున పోటీ చేస్తున్న కూనంనేని సాంబశివరావుకు మద్దతు ఇస్తున్నాము. అయితే మేం పోటీ చేసే 19 చోట్ల సీపీఐ మద్దతు ఇస్తుందని నేనను కోను. ఎందుకంటే సీపీఐ, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది. రాష్ట్రవ్యాప్తంగా పొత్తులో భాగంగానే కొత్తగూడెం స్థానం కేటాయించారు. కాబట్టి సీపీఐ మాకు మద్దతు ఇవ్వదు. ఒకవేళ వారి ఓటర్లు ఎక్కడైనా మాకు మద్దతు ఇస్తే అది వారిష్టం.

బీఆర్‌ఎస్‌ది అవకాశవాదమని మీరు భావిస్తున్నారా..?

- బీఆర్‌ఎస్‌గానీ, ఇతర ప్రాంతీయ పార్టీలుగానీ అవకాశవాదంతోనే వ్యవహరిస్తాయి. ఆనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దెదించడమే తమ లక్ష్యమని బీజేపీ ప్రకటించింది. అందుకు అనుగుణంగానే హుజూరాబాద్, దుబ్బాక, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ప్రభావం చూపింది. ఆ ఊపులో అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ వర్సెస్ బీజేపీ అన్న వాతావరణాన్ని సృష్టించాలని భావించింది. ఆ సమయంలో కేసీఆర్‌కు మరో మార్గం లేదు. అందుకే బీజేపీని వ్యతిరేకించారు. ఆ తర్వాత కర్నాటక ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రంలో బీజేపీ మూడో స్థానంలోకి వెళ్లిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంది. కేసీఆర్ మూడ్ మారిపోయింది. బీజేపీతో ప్రమాదం లేదని అర్థమైంది. ఈ ఎన్నికల తర్వాత సీట్లు తక్కువైతే బీజేపీ, ఎంఐఎం మద్దతు తీసుకునే పరిస్థితి ఉంది. అందుకే కమ్యూనిస్టుల అవసరం కేసీఆర్‌కు లేదు. అవకాశవాదంతో రాజకీయాలను మార్చారు.

ఈ ఎన్నికల్లో ఒక్క సీటయినా సాధిస్తారా..?

- గెలుస్తామన్న నమ్మకంతోనే 19 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాం. అన్ని చోట్లా గెలవాలన్నదే మా లక్ష్యం.

జంగ్ తెలంగాణ

మాట్లాడితే పంచ్ పడాలంతే..!



ఎన్నికల ప్రచారంలో వాడీవేడి కొటేషన్లు

"నాకు ఏం మాట్లాడినా పంచ్ ఉండాలంతే.. పంచ్ లేకుంటే కుదరదంతే' అని 'ఆర్య' సినిమాలో సునీల్ చేసిన హడావుడి బాగా పేలింది. ఇప్పుడు ప్రచారంలో పంచ్ డైలాగ్‌లు లేకుంటే పస ఉండదని భావిస్తున్న పార్టీల అభ్యర్థులు మంచి మంచి కొటేషన్లతో పంచ్‌లు విసురుతున్నారు. సోషల్ మీడియాలో వాటిని వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట

- ఈ నెల 30న అందరి వేళ్లకు ఇంక్.. రాష్ట్రమంతా పింక్ అంటూ, అప్పుడు ఎట్లుండే తెలంగాణ..ఇప్పుడు ఎట్లయ్యింది తెలంగాణ అని బీఆర్‌ఎస్ అభ్యర్థుల కొటేషన్లు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తెలంగాణ ఏర్పాటు కాకముందు 2014లో ఎలా ఉండే.. 2023లో ఎలా ఉందని బీఆర్‌ఎస్ అభ్యర్థులు డైలాగ్ కొటేషన్‌తో ప్రశ్నిస్తున్నారు. వీటితోపాటు కాంగ్రెస్, బీజేపీ కొటేషన్లు కూడా సోషల్ మీడియాలో ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

ఆకట్టుకున్న కొటేషన్లు కొన్ని..

- అన్నా... జిల్లాజిల్లాకూ ఐటీ టవర్.. మా గుండెల్లో ఉంటాడు కేటీఆర్ ఫరెవర్
- మా అన్నను ప్రేమిస్తారు మహబూబ్‌నగర్ క్రౌడ్.. డెవలప్‌మెంట్ ఆగొద్దంటే రావాలి మా అన్న శ్రీనివాస్ గౌడ్
- మర్చిపోతామా సాయన్న చేసిన సాయమూ.. కంటోన్మెంట్‌లో లాస్యమ్మ గెలుపు ఖాయమూ..
- బాల్కొండలో ఎగురబోతుంది గులాబీ జెండా... ప్రశాంత్ అన్న మన అందరికీ అండాదండా..
- ఎవరికి పడితే వాడికి కొట్టం జిందాబాద్.. మా గోవర్ధన్ రూరల్ నిజాంబాద్
- కాంగ్రెస్ బీజేపీ అందరు పక్కకు జరగాలి... మెదక్‌లో భారీ మెజారిటీ రాబోతుంది మా పద్మక్క
- కాంగ్రెస్ మారుస్తుంది తెలంగాణ భవిష్యత్ ఇప్పుడు ఇస్తుంది 200 యూనిట్‌ల ఫ్రీ విద్యుత్
- బాగుండాలి ఐదేళ్ల జీవితం.... రావాలి ఐదు వేళ్ల హస్తం
- కాంగ్రెస్ మనకు అండ దండ... ఇస్తుంది రూ. 500కే గ్యాస్ బండ
- కాంగ్రెస్ వస్తే ఎన్నో ఉపయోగాలు.... యువతకు దొరుకుతాయి లక్షల్లో ఉద్యోగాలు
- తెలంగాణలో కమలం జెండా ఎగరాలి.. బీజేపీ గెలవాలి... బీసీ సీఎం కావాలి
- బద్దలు కొడదాం దొరల గడీ
- సాలు దొర... సెలవు దొర

అందరి దృష్టి కామారెడ్డిపైనే..

ఎస్. వేణుగోపాలచారి

కామారెడ్డిలో ఏం జరుగుతుంది.. ఈ ఎన్నికల్లో ఇప్పుడు అందరి దృష్టి అదే. తెలంగాణ తెచ్చిన నేతగా, ముచ్చటగా మూడోసారి సీఎం పీఠాన్ని అధిరోహించాలన్న పట్టుదలతో కేసీఆర్‌లో కామారెడ్డిలో బరిలోకి దిగగా, ఆయనపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీకి దిగడమే చర్చకు ప్రధాన కారణం. రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలు జనం నాడి పట్టేందుకు సర్వేల మీద సర్వేలు చేస్తున్నాయి. కేసీఆర్, రేవంత్‌రెడ్డితోపాటు బీజేపీ నుంచి స్థానికంగా గట్టి పట్టు సంపాదించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ చేస్తున్నారు. ఈయనకు నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉంది.









మూడ్ ఎలా ఉంటుందో..

సాధారణంగా వీవీఐపీలు పోటీ చేసే నియోజక వర్గాల్లో ప్రజల నాడి త్వరగా బయటపడుతుంది. కానీ ఇక్కడ రెండు పార్టీల కీలక నేతలు పోటీ చేస్తుండడం, వారికితోడు స్థానికుడైన బలమైన నాయకుడు బరిలో ఉండడంతో పోటీ ఎవరి మధ్యన ఉంటుందన్నదానిపై ఇప్పటికైతే క్లారిటీ రావడం లేదు. స్వయంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్న భావన కొన్ని సెక్షన్లలో ఉండడం సహజం. అధికార బీఆర్‌ఎస్‌పై ఉన్న ఒకింత వ్యతిరేకత ఓట్లను ప్రతిపక్ష పార్టీలు రెండూ పంచుకుంటే అధికార పార్టీకి లాభం జరుగుతుందనే అంచనాలు ఉంటాయి.

సర్వేల మీద సర్వేలు...

ఇప్పుడు కామారెడ్డి సర్వే రాయుళ్లకు కేరాఫ్ నిలిచిందంటే అతిశయోక్తి కాదు. జనం నాడి పట్టేందుకు ఓ పక్క రాజకీయ పార్టీలు సొంతంగా సర్వేలు చేయించుకుంటుండగా, మరో పక్క నిఘా వర్గాలు, మీడియా సంస్థలు పోటాపోటీగా సర్వేలు చేస్తున్నాయి.

కాటిపల్లి 'లోకల్'

బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి గత నాలుగైదేళ్లుగా నియోజకవర్గంలో నిరంతరం ప్రజా సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. డ్వాక్రా మహిళలకు రావలసిన వడ్డీ రాయితీ డబ్బుల కోసం, మాస్టర్ ప్లాన్‌తో నష్టం జరుగుతోందని ఆందోళన చెందిన రైతుల కోసం ఈయన అండగా అండగా నిలిచి ఉద్యమానికి నాయకత్వం వహించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయించాలని పెద్ద పోరాటమే చేశారు. ఇలా వరుస ఉద్యమాలతో జనంతో మమేకమైన వెంకటరమణారెడ్డి తనకు స్థానికులు ఓట్లు వేసి పట్టం కడతారని ఆశిస్తున్నారు. ఆ మేరకు రూ.150 కోట్లతో సొంత మేనిఫెస్టోను అమలు చేస్తానని ప్రకటించాడు. సీఎం పోటీ చేస్తున్నా.. వెరవకుండా తన పని తాను చేసుకుంటూ పోతున్నారు.

పేగుబంధం సెంటిమెంట్‌తో కేసీఆర్

రెండు పర్యాయాలుగా గజ్వేల్ నుంచి పోటీ చేసి విజయం సాధించిన సీఎం కేసీఆర్ ఈసారి గజ్వేల్‌తో పాటు మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. తాను పోటీ చేయడం వల్ల ఈ ప్రాంతంలో ఐదారు నియోజక వర్గాలపై ప్రభావం చూపవచ్చనే ఉద్దేశంతో రెండు స్థానాల్లో పోటీకి సిద్ధమయ్యారు. 44వ నంబరు జాతీయ రహదారి ద్వారా హైదరాబాద్‌కు కేవలం గంటన్నరలో చేరుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో కేసీఆర్ కామారెడ్డిని ఎంచుకున్నట్టు భావిస్తున్నారు. దీనికి తోడు కేసీఆర్ తల్లి పుట్టి పెరిగిన ఊరు కావడంతో ఈ ప్రాంతంతో ఆయనకు పేగుబంధం ఉన్నది. ఇక్కడ పోటీ చేయాలన్న నిర్ణయానికి వచ్చిన దరిమిలా కేసీఆర్ అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందే అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించారు.

సవాల్ చేసి మరీ బరిలోకి దిగిన రేవంత్...

అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్యన జరిగే మాటల యుద్ధంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సీఎంకు దమ్ముంటే కొడంగల్‌కు వచ్చి నిలబడమని లేదంటే, తానే కామారెడ్డికి వచ్చి పోటీ చేస్తానంటూ పలుమార్లు సవాళ్లు విసిరారు. సీఎం గానీ, ఆయన పార్టీ నేతల నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు. కానీ సవాల్ విసిరిన రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి బరిలోకి దిగారు.

బీజేపీలోకి సీఎం దోస్తు ఆకుల ఆగవ్వ

తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్నప్పుడు ఆ గ్రామంలో సామూహిక భోజనాలు చేశారు. అప్పట్లో గ్రామానికి చెందిన ఆకుల ఆగవ్వ పక్కనే కేసీఆర్ కూర్చొని భోంచేశారు. సభలో కూడా ఆమెను పక్కనే కూర్చోబెట్టుకొని తన ప్రసంగంలో.. 'ఆగవ్వ నా దోస్తు .. ఈ వాసాలమర్రి ముచ్చట్లు, ఆమె కుటుంబ ముచ్చట్లు అన్నీ చెప్పింది' అని తెలిపారు. దీంతో అప్పట్లో ఆకుల ఆగవ్వకు బాగా ప్రచారం వచ్చింది. కాగా ఆమె సోమవారం ఆలేరు బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఆగవ్వతో పాటు ఉపసర్పంచ్ సహా పలువురు కాషాయజెండా కప్పుకున్నారు.





ప్రజలకు మేలు చేయాలనే తపన ఎవరికీ లేదు

ఇప్పుడంతా రియల్ ఎస్టేట్, బిజినెస్ కాంట్రాక్ట్ పాలిటిక్స్

ఫ్లోరోసిస్ సమస్యను చర్చనీయాంశం చేశా..

రేడియాలజిస్ట్‌గా 40 ఏళ్లుగా సేవలందించా...

ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి

కె. రాహుల్

పార్టీ టికెట్ సాధన మొదలు, ఎన్నికల ప్రచారం, ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రలోభాల పర్వం వరకు మొత్తం రూ.కోట్ల దబ్బు ముడిపడటంతో పోటీచేసే వారిలో సామాజిక కోణం, సేవాదృక్పథం లోపిస్తోంది. రియల్ వ్యాపారులు, పెద్దఎత్తున భూములు కబ్జా చేసినవారు, ఇతర వ్యాపారాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేసే వారి వద్ద అడ్డగోలుగా అక్రమ సంపాదన పెరిగి రాజకీయాల్లోకి వస్తుండటంతో ఎన్నికల్లో మామూలు వ్యక్తులు, సేవా దృక్పథం ఉన్నవారు పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయింది' అని ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో కె.గోవర్ధన్‌రెడ్డితో సాక్షి ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు.

నేటి రాజకీయాల్లో సామాజిక దృక్పథమేదీ?

1985 ఎన్నికల్లో రూ.లక్షన్నర ఖర్చుతో పోటీచేశా..

నేను ఓ డాక్టర్‌గా, ఓ సామాజిక కార్యకర్తగా దరఖాస్తు చేసుకుంటే.. 1985లో మలక్‌పేట నుంచి పోటీచేసేందుకు అప్పటి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో మొత్తం అయిన ఖర్చు కేవలం రూ.లక్షన్నర (పార్టీ ఇచ్చిన రూ.50 వేలు కలిపి). అప్పటి సీఎం నాదెండ్ల భాస్కర రావు, బీజేపీ అభ్యర్థి నల్లు ఇంద్రసేనారెడ్డితో పోటీపడి ఓటమి చవిచూశాను. ఆంధ్రప్రదేశ్ ఫ్లోరోసిస్ విమోచన సమితి అధ్యక్షుడిగా, వివిధ సామాజిక సంఘాల అధ్యక్షుడిగా పనిచేశాను.

సాగర్‌లో అణువిద్యుత్ కేంద్రం వద్దని రాజీవ్‌ని కోరాను..

నాగార్జునసాగర్‌లో అణువిద్యుత్ కేంద్రం పెడతారని ప్రచారం కావడంతో వెంటనే స్పందించాను. అప్పటి నల్లగొండ, ప్రకాశం తదితర జిల్లాల్లో ఫ్లోరోసిస్ సమస్య ఉన్నందున ఈ కేంద్రం పెడితే పర్యవసానాలు వివరిస్తూ దీనిని విరమించుకోవాలంటూ, నేరుగా ప్రధాని రాజీవ్‌గాంధీ కార్యాలయానికి లేఖ రాశాను. రెండువారాల్లోనే ప్రధాని సెక్రటరీ దూబే నుంచి ఆ లేఖ అందినట్టుగా జవాబు వచ్చింది. మూడునెలల తర్వాత ముంబైలోని అణు విద్యుత్ విభాగం డైరెక్టర్ విజయ మనోరమ నుంచి మరో వివరణ లేఖ (పీఎంఓ నుంచి నా వినతిపత్రం కాపీ వారికి అందాక) వచ్చింది. సమీప భవిష్యత్‌లో ఈ కేంద్రాన్ని పెట్టే ఉద్దేశం లేదని, పెట్టదలిస్తే అందరి అభిప్రాయాలు తీసుకుని, పబ్లిక్ హియరింగ్ నిర్వహించాకే దానిని చేపడతామని స్పష్టం చేశారు.

ఉమ్మడి ఏపీలో తొలి ప్రజాప్రయోజన వ్యాజ్యం నాదే...

1991లో సిరీస్ ఇండస్ట్రీ కారణంగా భూగర్భజలాలు కలుషితం కావడంపై ఉమ్మడి ఏపీ హైకోర్టులో నేను మొట్టమొదటి ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశాను. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సీజే జస్టిస్ భగవతి సూచనలు జారీచేసిన మూడు నెలల్లోనే సీనియర్ న్యాయవాది, పీయూసీఎల్ నేత ప్రతాపరెడ్డి ద్వారా పిల్ దాఖలు చేశాను. కేసు జస్టిస్ రామాంజనేయులునాయుడు బెంచ్‌కు వెళ్లగా 24 గంటల్లో దీనిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు చుట్టుపక్కల కాలనీలు, గ్రామాలకు మంచినీటిని పంపిణీ చేసేలా సిరీస్ సంస్థ ద్వారా ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టారు. ఎఫ్లూయెంట్స్‌ను ట్రీట్ చేసి బయటకు పంపించేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఫ్లోరోసిస్ సమస్యపై పోరాటం...

రేడియాలజిస్ట్‌గా మొదటి ప్రైవేట్ క్లినిక్ పెట్టాక...నల్లగొండ నుంచి నాగార్జునసాగర్ దాకా ఎక్స్‌రే యూనిట్లే లేకపోవడంతో కాళ్లు వంకర అని, నడవలేకపోతున్నామని నా దగ్గరకు చాలా మంది వచ్చేవారు. అన్నిఎక్స్‌రేలలో తెల్లటి చారలు కనిపించడంతో దానిపై పరిశోధన జరిపితే ఫ్లోరోసిస్ జబ్బు అని తేలింది. ఎముకల్లో ఫ్లోరిన్ జమ కావడంతో ఈ జబ్బుకు కారణమని స్పష్టమైంది. ఇతరులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఫ్లోరోసిస్ విమోచన సమితిని ఏర్పాటు చేసి దాని ద్వారా చైతన్య కార్యక్రమాలు చేపట్టాను. 30 ఏళ్లకే ముసలితనం అనే వీడియోను చిత్రీకరించి ఫ్లోరోసిస్‌పై విస్తృత ప్రచారం చేశాము. సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చే కృష్ణా జలాల్లో మార్గ మధ్యలో ఉన్న ఫ్లోరోసిస్ ప్రభావిత దాదాపు 150 గ్రామాలకు (శివన్నగూడెం దాకా) నీరు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించాం. ఏఎంఆర్ ప్రాజెక్ట్ వచ్చాక ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు కట్టి ఇచ్చారు. మిషన్ భగీరథ రావడంతో ఈ సమస్య దాదాపుగా తగ్గిపోయింది.

other voice

పిల్లల నీతికథలూ.. పెద్దల గడుసుదనాలు!

ఓ సర్వే బృందం పల్లెలోకెళ్లి.. 'అవ్వా ఓటెవరికేస్తావ్?' అని అడుగుతారు.

ఇంకాస్త లౌక్యంగా ఇంకో సర్వే బృందం ప్రశ్న..''తాతా ఈసారి వచ్చేదెవరు?' అంటూ.

ఈ సర్వేల సంస్థలిలా అడిగినప్పుడు..మన అవ్వాతాతలు చెప్పే మాటలిలా ఉంటాయి. ''మనది రహస్య ఓటింగ్ కదా. మీరు అడగనూవద్దు..మేం చెప్పనూకూడదు'' అంటుంటారా ఓటర్లు. కావాలంటే మీ(రో)రీసారి అడిగి చూడండి.

గడుసు ఓటర్ల ధోరణి ఎలా ఉంటుందన్న విషయాన్ని పాత నీతికథల రూపంలో..సరికొత్తగా ఇలా చెప్పాడో పెద్దమనిషిలాంటి ఓటరు తాత.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలిద్దరూ ఒకేసారి వెళ్లి ఓటరు తాత దగ్గర కూర్చున్నారు.

''కాంగ్రెస్ దూకుడుమీద ఉందని కొన్ని సర్వేలు అంటున్నయ్. నువ్వేమంటవ్ తాతా... అసలు సంగతి చెప్పు, అబద్ధమాడకుండా చెప్పు' అంటూ కాస్త దిగులుగా అడిగాడు బీఆర్ఎస్ నేత.

''బిడ్డా నీకో కథ చెబుతా విను. అనగనగనగా ఓ తాబేలూ, ఓ కుందేలు. ఈ రెండూ పరుగు పందెమేసుకున్నాయి. కుందేలు దూకుడుగా వెళ్లింది. కానీ ఆఖర్న గెలిసిందే తాబేలే కదా. ఎవరు దూకుడు మీద ఉంటే నీకెందుకు బిడ్డా, గెలిసేదెవరో నీకు తెలుస్తలేదా?!'' అన్నాడు తాత. ఆ మాట విని, బరువు దిగినట్టుగా హాయిగా నిట్టూర్చి తిరిగి తన ప్రచారానికి బయల్దేరాడు బీఆర్ఎస్ నేత.

అప్పుడు కాస్తంత కినుకగా ఆ కాంగ్రెస్సాయన..''తాతా..మేం దూకుడు మీద ఉన్న కుందేళ్లమా? ఆయన గెలిచే తాబేలేనా? నిజం చెప్పు?'' అంటూ తాతను నిలదీశాడు.

''నేను అబద్ధమాడేటోణ్ణి కాదు బిడ్డా. మీరు కుందేలే. ఆయన తాబేలే. తాబేలని ఎందుకన్నానో తెలుసా? తీరా ఆయన గెలిచాడే అనుకో. కీలకమైన టైములో తలను డిప్పలోకి లాక్కునే తాబేల్లాగా ఇంట్లోకో లేదా ఫామ్‌హౌస్‌లోకో వెళ్లిపోతాడు తీరిగ్గా. మనమెంత తనుకులాడినా తన తల బైట పెట్టనే పెట్టడు అచ్చం తాబేల్లాగానే. అందుకే ఆ జవాబిచ్చిన బిడ్డా'' అంటూ అదే కథతో సంతృప్తిపరిచాడు. కానీ పూర్తి సంతృప్తి పొందని కాంగ్రెస్ వాళ్లు ఇలా అడిగారు.

''అయితే తాతా..మా సంతృప్తి కోసం చెప్పినా, కథలోలా మేము ఓడిపోతాం కదా?'' అని అడిగారు.

అప్పుడు తాత ఇలా అన్నాడు... ''చెప్పిన కదా నేను అబద్ధమాడను. అన్నమాట తప్పను. మీరు కుందేలే. కానీ ఈ కథలో కుందేలు కాదు. మీకూ తెలుసే కథ. ఇందులో అడవికి రాజైన సింహానికి బాగా పొగరు పెరిగింది. సొంత జనాలని చూడకుండా రోజుకో జంతువును వేధించసాగింది. చివరికి ఓ కుందేలు వంతు వచ్చింది. అప్పుడది కాస్త లేటుగా వెళ్లింది. 'రాజైన నా దగ్గరికే ఇంత లేటుగా వస్తావా? ఆయ్..' అని గద్దించింది. దాంతో ఆ కుందేలూ..'సింహరాజా.. దార్లో వస్తుంటే మరో సింహం అడ్డగించింది.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

దాంతో కాస్త లేటయ్యింది' అంది. అసలే పొగరు, దానికితోడు కోపం ఇంకా ఎక్కువైన ఆ సింహం ''ఈ అడవిలో మరో సింహమా, ఎక్కడా?'' అని అడిగింది. కుందేలు ఓ పాడుబడ్డ బావిని చూపించింది. దాంట్లోకి తొంగి చూడగానే తన నీడే మరో సింహంలా కనిపించింది. అంతేకాదు..దాని అరుపే ప్రతిధ్వనించి మరో సింహం గర్జించినట్టుగా ఫీలయ్యింది. అంతే ఆ బావిలోకి దూకేసింది''

''మీకూ తెలుసు కదా. రెండుసార్లు గెలిచే సరికి సారు పొగరెక్కిన సింహంలా ఉన్నాడనీ. దానికి తగిన జవాబు చెప్పే కుందేళ్లు మీరే నాయనా'' అంటూ వీళ్లనూ సంతృప్తిపరచి పంపాడా తాత.

సర్వేవాళ్లూ, విశ్లేషకులూ... ఈ రెండు కథలూ మన చిన్నతనం నుంచీ విన్నవే. ఈ రెండూ మనం ఆమోదించి, ఆనందించేవే. ఇప్పుడు చెప్పండి. తాత కథను బట్టి ఎవరు గెలిచేది? ఎవరు ఓడేది?

అందరి అంచనాలూ ఇలా తాత-అవ్వలు చెప్పే కథలే నాయనా... కేవలం కట్టుకథలు. చివరన..ఈ కథలు చెప్పే నీతేమిటో తెలుసా నాయనా?

అసలు కథ తెలిసేది..అసలు ఫలితాలొచ్చాకే!

(బాలల దినోత్సవం సందర్భంగా...)

గాసిప్ టైమ్

అక్కడ వాలిపోయారు

అసలే ఎన్నికల కాలం.. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే రాష్ట్ర స్థాయి నేతలంతా వాలిపోయే సమయం. ఎన్నికల్లో ఎంత ప్రయోజనం పొందుతామన్నదే ఆ నేతల పరామర్శలకు పరమార్థం. ప్రచారంలో క్షణం తీరిక లేకుండా ఉన్న నాయకులైనా సరే.. ఆ ఘటన జరిగిన ప్రాంతానికి స్వయంగా వెళ్లి రావడానికే ఇష్టపడతారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరం నాంపల్లి బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సామాన్యులు అసువులు బాశారు. అంతే.. ఆ దుర్ఘటన జరిగిన ప్రాంతానికి అధికార, విపక్షాల అగ్రనేతలంతా తరలివెళ్లారు. ఘటనపై స్పందించారు. బాధితులను పరామర్శించారు. కానీ ఇక్కడ విషయమేమిటంటే గతంలోనూ నగరంలో పలు అగ్ని ప్రమాద సంఘటనలు చోటుచేసుకుని ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో పెద్దగా బయటకురాని నేతలు ఇప్పుడు బయటికొచ్చేశారు. అప్పట్లో కనీసంగా స్పందించని పార్టీలు ఇప్పుడు మాత్రం బావురుమంటున్నాయి. బాధితుల పక్షాన గట్టిగా మాట్లాడుతున్నాయి. ఇదంతా ఎందుకో.. ఆ మాత్రం తెలియదా..? ఎన్నికలు ఎన్ని'కలలో'!

జంగ్ తెలంగాణ
VOTE
పంచతంత్రం

ఓట్ల కోసం బంగారు కోట కూడా కట్టిస్తామంటారు

కాంగ్రెస్ అంతటి హామీలు ఇవ్వగలదు • ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ఎద్దేవా



బర్వానీ/ముంగేలీ/మహాసామంద్: మధ్యప్రదేశ్‌లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతటి అసాధ్యమైన హామీలనైనా గుప్పించగలదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. రాజస్తాన్‌లో 2022లో ఉదయ్‌పూర్ పట్టణంలో దర్జీ కన్హయ్య లాల్‌ను దుండగులు తల నరికిన ఘటనను ప్రధాని గుర్తుచేశారు. ''తల తీసేయండి అనే దారుణ నినాదాలు దేశంలో ఏనాడైనా విన్నామా? రాజస్తాన్‌లో కాంగ్రెస్ అసమర్థ పరిపాలన వల్లే ఇలాంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో హింస, లూటీలు పెరిగాయి. అక్కాచెల్లెళ్లు, కూతుళ్లపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. మధ్యప్రదేశ్‌లోనూ అంతే. బీజేపీ వచ్చాకే ఇవన్నీ ఆగిపోయాయి. గతంలో చక్కగా ఉన్న రాష్ట్రాలు సైతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రభను కోల్పోయాయి''అని మోదీ ఆరోపించారు. 'ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పెద్దలు బంగారంతో కోట కట్టిస్తామని కూడా హామీ ఇస్తాగలరు. బంగాళాదుంపల నుంచి తీసిన బంగారంతోనే ఈ కోట కట్టామంటారు'అని మోదీ ఎద్దేవాచేశారు. 'బంగాళాదుంపల నుంచీ అతి స్వల్పమొత్తంలో బంగారాన్ని తీయొచ్చు'అని 2017లో రాహుల్ గాంధీ అన్న మాటలను మోదీ ఉటంకించారు.

బఘేల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది..

ఛత్తీస్‌గఢ్‌లోని ముంగేలీ, మహాసామంద్ జిల్లాల్లోనూ మోదీ ప్రచారం చేశారు. 'ఛత్తీస్‌గఢ్‌ను లూటీ చేసి తమ ఖజానాతో నింపుకోవడమే కాంగ్రెస్ పని. ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కంటే కూడా ఆయన కుమారుడు, ఇతర ఉన్నతాధికారులు 'సూపర్ సీఎం'గా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని నాశనం చేశారు. టీఎస్ సింగ్ దేవ్‌కూ సీఎం పదవి కట్టబెడతామని పార్టీ మాటిచ్చి మోసం చేసింది. రాష్ట్ర ప్రజల్నీ అలాగే మోసగిస్తుంది. ఈసారి పఠాన్ నియోజకవర్గంలో స్వయంగా సీఎం ఓడిపోతారని నా ఢిల్లీ స్నేహితులు చెప్పారు. ఇక్కడ తమ పని అయిపోయిందని కాంగ్రెస్‌కు తెలుసు''అని మోదీ వ్యాఖ్యానించారు.

కుల గణితంలో... హస్తవ్యస్తమే..!

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ అసెంబ్లీ ఎన్నికల పోరు సాగుతున్న మధ్యప్రదేశ్‌లో కులాల కుంపట్లు హస్తం పార్టీకి ప్రతికూలంగా మారేలా కన్పిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగల అగ్రకులాలు అండగా లేకపోవడం కాంగ్రెస్‌కు ఈసారీ నష్టం చేస్తుందంటున్నారు. వారి మద్దతు కూడగట్టుకునేందుకు పార్టీపరంగా పెద్దగా ప్రయత్నాలు కూడా జరగడం లేదు. దాంతో ఈసారి కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనే ప్రధానంగా ఆధారపడాల్సిన పరిస్థితి! సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా బీజేపీలోకి ఫిరాయించిన తర్వాత ఉన్నత వర్గాలను ఆకట్టుకునేలా చర్యలేవీ లేకపోవడం కూడా కాంగ్రెస్ విజయావకాశాలను ప్రభావితం చేసేలా కన్పిస్తోంది...

అగ్రకులాలు.. గట్టి శక్తే

- మధ్యప్రదేశ్ జనాభాలో అగ్ర కులాలు 14 శాతం వరకు ఉన్నాయి.
- వీరిలో 6 శాతం బ్రాహ్మణులు, 5.8 శాతం రాజపుత్రులు 2.5 బనియాలున్నారు.
- రాష్ట్రంలో 10కి పైగా జిల్లాల్లో ఏకంగా 80కి పైగా అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను అగ్రవర్ణాల ఓట్లు గట్టిగా ప్రభావితం చేయగలవు.
- గ్వాలియర్, నర్సింగఢ్, రేవా, సారన్‌గఢ్, కంకేర్ ప్రాంతాల్లో అగ్రకులాలదే ఆధిపత్యం.
- ఇక మధ్యప్రదేశ్‌లో ఓబీసీలు 42 శాతం, ఎస్టీలు 21 శాతం, ఎస్సీలు 14 శాతం దాకా ఉన్నారు.

క్రమంగా దూరం...

- మధ్యప్రదేశ్‌లో అగ్రవర్ణాలన్నీ నిజానికి 2003 వరకు కాంగ్రెస్‌తోనే సాగాయి. ఆ తర్వాత నుంచి పలు కారణాలతో క్రమంగా పార్టీకి దూరమవుతూ వస్తున్నారు...
- రాష్ట్రంలో బీజేపీ హవా పెరుగుతున్న కొద్దీ కాంగ్రెస్‌కు అగ్ర కుల ఓట్లు బాగా తగ్గుతూ వచ్చాయి.

- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు దూరమైన అగ్రకులాలు
- బీజేపీ వైపే బ్రాహ్మణ, రాజ్‌పుత్, క్షత్రియ వర్గాలు
- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు
- ఆ వర్గాల్లోనూ బీజేపీకి గట్టి ఓటు బ్యాంకు



- 1990 వరకు అగ్రకుల ఓట్లలో కాంగ్రెస్ 40 శాతం దాకా రాబడుతూ వచ్చింది.
- 2003 నాటికి ఇది సుమారు 37 శాతానికి పరిమితమైంది.
- 2008లో అగ్రవర్ణ ఓటర్లలో కేవలం 19 శాతం మంది మాత్రమే కాంగ్రెస్‌కు ఓటేశారు. దాదాపు 45 శాతం మందికి పైగా బీజేపీకి జై కొట్టారు.
- 2013లో అగ్ర కుల ఓట్లలో బీజేపీకి 59 శాతం, కాంగ్రెస్‌కు 24 శాతం దక్కాయి.
- 2018లో కాంగ్రెస్ కాస్త మెరుగైన ఫలితాలే సాధించింది. అగ్రవర్ణ ఓట్లలో కాంగ్రెస్ 33 శాతం సాధించింది! అయితే బీజేపీకి ఏకంగా 58 శాతం ఓట్లు పడ్డాయి.

సింధియా నిష్క్రమణతో...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు 15 నెలలకే షాక్ తగిలింది. తనను కాదని కమల్‌నాథ్‌ను సీఎం చేయడంపై ముందునుంచీ తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా అదను చూసి దెబ్బ కొట్టారు. 2020లో ఏకంగా 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరిపోయారు! దాంతో కమల్‌నాథ్ సర్కారు కుప్పకూలడం, శివరాజ్‌సింగ్ చౌహాన్ సీఎంగా బీజేపీ అధికార పగ్గాలు చేపట్టడం చకచకా జరిగిపోయాయి. సింధియా నిష్క్రమణతో అగ్ర వర్ణాలతో కాంగ్రెస్‌కు దూరం మరింత పెరిగింది. వారిని పార్టీకి దగ్గర చేసేందుకు సీనియర్ నాయకుడు దిగ్విజయ్‌సింగ్ చొరవ చూపినా పెద్దగా లాభం లేకపోయింది. ఆయన ప్రయత్నాలకు పార్టీ అధిష్టానం నుంచి పెద్దగా సహకారం కూడా లభించలేదంటారు.

ఆ కులాల మీదే దృష్టి!

- రాష్ట్రంలో 42 శాతానికి పైగా ఉన్న ఓబీసీలు, 35 శాతం దాకా ఉన్న ఎస్సీ, ఎస్టీల ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంటూ వస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ చీఫ్ కమల్ నాథ్ తదితరులు కూడా తమ ఎన్నికల వ్యూహాల్లో అదే చెబుతూ వస్తున్నారు. ఈ సామాజిక వర్గాల ఓట్లమీదే ప్రధానంగా దృష్టి పెట్టాలని అభ్యర్థులకు పదేపదే నొక్కిచెబుతూ వచ్చారు...
- అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బిహార్ తరహాలో కులగణన జరుపుతామని ఇప్పటికే ప్రకటించారు.
- ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చారు.
- ఈసారి ఎన్నికల్లో ఓబీసీలకు 62 టికెట్లు, ఎస్టీలకు 34, ఎస్సీలకు 18 టికెట్లు కాంగ్రెస్ కేటాయించింది.

ఓబీసీల్లోనూ ఈజీ కాదు...!

- అయితే కేవలం ఓబీసీ, ఇతర కులాల దన్నుతో గత ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఓట్లను అధిగమించడం కాంగ్రెస్‌కు అంత సులువు కాదని గణాంకాలు చెబుతున్నాయి...
- 2008 అసెంబ్లీ ఎన్నికల్లో ఓబీసీల్లో బీజేపీ 41% శాతం ఓట్లను సాధించింది. కాంగ్రెస్‌కు దక్కింది 27 శాతమే.
- 2013 ఎన్నికల్లోనూ ఓబీసీ ఓట్లలో కాంగ్రెస్‌కు 35 శాతం రాగా బీజేపీ 44 శాతం ఓట్లు సాధించింది.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి 48 శాతం ఓబీసీ ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 41శాతం వచ్చాయి.
- ఇక ఎస్సీ, ఎస్టీ ఓట్లలోనూ కాస్త అటూ ఇటుగా ఇదే ధోరణి ప్రతిఫలించి.
- ఈ నేపథ్యంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లతోనే గట్టెక్కాలనుకోవడం సాహసమేనని కాంగ్రెస్ వర్గాలే అంటున్నాయి!


రోడ్లు లేక, అభ్యర్థులు రాలేక.. ఆ ఊళ్లో ఎన్నికల సందడే లేదు!

అలిరాజ్‌పూర్: మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల సందడి పీక్స్‌కు చేరింది. పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. తమకే ఓటేయాలంటూ అభ్యర్థులు జనంలో కలియదిరుగుతున్నారు. పోలింగ్‌కు మరో ఐదు రోజులే ఉంది. కానీ అలిరాజ్‌పూర్ జిల్లాలోని జందానా గ్రామంలో మాత్రం అసలు ఎన్నికల సందడే కనిపించడం లేదు! ఎందుకంటే ఈ ఊరు దూరంగా విసిరేసినట్లు మారుమూలన ఉంటుంది. ఇక్కడికి చేరాలంటే నాటు పడవలే దిక్కు. జిల్లా కేంద్రమైన అలిరాజ్‌పూర్ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జందానాలో 763 మంది ఓటర్లున్నారు. అంతా గిరిజనులే. భిలీ భాష మాట్లాడుతారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలంటే ఏమిటో కూడా వారికి తెలియదు. నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ డ్యామ్ వెనకతట్టు జలాల్లో జందానా ఉంటుంది. డ్యామ్ రాకతో ఊరు చాలావరకు మునిగిపోయింది. గిరిజనులు తప్ప ఇతరులంతా వలస వెళ్లారు. ఇక్కడ ఎన్నికలు నిర్వహించాలంటే పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రి చేతబట్టి పడవల్లో, కాలినడకన రావాల్సిందే. పైగా దారంతా రాళ్ల రప్పలే. అందుకే అభ్యర్థులెవరూ ఇక్కడ ప్రచారానికి రావడమే లేదు. జందానా విలేజ్ ఎస్టీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానమైన అలిరాజ్‌పూర్ పరిధిలోకి వస్తుంది. బీజేపీ నుంచి నాగర్‌సింగ్ చౌహాన్, కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముకేశ్ పటేల్ పోటీ చేస్తున్నారు. తమ గ్రామానికి కనీసం రోడ్డు వేయాలని దశాబ్దాలుగా వేడుకుంటున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని జందానావాసులు వాపోతున్నారు.

అది అవినీతి రాజధాని

బీజేపీపాలిత మధ్యప్రదేశ్‌పై రాహుల్ గాంధీ ఆరోపణ

నీమచ్/హర్దా: ఏళ్లకేళ్లు మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పాలిస్తూ బీజేపీ సర్కార్ ఈ రాష్ట్రాన్ని అవినీతి రాజధానిగా మార్చేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుమ్మెత్తిపోశారు. సోమవారం ఆయన రాష్ట్రంలోని నీమచ్, హర్దా జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ అవినీతికి అంతేలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ' ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయం. మేం గెలిచాక రాష్ట్రంలో కులగణన చేపడతాం' అని వ్యాఖ్యానించారు. 'రూ.500కే ఎల్పీజీ సిలిండర్ సరఫరా చేస్తాం. రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ అమలుచేస్తాం. గోధుమలకు ఇస్తున్న కనీస మద్దతు ధరను రూ.3,000కు పెంచుతాం. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తాం' అని రాహుల్ హామీ ఇచ్చారు. ' 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ బడా పారిశ్రామికవేత్తలతో కలిసి కుట్రతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల పక్షపాత కాంగ్రెస్‌ను పక్కకునెట్టి బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంది' అని ఆరోపించారు.



దోచుకోవడంలో పోటీపడుతున్నారు

వందలకోట్ల నగదు లావాదేవీలపై కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పెద్దకుమారుడు దేవేంద్ర ప్రతాప్ మాట్లాడినట్లు చెబుతున్న రెండు వీడియో క్లిప్‌లపై రాహుల్ స్పందించారు. ' కూర్చున్న చోట నుంచే కోట్లాది రూపాయలు ఎలా దోచేస్తున్నారో తోమర్ కుమారుడి వీడియో చూస్తే ఇట్టే తెలుస్తోంది. దేవేంద్రపై మోదీగానీ, ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు విచారణకు ఆదేశించారా? ఏమైనా చర్యలు తీసుకున్నారా?' అని ప్రశ్నించారు. 'బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులు తక్కువేం కాదు. రైతులు, కార్మికుల సొమ్ము దోచేసేందుకు పోటీపడుతున్నారు' అని అన్నారు. ' అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసేందుకే పెద్ద నోట్లను రద్దుచేశారు. కానీ ఏం సాధించారు? సంపన్నులే బాగుపడ్డారు. నిజానికి పెద్ద పారిశ్రామికవేత్తల కన్నా సమాజంలో చిన్న వ్యాపారులు, వర్తకులే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తారు' అని రాహుల్ అన్నారు. 'మధ్యప్రదేశ్‌లో 500 కర్మాగారాలు కొత్తగా పెట్టామని మోదీ బహిరంగంగా అబద్ధాలు చెబుతున్నారు. నాకైతే నీమచ్ జిల్లాలో ఒక్కటి కూడా కొత్త కర్మాగారం కనిపించలేదు' అని రాహుల్ వివరించారు.

మోదీ చెప్పేది అబద్ధం

'దేశంలో కులం అనేది లేదు. పేదరికం అనే కులం ఒక్కటే దేశాన్ని ఇబ్బందిపెడుతోందని మోదీ పదేపదే అబద్ధాలాడుతున్నారు. కేంద్రస్థాయిలో 93 మంది 'ఉన్నతాధికారులు' ఉంటే వారిలో ఓబీసీ వారు కేవలం 3 శాతమే. ఇక మధ్యప్రదేశ్‌లో అలాంటి 'అధికారులు' 53 మంది ఉంటే అందులో ఓబీసీ వ్యక్తి ఒక్కరే ఉన్నారు. ఇలాంటి అన్యాయాలకు అడ్డుకట్ట వేసి కులగణన చేపట్టి సరైన న్యాయం చేస్తాం'' అని రాహుల్ హామీ ఇచ్చారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 14 । నవంబర్ । 2023



రాజన్న సన్నిధిలో దీపావళి

వేములవాడ: రాజన్న ఆలయంలో దీపావళి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీపార్వతీరాజరాజేశ్వరస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి వార్లను గజవాహనంపై ఊరేగించారు.



భద్రత మాది.. బాధ్యత మీది

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు కవాతు చేపడుతున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై, జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



‘ఓటు అమ్ముకోవద్దు’

‘స్వాతంత్య్రాన్ని కాపాడటానికి బార్డర్‌లో ప్రాణాలను అర్పిస్తున్నాం.. ఓటు అమ్ముకొని, బానిసత్వానికి నాంది పలకకండి.. మా ప్రాణ త్యాగాలను వృథా చేయకండి’.. అంటూ ఆర్మీ జవాన్ కోట శ్యామ్‌కుమార్ సోమవారం ప్లకార్డు చేతపట్టుకొని, వినూత్నంగా నిరసన తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

న్యూస్‌రీల్

ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 17న కరీంనగర్‌లో పర్యటించనున్నారు. స్థానిక ఎస్సారార్ కళాశాలలో జరిగే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు, శాతవాహన యూనివర్సిటీలో హెలీప్యాడ్‌ను మేయర్ వై.సునీల్‌రావు సోమవారం పరిశీలించారు. సభ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని గత పదేళ్లలో అభివృద్ధి బాట పట్టించి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన అభివృద్ధి ప్రదాత కేసీఆర్ అన్నారు. ఎస్సారార్ కళాశాల గ్రౌండ్‌లో సింహగర్జన సభ నిర్వహించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ యూత్ మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ప్రజాస్వామిక వేదిక నాయకుడు ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం రూపొందించిన స్టూడెంట్స్ యూత్ మేనిఫెస్టోను సోమవారం కరీంనగర్‌లో వినాయకరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర శాసన సభ ఎన్నికల సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్‌లు విద్యార్థులకు, యువతకు ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించడం అభినందనీయం అన్నారు. పదేళ్ల కాలంగా కేంద్రం, రాష్ట్రంలో పాలిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలు విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబించాయన్నారు. నాయకులు కుతాటి రాణా ప్రతాప్, గడ్డం శ్రీకాంత్, అరవింద్, మిరుదొడ్డి అజయ్, రవితేజ, వంశీ పాల్గొన్నారు.

నేటి నుంచి బాలల చలన చిత్రోత్సవం

కరీంనగర్‌కల్చరల్: బాలల దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ ఫిలింసొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఫిలింభవన్‌లో ఈనెల 14, 15, 16 తేదీల్లో సాయంత్రం 6గంటల నుంచి 8 గంటలకు వరకు బాలల చలన చిత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు కఫిసొ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నం రవిచంద్ర, లక్ష్మీగౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ హాస్యనటుడు ఆర్‌ఎస్ నంద హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

జంగ్ తెలంగాణ

65 నామినేషన్ల తిరస్కరణ

- 261 మంది అభ్యర్థులవి ఓకే
- ప్రముఖ నేతల కుటుంబసభ్యులవీ రిజెక్ట్
- ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఓకే
- స్వతంత్రులుగా గంగుల రజిత, ఆది వనజ
- 15 వరకు ఉపసంహరణకు అవకాశం



చొప్పదండిలో నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పరిశీలన సోమవారం ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 65 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బీఫాంలు సమర్పించలేదని కొందరివి, తక్కువ మంది ప్రతిపాదించారని మరికొందరివి, సంతకాలు చేయకపోవడంతో ఇంకొందరివి రిజెక్ట్ చేసినట్లు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 261 మంది వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల, స్వతంతుల నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా, ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు సేఫ్..

ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్‌ఎస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఇవి కాకుండా బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, పలు చిన్న పార్టీల నాయకులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి ఈసారి బరిలో ఉన్నవారిలో మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నారు. ప్రస్తుతానికి వీరిలో ఎవరి నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. కానీ, ముందు జాగ్రత్తగా వారికి డమ్మీగా వేసిన బంధువులు, కుటుంబసభ్యులవి రిజెక్ట్ అయ్యాయి.

తిరస్కరణకు గురైంది వీరే..

హుజూరాబాద్ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమున బీజేపీ నుంచి, కోరుట్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తన కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కి మద్దతుగా, మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, మంథని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు సతీమణి శైలజ, మంథని నుంచే బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి సతీమణి సుజాత నామినేషన్ వేశారు. బీఫాం ఇవ్వలేదన్న కారణంతో వీరందరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన సతీమణి వనజ నామినేషన్ వేశారు. ఈమె కాంగ్రెస్ తరఫున బీఫాం ఇవ్వకపోవడంతో రిజెక్ట్ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఓకే చేశారు. కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత వేసిన నామినేషన్‌ను అధికారులు ఆమోదించారు. ప్రస్తుతానికి ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరిద్దరూ మంగళ, బుధవారాల్లో నామినేషన్ ఉపసంహరించుకోనున్నారు.

ఉత్కంఠ రేపిన ఫిర్యాదులు

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి సీహెచ్.విజయరమణారావు విదేశీ ఆస్తులు, ఇక్కడ ఐటీ రిటర్నుల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు వచ్చింది. అయితే, సంతృప్తికర వివరణతో ఈ ఫిర్యాదును ఆర్వో డిస్పోజ్ చేశారు.
- మానకొండూరులో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా వాటిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు.
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ కేసుల విషయమై ఆర్వోకు ఫిర్యాదు వచ్చింది. చివరకు ఆయన నామినేషన్‌ను అధికారులు ఓకే చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

తిరస్కరించిన నామినేషన్లు : కరీంనగర్‌లో 7, చొప్పదండిలో 1, మానకొండూర్‌లో 7, పెద్దపల్లిలో 5, మంథనిలో 4, రామగుండంలో 5, జగిత్యాలలో 2, కోరుట్లలో 5, ధర్మపురిలో 19, హుజూరాబాద్‌లో 8, సిరిసిల్ల 0, వేములవాడలో 2.

ఆమోదం పొందినవి : కరీంనగర్‌లో 31, చొప్పదండిలో 17, మానకొండూర్‌లో 13, పెద్దపల్లిలో 25, మంథనిలో 24, రామగుండంలో 26, జగిత్యాలలో 19, కోరుట్లలో 20, ధర్మపురిలో 18, హుజూరాబాద్‌లో 25, సిరిసిల్లలో 23, వేములవాడలో 20.

ఈవీఎం.. వీవీప్యాట్ ఎప్పుడు వచ్చాయంటే..



మీకు తెలుసా..!

పెద్దపల్లిరూరల్: మనదేశంలో ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బ్యాలెట్ పేపర్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలను (ఈవీఎం) అందుబాటులోకి తెచ్చారు. దేశంలోనే తొలిసారిగా 1982 మే19న కేరళ రాష్ట్రంలోని పరూర్ నియోజకవర్గంలో వినియోగించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని షాద్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలతోపాటు 1982, 83లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈవీఎంలను వాడారు. అయితే వాటి పనితీరుపై రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపగా కొంతకాలం నిలిపివేశారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అయితే తాము ఎవరికి ఓటు వేశామో ఓటరు తెలుసుకునేందుకు వీలుగా 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీప్యాట్‌ను (ఓటర్ వెరిఫియేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) అనుసంధానించారు. దీంతో ఓటర్లు తాము ఓటు వేయాలనుకునే వారికే వేశామా లేదా అని నిర్ధారించుకునేందుకు వీలుకలిగింది.

తమ్మీ.. తప్పుకోరాదె!

- నామినేషన్ల ఉపసంహరణకు నేతల బేరసారాలు
- 15కు మించితే రెండు ఈవీఎంలు వాడాల్సిందే
- అదే జరిగితే ఓటర్లు తికమకపడే అవకాశం
- రేపు తేలనున్న అభ్యర్థుల లెక్క



అన్నా.. తమ్మీ.. నామినేషన్ వేశావు.. ఈ 15 రోజుల్లో ప్రచారం చేసి, నువ్వు గెలిచేది లేదు.. ఏ ఉద్దేశంతో నామినేషన్ వేశావో ఆ సమస్య అందరికీ తెలిసింది. ఇగ తప్పుకో.. ఇప్పటివరకు నువ్వు చేసిన ఖర్చుకు డబుల్ ఇస్తా. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నీకు టిక్కెట్ ఇప్పించే బాధ్యత నాది. బరిలో ఉంటే రెండు ఈవీఎంలు వాడాల్సి వస్తుంది. అసలే మన నియోజకవర్గంలో గ్రామీణ ఓటర్లు ఎక్కువ. ముసలోళ్లు, సదువురానోళ్లు ఈవీఎంలో నా పార్టీ గుర్తును గుర్తించేందుకు తికమకపడతారు. దీంతో ఓట్లు చీలే అవకాశం ఉంది.. అంటూ ప్రధాన పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులతో మంతనాలు సాగిస్తున్నారు. వారిని నామినేషన్ ఉపసంహరించుకునేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అవి ఏ మేరకు ఫలించనున్నాయో రేపు తేలనుంది.

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీల నేతలు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఏ చిన్న విషయాన్నీ వదలకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా, అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు. దీంతో బరిలో 15 మందికి మించితే రెండో ఈవీఎంను ఉపయోగించాల్సి ఉంటుంది. అదే జరిగితే పోలింగ్ రోజు ఓటర్లు తికమకపడే అవకాశం ఉంది. అలాగే, అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో డమ్మీ ఈవీఎంలను చూపి, ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో, పోటీలో 15 మందిలోపే ఉండేలా తెర వెనక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తవగా, సోమవారం రిటర్నింగ్ అధికారులు వాటిని పరిశీలించారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



జమ్మికుంట ఠాణాలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

- సీపీ అభిషేక్ మహంతి
- జమ్మికుంట, మానకొండూర్ ఠాణాల తనిఖీ

జమ్మికుంట: సార్వత్రిక ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ అభిషేక్ మహంతి అన్నారు. జమ్మికుంట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఠాణా పరిధిలో కేసుల నమోదు, నేరస్తులు, రౌడీషీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్తులపై నిఘా పెట్టాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ రమేశ్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీపీ అభిషేక్ మహంతి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఓటర్లకు భద్రతాభావం కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సున్నిత ప్రాంతాల గుర్తింపునకు కమిటీ

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సున్నితమైన ప్రాంతాలను గుర్తించేందుకు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతితో కలిసి, సమావేశం నిర్వహించారు. సీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో జిల్లా రెవెన్యూ శాఖతోపాటు, పోలీస్, ఐటీ, జీఎస్టీ, బ్యాంకులకు చెందిన నిర్దేశిత అధికారులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీ, పట్టివేత వంటి సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక రూపొందిస్తారని అన్నారు. దాని ఆధారంగా జిల్లాలోని సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, తదనుగుణంగానే వాటిని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. సీపీ మాట్లాడుతూ.. పోలింగ్ జరిగే వరకు వ్యయాలపై ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సీసీఎస్ మాధవి, ఇన్‌స్పెక్టర్ తిరుమల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ కమిటీ ఇదే..

ఐదుగురు అధికారులతో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీని నియమించారు. సీపీ అభిషేక్ మహంతి, పి.శ్రీనివాసరావు(ఎక్సైజ్ సూపరింటెండెంట్), సుబ్బారెడ్డి(ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్), సీహెచ్.రవికుమార్(జీఎస్టీ జాయింట్ కమిషనర్), ఆంజనేయులు(ఎల్‌డీఎం) ఉన్నారు.

ఎపిక్ కార్డులు త్వరగా పంపిణీ చేయండి

ఎపిక్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఎన్నికల విభాగ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్, కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ, హాస్టల్ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, పోస్ట్‌మాస్టర్ పవన్‌కుమార్, డీటీలు మడిపల్లి కాళీచరణ్, తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండిలో పరిశీలన..

చొప్పదండి: చొప్పదండి శాసనసభ స్థానానికి సంబంధించి నామినేషన్ల స్క్రుటినీ కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం పరిశీలించారు. ఇక్కడ మొత్తం 18 మంది నామినేషన్ వేయగా, రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయి, సహాయ రిటర్నింగ్ అధికారులు పరిశీలన జరిపారు. లింగంపెల్లి లచ్చయ్య అనే ఇండిపెండెంట్ నామినేషన్‌లో సంతకాలు లేకపోవడంతో తిరస్కరించినట్లు ప్రకటించారు. తహసీల్దార్ జె.నరేందర్, నామినేషన్ వేసిన పలువురు అభ్యర్థులు తదితరులున్నారు.

అప్పట్లో స్వతంత్రులదే హవా

- 1952–1994 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా
- ఉమ్మడి జిల్లాలో 15 మంది గెలుపు
- ఆ తర్వాత ఆదరణ కరువు



కరీంనగర్ అర్బన్: ఒకప్పుడు చాలా మంది నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి, సత్తా చాటేవారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రజాభిమానం ఉన్న కొందరు నాయకులు స్వతంత్రులుగా పోటీ చేసి, విజయబావుటా ఎగురవేశారు. ప్రజాబలం ముందు పార్టీ సింబల్ బలాదూర్ అని నిరూపించారు. 1952 నుంచి 2018 వరకు 15 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. 1994 వరకు (ఉప ఎన్నికలతో కలిపి) 15 మంది స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి, దక్కకపోవడంతో స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు. గెలిచాక వివిధ పార్టీల్లో చేరిపోయారు. మాజీ ఎమ్మెల్యే గొట్టె భూపతి వరుసగా రెండుసార్లు రిజర్వ్‌డ్ స్థానం(నేరెళ్ల) నుంచి పోటీ చేసి, ప్రజానాయకుడని నిరూపించుకున్నారు.

నియోజకవర్గాల వారీగా గెలిచినవారు..

1952లో మెట్‌పల్లి నుంచి జి.భూమయ్య, 1957లో హుజూరాబాద్ నుంచి పి.నర్సింగరావు, 1957లో హుజూరాబాద్ ద్వినియోజకవర్గం నుంచి జి.రాములు, 1962లో జగిత్యాల నుంచి ఎం.ధర్మారావు, 1962లో బుగ్గారం నుంచి ఎ.నారాయణరెడ్డి, 1967లో నేరెళ్ల నుంచి జి.భూపతి, 1967లో మెట్‌పల్లి నుంచి సీహెచ్.సత్యనారాయణరావు, 1967లో పెద్దపల్లి నుంచి జె.మల్లారెడ్డి, 1972లో నేరెళ్ల నుంచి జి.భూపతి, 1972లో బుగ్గారం నుంచి జె.దామోదర్‌రావు, 1972లో కమలాపూర్ నుంచి పి.జనార్దన్‌రెడ్డి, 1989లో హుజూరాబాద్ నుంచి కె.సాయిరెడ్డి, 1989లో బుగ్గారం నుంచి జె.రత్నాకర్‌రావు, 1989లో కరీంనగర్ నుంచి వి.జగపతిరావు, 1994లో మేడారం నుంచి మాలెం మల్లేశం గెలుపొందారు. ఆ తర్వాత స్వతంత్రులకు ఆదరణ కరువైంది.

17 నుంచి రాష్ట్రస్థాయి సీఎస్‌ఏ క్రీడాపోటీలు



కరీంనగర్ స్పోర్ట్స్: 18వ తెలంగాణ రాష్ట్రస్థాయి సెయింట్ జాన్స్ పాఠశాల(సీఎస్‌ఏ) క్రీడా పోటీలను కరీంనగర్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ ఇన్నాలు తెలిపారు. ఈ నెల 17 నుంచి 3 రోజులపాటు జరుగుతాయన్నారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 1800 మంది క్రీడాకారులు, అధికారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల మైదానంలో రెండు ఖోఖో, మూడు కబడ్డీ, ఒక బాస్కెట్‌బాల్, రెండు వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాఠశాల సుపీరియర్ సిస్టర్ జోసెఫ్ మేరీ, సిస్టర్ జసింత, పీఈటీ ప్రేమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట సిటీలో అగ్ని ప్రమాదం



కోతిరాంపూర్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- రూ.5.50 లక్షల ఆస్తి నష్టం

కరీంనగర్ క్రైం: దీపావళి సందర్భంగా కాల్చిన బాణాసంచాతో నగరంలోని రెండుచోట్ల అగ్ని ప్రమాదం జరిగింది. కరీంనగర్ ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కోతిరాంపూర్‌లో కాల్చిన బాణాసంచా వల్ల మంటలు చెలరేగి, స్థానిక ఒక స్క్రాప్ షాపులోని రెండు టాటాఏస్ వాహనాలు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అలాగే, శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని మరో స్క్రాప్‌షాపులో మంటలు చెలరేగి, ప్లాస్టిక్, ఇనుప సామగ్రి కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసినట్లు ఫైర్ స్టేషన్ అధికారి పరమేశ్వర్ తెలిపారు. ఈ రెండు ప్రమాదాల్లో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదని పేర్కొన్నారు. మొత్తం రూ.5.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నలుగురి బైండోవర్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులను సోమవారం తహసీల్దార్‌ రజని ఎదుట బైండోవర్‌ చేసినట్లు సీఐ రమేశ్‌ తెలిపారు. వీరిపై గతంలో కేసులు నమోదయ్యాయని, ఎన్నికల నియమావళిలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

దాచిన బంగారం రేషన్‌పాలు !

సిరిసిల్లక్రైం: దాచిన బంగారం రేషన్‌బియ్యంలో కలిసిపోయింది. పనికి వెళ్లేటప్పుడు దొంగలు దోచుకెళ్తున్నారని భయపడి ఓ వివాహిత బియ్యం సంచిలో బంగారు గొలుసును దాయగా.. ఆ బియ్యాన్ని కాస్త భర్త అమ్మివేయడంతో ఆమె లబోదిబోమంటోంది. సిరిసిల్ల మున్సిపాలిటీ విలీన గ్రామం చంద్రంపేటకు చెందిన బాలవ్వ పొలం పనులకు వెళ్తున్నానని తన మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును ఇంటిలోని ఓ రేషన్‌బియ్యం సంచిలో దాచింది. ఈ విషయం తెలియని ఆమె భర్త ఆ రేషన్‌ బియ్యాన్ని ముష్టిపల్లిలోని ఓ రైస్‌మిల్లులో విక్రయించాడు. సాయంత్రం పొలం నుంచి ఇంటికొచ్చిన బాలవ్వకు బియ్యం బస్తా కనిపించకపోవడంతో భర్తను అడిగింది. బియ్యాన్ని రైస్‌మిల్లులో అమ్మినట్లు తెలపడంతో అసలు విషయాన్ని భర్తకు తెలిపి.. హుటాహుటిన రైస్‌మిల్లుకు వెళ్లి.. వారిని అడిగారు. బియ్యాన్ని లెవీలో కలిపేశామని, సంచుల్లో నింపేటప్పుడు దొరికితే ఇస్తామని వారు చెప్పారు. చేసేదేమి లేక ఇంటిముఖం పట్టారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు చంద్రంపేటలో చర్చగా మారింది.

చిరుతదాడిలో ఆవులు మృతి


ఆవుల కళేబరాలను ఖననం చేస్తున్న అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని మద్దిమల్ల లొద్దితండా గ్రామపంచాయతీ పరిధిలో చిరతదాడిలో భూక్య మురళికి చెందిన రెండు ఆవులు చనిపోయాయి. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిచూడగా చిరుత దాడి చేసినట్లు గుర్తించాడు. ఫారెస్ట్‌ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సర్టిఫికెట్లు దగ్ధం


కాలిపోయిన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు

చందుర్తి(వేములవాడ): దీపావళి పండుగపూట దేవుళ్లకు దీపారాధన చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. మండలంలోని జోగాపూర్‌ అనుబంధ గ్రామం గుడిపేటలో జరిగిన ఈ ప్రమాదంలో చింతం వెంకటేశం కుమారుడు మధుబాబుకు సంబంధించిన పదో తరగతి సర్టిఫికెట్లు కాలిపోయాయి. అంతేకాకుండా రూ.5వేల నగదు, ఆధార్‌కార్డు, పట్టేదారు పాసు పుస్తకం, వ్యవసాయ సంబంధిత డాక్యుమెంట్స్‌ దగ్ధమయ్యాయి. విద్యార్థి సర్టిఫికెట్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జోగాపూర్‌ ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల గణేశ్‌ కోరారు.

భద్రత మాది.. బాధ్యత మీది


కరీంనగర్‌లో కేంద్ర బలగాల కవాతు


హుజూరాబాద్‌లో..

- జిల్లాలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కేంద్ర బలగాలతో కలిసి కవాతు
- ఎన్నికల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు
- మొత్తం పోలింగ్‌ కేంద్రాలు 1,338

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను పోలీసులు తీసుకుంటున్నారు. సీపీ అభిషేక్‌ మహంతి ఆధ్వర్యంలో కరీంనగర్‌, హుజూరాబాద్‌, చొప్పదండి, మానకొండూర్‌ నియోజకవర్గాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాల కవాతు చేపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రజలకు చెబుతున్నారు. భద్రత కల్పించాల్సిన బాధ్యత మాది.. ఓటు వేయాల్సిన బాధ్యత మీది అంటూ ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్నారు.

సున్నితమైన పోలింగ్‌ సెంటర్లు 289

జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో గల పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో కలిసి కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహిస్తున్నారు. స్థానికంగా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచిస్తున్నారు. ప్రధానంగా గత ఎన్నికల్లో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను దృష్టిలో పెట్టుకొని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 1,338 పోలింగ్‌ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 289 సున్నితమైన కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఈ మేరకు పర్యవేక్షణ బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చిననాటి నుంచి జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన 5 చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. నామినేషన్‌ ప్రక్రియ ముగిసిన తర్వాత కేంద్ర బలగాల పహారా మరింత పెరిగింది.

దిక్కులేని వారిని చేసి వెళ్లిపోయావా..

- ఉపాధివేటలో పోయిన ఊపిరి
- యువకుడి మృతితో రోడ్డున పడ్డ కుటుంబం
- బండపల్లిలో విషాదం
- విరాళాలు అందిస్తున్న యువకులు


బాబు (ఫైల్‌)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చందుర్తి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఎడారి దేశానికి వెళ్లిన యువకుడి శవమై ఇంటికి తిరిగొచ్చాడు. యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు. మండలంలోని బండపల్లికి చెందిన రేగుల బాబు(39) గత డిసెంబర్‌లో జీవనోపాధి కోసం కువైట్‌ వెళ్లాడు. ఇరువై రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. అక్కడ వైద్యం చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. రెండు, మూడు రోజుల్లో ఇంటికొస్తానని భార్యకు వారం క్రితం ఫోన్‌ చేసి చెప్పాడు. పరిస్థితి విషమించి బాబు శుక్రవారం మృతి చెందాడు. ఈ అతని స్నేహితులు ఫోన్‌ ద్వారా బాబు భార్య కల్యాణికి ఫోన్‌లో తెలపడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది. బాబు శవపేటిక సోమవారం బండపల్లికి చేరింది. తండ్రి శవాన్ని చూసి కూతురు, కుమారుడు, భార్య రోదించిన తీరు అందరిని కన్నీరు పెట్టించింది.

చిన్ననాటి నుంచి కష్టాలే..

బాబు చిన్నతనంలోనే తండ్రి లచ్చయ్య మృతి చెందడంతో తల్లి లచ్చవ్వ గ్రామంలో చిన్న హోటల్‌ నడిపిస్తూ కుమారుడిని పోషించింది. బాబు పదోతరగతి చదువుతుండగా తల్లి అనారోగ్యంతో చనిపోయింది. ఒంటరిగా జీవిస్తున్న బాబు బంధువులు పెళ్లి చేశారు. స్వగ్రామంలో చిన్నాచితక పనులు చేసుకునేవాడు. ఇటీవల అప్పు చేసి కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జ్వరంబారిన పడి గత శుక్రవారం మృతిచెందాడు.

ముందుకొచ్చిన యువకులు

బాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ యువకులు ముందుకొచ్చారు. మృతుడికి పదమూడేళ్ల కూతురు రష్మిత ఉంది. ఆమె చదువుల కోసం యువకులు రూ.50వేలు జమచేశారు. మరింత మొత్తం జమచేసి అందజేసేందుకు యువకులు ప్రయత్నిస్తున్నారు.

శ్రీరాములపల్లెలో డీపీవో విచారణ


విచారణ చేపడుతున్న డీపీవో దేవరాజ్‌

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని శ్రీరాములపల్లెలో డీపీవో దేవరాజ్‌ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కుడుకుల లావణ్య తన సొంత పట్టా భూమిలో ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శికి ఆర్నెళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంది. కార్యదర్శి అనుమతి ఇవ్వకపోవడంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్‌ ఆదేశాల మేరకు డీపీవో పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. బాధితురాలు తన డాక్యుమెంట్లు, ఇంటినిర్మాణ మ్యాప్‌, ఇతర పత్రాలను ఆయనకు చూపించారు. వాటితో ఆర్నెళ్ల క్రితం సమర్పించానని, అయినా అనుమతి ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నాడని వాపోయింది. తన భర్త ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉండగా, మహిళనని చూడకుండా నిత్యం జీపీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడని గోడు వెళ్లబోసుకుంది. ఆమె వాగ్మూలాన్ని రికార్డు చేసుకున్న డీపీవో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని డీపీవో దేవరాజ్‌ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సురేష్‌రెడ్డి ఉన్నారు.

నగదు పట్టివేత



మల్లాపూర్‌(కోరుట్ల): సిరిపూర్‌ శివారులోని పెట్రోల్‌ బంక్‌ వద్ద సోమవారం చేపట్టిన పోలీసుల వాహనాల తనిఖీల్లో బైక్‌పై తరలిస్తున్న రూ.1.14 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్‌ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ.1.14 లక్షలను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు వివరించారు. పోలీస్‌ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం..

మెట్‌పల్లిరూరల్‌(కోరుట్ల): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆదివారం కోరుట్ల వైపు నుంచి లారీలో తరలిస్తున్న 260 క్వింటాళ్ల బియ్యం మారుతినగర్‌ వద్ద పట్టుబడిందన్నారు. వీటి విలువ సుమారు రూ.5.20 లక్షలుంటుందని అన్నారు. లారీ యజమాని కోరుట్లకు చెందిన అహ్మద్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రంగంపల్లిలో మద్యం..



పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో బైక్‌పై వెళ్తున్న వేముల పెంటయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా.. హర్యానా రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు లభ్యమయ్యాయని ఎక్సైజ్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. రంగంపల్లికి చెందిన పెంటయ్య ఢిల్లీ నుంచి కార్లు కొనుగోలు చేసి తెచ్చి ఈ ప్రాంతంలో అమ్ముతుంటాడని, తిరుగు పయనంలో హర్యానా మద్యం సీసాలను వెంట తెచ్చి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది శరత్‌బాబు, శ్రీనాథ్‌, కృష్ణ, మోజెస్‌, కార్తీక్‌రెడ్డి ఉన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తిస్తే సెల్‌ నెంబరు 87126 58817కు సమాచారమందించాలన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మెట్‌పల్లి(కోరుట్ల): రెడ్డి కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వారి నుంచి రూ.6.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మపురి: గిరిజన బోదరగూడెంకు చెందిన అద్దరి చిన్నన్న(80) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు సంతానం కలగకపోవడంతో మరొకరిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్నన్న గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. చిన్నన్నకు అదే గ్రామానికి చెందిన కొందరితో గొడవలున్నాయి. గొడవల్లో చిన్నన్నకు అవమానం జరగగా.. అది భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి


వీర రాఘవమ్మ (ఫైల్‌)

రామగిరి(మంథని): కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. భార్య మృతిచెందింది. కల్వచర్ల పంచాయతీ ప్రశాంత్‌నగర్‌లో ఉప్పులూరి వీర్రాజు, వీర రాఘవమ్మ(55) దంపతులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీర్రాజు కొద్దికాలంగా మద్యానికి బానిస కావడంతో.. గొడవలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం వీర్రాజు మద్యం తాగి వీర రాఘవమ్మతో గొడవ పడడంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. అనంతరం వీర్రాజు తాగాడు. గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో భార్య వీర రాఘవమ్మ మృతిచెందింది. మెరుగైన చికిత్స కోసం వీర్రాజును కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఇద్దరి కూతుళ్లకు వివాహమైంది. మృతురాలి కూతురు మద్దుకూరి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కటిక రవిప్రసాద్‌ తెలిపారు.

మద్యం దుకాణాలపై కేసు


స్టాక్‌ రిజిస్టర్‌ పరిశీలిస్తున్న సీఐ రమేశ్‌

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల కమిషన్‌కు సకాలంలో సేల్స్‌ వివరాలందించని రెండు మద్యం దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు రామగుండం ఎక్సైజ్‌ సీఐ సుంకరి రమేశ్‌ తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు ప్రతిరోజు రాత్రి 11 గంటల్లోపు ఆయా బ్రాందీషాపుల సేల్స్‌ వివరాలు పెట్టాలని అన్ని షాపులకు చెప్పినా.. యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్టాక్‌ రిజిస్టర్లు అందుబాటులో లేని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తెలంగాణ వైన్స్‌, గోదావరిఖని మార్కెట్‌ వద్ద గల దుర్గావైన్స్‌పై నాన్‌ మెయింటెనెన్స్‌ ఆఫ్‌ అకౌంట్‌ రిజిస్టర్‌ కేసు నమోదు చేసి రూ.15 వేల చొప్పున జరిమానా విధించామన్నారు.

బొగ్గు తరలిస్తున్న లారీ పట్టివేత

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి శివారులో బొగ్గును అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సింగరేణి కాంట్రాక్టర్‌ నరసింగరావు, డ్రైవర్‌ కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్‌ తెలిపారు. గోదావరిఖని 11బొగ్గు గని నుంచి రాఘవాపూర్‌ రైల్వే స్టేషన్‌కు బొగ్గును తరలించాల్సిన కాంట్రాక్టర్‌ నర్సింగరావు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. రంగంపల్లి వద్ద సింగరేణి సెక్యూరిటీ జూనియర్‌ ఇన్స్‌పెక్టర్‌ ఉమేశ్‌, ఇతర సిబ్బంది పట్టుకున్నారని పేర్కొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- ఆర్‌ఎంపీ ఇంటి ఎదుట మృతుడి కుటుంబసభ్యుల నిరసన
- పరారీలో వైద్యుడు


రాజిరెడ్డి (ఫైల్‌)

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని లింగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి, మృతిచెందాడని బాధిత కుటుంబసభ్యులు అన్నారు. ఈ మేరకు సదరు వైద్యుడి ఇంటి ఎదుట నిరసన తెలిపారు. మృతుడి సోదరుడు, పోలీసుల వివరాల ప్రకారం.. అంతం రాజిరెడ్డి(51) వారం రోజుల క్రితం పొలం పనులకు వెళ్లి, అనారోగ్యానికి గురయ్యాడు. గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లగా ఇంజక్షన్‌ వేసి, సెలైన్‌ పెట్టాడు. తర్వాత అతని శరీర రంగు మారింది. కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించడం వల్లే రాజిరెడ్డి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మృతదేహంతో సదరు వైద్యుడి ఇంటి ఎదుట బైఠాయించారు. కానీ, అంతకుముందే సదరు అతను పరారయ్యాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిమ్మపల్లికి చెందిన కూలీ..

- సిరిసిల్లలో ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన
- శవం తరలింపుతో తోపులాట.. ఉద్రిక్తత
- రోడ్డెక్కిన మృతుడి బంధువులు
- పరిహారం అందించిన ఆస్పత్రి వర్గాలు
- కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు


నిరసన తెలుపుతున్న కుటుంబసభ్యులు


భీమయ్య (ఫైల్‌)

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున వైద్యం వికటించి ఓ నిరుపేద కూలీ బలయ్యాడు. బాధితులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన చిలుక భీమయ్య(55) ఉపాధి కోసం గల్ఫ్‌ దేశానికి వెళ్లాడు. వారం క్రితం ఇంటికి చేరిన భీమయ్యకు కడుపునొప్పి వచ్చింది. సిరిసిల్లలోని పాత బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. కడుపులో పేగుకు పుండు అయిందని, సర్జరీ చేయాలని రూ.40వేలకు ప్యాకేజీ మాట్లాడి ఆపరేషన్‌ చేశారు. ఆపరేషన్‌ జరిగిన రెండో రోజు భీమయ్య చికిత్స పొందుతూ ఐసీయూలోనే మరణించాడు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి వర్గాలు పరిహారం ఇవ్వాలని నిమ్మపల్లి వాసులు పట్టుబట్టారు. భీమయ్యకు నిద్రలోనే గుండెపోటు రావడంతో మరణించాడని, ఆపరేషన్‌ విజయవంతమైందని, కోలుకుంటున్న దశలో గుండెపోటు వచ్చింద.. వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని వైద్యుడు తెలిపారు. ముందుగానే రిస్క్‌ ఉంటుందనే విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు చెప్పామని, ఈమేరకు తమ వద్ద వీడియోగ్రఫీ ఉందని స్పష్టం చేశారు. భీమయ్యకు భార్య అమృత, కొడుకులు నరేందర్‌, గణేశ్‌, కూతురు గౌతమి ఉంది. నిరుపేద కుటుంబం కావడంతో పరిహారం ఇవ్వాలని బాధితులు పట్టుబట్టారు.

మృతదేహం తరలింపులో ఉద్రిక్తత..

ప్రైవేటు ఆస్పత్రి వర్గాలతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చర్చలు జరుపుతుండగానే.. భీమయ్య మృతదేహాన్ని మార్చురీకి అంబులెన్స్‌లో తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. మృతుడి కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు అడ్డుకున్నారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, టౌన్‌ సీఐ ఉపేందర్‌, సిరిసిల్ల రూరల్‌ సీఐ సదన్‌కుమార్‌, పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది, బీఎస్‌ఎఫ్‌ బలగాలను మోహరించారు. మృతుడి కుటుంబ సభ్యుల నిరసనలతో ట్రాఫిక్‌జామ్‌ ఏర్పడింది. చివరికి ఆస్పత్రి యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని నిమ్మపల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్‌..


శ్రీనివాస్‌ (ఫైల్‌)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్‌ అనుమల్ల శ్రీనివాస్‌(కోర్టు శ్రీను) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనారోగ్యంతో వేంపల్లి ఉప సర్పంచ్‌..


రాజనర్సయ్య (ఫైల్‌)

మల్లాపూర్‌: వేంపల్లి ఉప సర్పంచ్‌ వెల్మల రాజనర్సయ్య(55) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. రాజనర్సయ్య ఇటీవల అస్వస్థతకు గురవగా.. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాజనర్సయ్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రాజనర్సయ్యకు భార్య గంగరాజు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి డాక్టర్‌ సంజయ్‌కుమార్‌ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకుడు బిట్ల నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


సువర్ణ మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్‌): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోడెం శ్రీనివాస్‌కు గోదావరిఖనికి చెందిన సువర్ణ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళి నోము ఉందని శనివారం రాత్రి దంపతులు హైదరాబాద్‌ నుంచి బైక్‌పై సైదాబాద్‌ వస్తున్నారు. జమ్మికుంట పట్టణ శివారులోని స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద వాహనం అదుపుతప్పడంతో సువర్ణ కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్‌ అజాగ్రత్తగా బైక్‌ నడపడం వల్లే సువర్ణ మృతి చెందిందని ఆమె సోదరుడు పోరండ్ల భీంరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..


ముస్తాక్‌ (ఫైల్‌)

కోరుట్లరూరల్‌: చిన్నమెట్‌పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మహమ్మద్‌ ముస్తాక్‌(30) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం తను కౌలుకు చేసే పొలంలో కింద పడి ఉన్న విద్యుత్‌ తీగను చుడుతుండగా.. ప్రమాదవశాత్తు షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మోహన్‌ (ఫైల్‌)

మానకొండూర్‌: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, సీఐ రాజ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాముల మోహన్‌(33) తన నాయీబ్రాహ్మణ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా విపరీతమైన వెన్ను నొప్పి వస్తుండటంతో ఆస్పత్రిలో చూపించుకొని, మందులు వాడుతున్నాడు. అయినా నొప్పి తగ్గడం లేదు. ఈ క్రమంలో దీపావళి పండుగ సందర్భంగా అతని భార్య రజని ఖాజీపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. మోహన్‌ సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

నర్సింగాపూర్‌లో షార్ట్‌సర్క్యూట్‌

- రూ.6 లక్షల సామగ్రి దగ్ధం


షార్ట్‌ సర్క్యూట్‌ జరిగిన ఇల్లు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన ఎలగందుల శ్రీనివాస్‌ ఇంట్లో ఆదివారం రాత్రి విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ జరగడంతో భారీగా ఆస్తినష్టం సంభవించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. శ్రీనివాస్‌ కిరాణ దుకాణాలకు తినుబండారాల సామగ్రి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌ కావడంతో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. మంటల్లో తినుబండారాల సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు శ్రీనివాస్‌ తెలిపాడు. కాలిపోయిన సామగ్రి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నాడు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతుంది
- హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి గంగుల కమలాకర్


చింతకుంటలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని డిప్యూటీ సీఎం, హోంమంత్రి మహమూద్ అలీ, కరీంనగర్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం హుస్సేన్‌పుర నేషనల్ ప్యాలెస్‌లో జరిగిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సమైక్య పాలనలో ఎక్కడ చూసినా గొడవలు, శాంతి భద్రతల సమస్యలు, 144 సెక్షన్, లాఠీచార్జీలు ఉండేవన్నారు. రాజకీయ అవసరాల కోసం హిందూ, ముస్లింల మధ్య గొడవలు పెట్టి లబ్ధిపొందే వారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక హిందూ, ముస్లింలు ఒకట్టి కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే పెద్దపెద్ద కంపెనీలో తరలివస్తాయని, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. మేయర్ వై.సునీల్‌రావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ఆదివారం మంత్రి నివాసంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పర్యవేక్షణలో నిర్వహించిన కరీంనగర్ పట్టణ రెగ్జిన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్, పారా మెడికల్ అసోసియేషన్ బాధ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్లలో కరీంనగర్‌లో శాంతిభద్రతల సమస్య తలెత్తలేదని అన్నారు. మత కల్లోలాలు లేని కరీంనగర్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసే బాధ్యత నాదన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమ్జద్ అలీ, పారామెడికల్ యూనియన్ అధ్యక్షుడు వసీం, రెక్సిన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యుడు జహంగీర్‌లతో పాటు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి గంగుల గెలవాలని ప్రత్యేక పూజలు

3వ డివిజన్ కిసాన్‌నగర్‌లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం గంగుల కమలాకర్ మరోసారి భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు సంపతి అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్‌ఎస్‌లో భారీ చేరికలు

నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన తమిళకాలనీ వాసులు 500 మంది, ఎస్సారార్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ చక్రధర్‌రావు, పృథ్వీరావులతో పాటు మరో 100 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరితో పాటు కొత్తపల్లి మండలం చింతకుంట, మల్కాపూర్, రేకుర్తికి చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవు

కొత్తపల్లి: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని, కర్ణాటక పరిస్థితులే ఇక్కడ పునరావృతం అవుతాయని గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కొత్తపల్లి మండలం చింతకుంటలో పర్యటించిన ఆయనకు డప్పుచప్పుళ్లు, మంగళహారతులు, గజమాల, గొర్రె, గొంగళితో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించిన గంగుల ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేమని, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీని బలపర్చాలన్నారు. 1956లో మన తాతల తప్పుతో పచ్చని తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో కలిపారని, పచ్చని తెలంగాణను చూస్తే ఆంధ్రోళ్లకు కళ్లమంట మొదలైందని, ఆంధ్రోళ్లంతా కూడగట్టుకొని తెలంగాణాను మళ్లీ దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే వారంతా పారిపోతారని అన్నారు. జెడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, జెడ్పీ కోఆప్షన్ షాబీర్ పాషా, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, సర్పంచ్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఇంటింటా ప్రచారం

విద్యానగర్(కరీంనగర్)/కొత్తపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం నగరంలోని 29వ డివిజన్ మంగళివాడ, శివాలయం, కాపువాడ, పాత బైపాస్ ప్రాంతాలతో పాటు కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమాల్లో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు గున్నాల విజయ, మానుపాటి వేణుగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయా బూత్‌ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు ఓటేయండి

- బీఆర్‌ఎస్, ఎంఐఎం నుంచి కరీంనగర్‌ను రక్షించేందుకే పోటీ చేస్తున్నా
- బీజేపీ కరీంనగర్ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ కుమార్


రాంనగర్ చౌరస్తాలో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: 'మీ సమస్యలపై ప్రశ్నించే గొంతుకను నేను.. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న నన్ను భయపెట్టడానికి కేసీఆర్ నాపై ఏకంగా 74 కేసులు పెట్టిండ్రు.. బండి సంజయ్ భయపడతడా? చావునోట్లో తలపెట్టి వచ్చినోడిని.. ప్రశ్నించే బండి సంజయ్ గొంతుకను కాపాడుకుంటారా? అంతిమ నిర్ణయం మీదే'' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ ప్రజలను కోరారు. సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, హోటల్ ఓనర్స్, వర్కర్స్ ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వందలాది మంది యువకులు కాషాయ జెండా పట్టుకుని బండి సంజయ్‌కు మద్దతుగా బైక్‌లపై వచ్చారు. ఈసందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కరీంనగర్ యువత కాషాయ జెండా చేతపట్టుకుని భారతమాతాకీ జై అంటూ స్వచ్ఛందంగా తరలివస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీగా నేనేం చేశానో అన్ని వివరాలు పుస్తకాలు, కరపత్రం రూపంలో ఇంటింటికీ వస్తాయన్నారు. ఇకపై మీరంతా ఎంపీగా నేను చేసిన అభివృద్ధి పనులను ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. నేను అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నాపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, నిజానికి కరీంనగర్ ప్రజలకు వారిద్దరూ చేసిందేమీ లేదని తెలిపారు. భూకబ్జాలు చేయడం, అవినీతికి పాల్పడటం, వ్యాపారులను బెదిరిస్తూ వసూళ్లు చేయడం తప్ప ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్‌ను ఎంఐఎంకు అప్పగించే కుట్ర చేస్తుందన్నారు. మోదీ పాలనలో రోజ్ గార్ మేళా పథకం కింద 6 నెలల్లో 6 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశారని తెలిపారు. నియామకాలు, పరీక్షల్లో ఎలాంటి అవినీతి చోటు చేసుకోలేదన్నారు. మరి కేసీఆర్ పాలనలో చేసిందేమిటి? లీకేజీలు, ప్యాకేజీలు తప్ప.. అని ఎద్దేవా చేశారు. మీకోసం కొట్లాడుతున్న బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా జాబ్ క్యాలెండర్‌ను రిలీజ్ చేస్తామని హామీ ఇచ్చారు.

నిధులపై బహిరంగ చర్చకు రండి

తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకొస్తే.. కనీసం నన్ను పిలవకుండా కొబ్బరికాయకొట్టి తామే నిధులు తెచ్చినట్లుగా బీఆర్‌ఎస్ నాయకులు ఫోజులు కొడుతున్నారని, ఆర్వోబీకి నిధులు తెచ్చిందెవరో బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ మంత్రి గంగులకు ఎంపీ బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, రాంనగర్, పద్మనగర్‌లలో బండి సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ బండి సంజయ్ ఏం చేసిండని అడిగే వారికి నా సమాధానం ఒక్కటే.. నన్ను ఎంపీగా గెలిపించాక ప్రధానితో మాట్లాడి తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ నిర్మించడానికి నిధులు తీసుకొచ్చిన. రాష్ట్రవాటా ఇవ్వకున్నా ప్రజలు బాధ చూడలేక కేంద్రంతో మాట్లాడి ఆర్వోబీకి అయ్యే ఖర్చునంతా (రూ.153 కోట్లు) మంజూరు చేయించాను. కానీ నేను ఢిల్లీలో ఉన్నప్పుడు.. గంగుల ఇక్కడికి వచ్చి కొబ్బరికాయకొట్టి ఆర్వోబీ నిధులు తామే తీసుకొచ్చినట్లు ఫోజులు కొట్టి వార్తలు రాయించుకున్నాడని విమర్శించారు. ఇక్కడున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులిద్దరూ భూకబ్జాదారులేనని, ఎన్నికలొస్తుంటే బీజేపీపై తప్పుడు ప్రచారం చేయడం అలవాటైందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గంగుల ఓటమి ఖాయమైందని తేలిపోవడంతో యువకులకు వేలాది సెల్‌ఫోన్లు పంచి ఓట్లేయించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. నా ఇంటిపై గతంలో ఎంఐఎం గుండాలతో దాడులు చేయించి భయపెట్టేందుకు యత్నించాడని అన్నారు. అందుకే మీ అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్న. తప్పుడు ప్రచారం నమ్మకండి. మీ అందరూ ఒక్కటై ఓటు బ్యాంకుగా మారి పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తూ బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న మహిళలు

బద్దిపల్లిలో బీజేపీ ఇంటింటా ప్రచారం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. కొత్తపల్లి మండలం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి తిరుపతి, బూత్ అధ్యక్షులు సంజీవ్, శ్రీకాంత్, నాయకులు నాగుల వెంకటేశ్‌గౌడ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.


దీపావళి సంబరాల్లో నగరవాసులు


సమాధుల వద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రజలు


బాణాసంచా కాల్చుతున్న మేయర్ సునీల్‌రావు

వెలుగుల కేళి.. దీపావళి

కరీంనగర్ కల్చరల్: వెలుగు దివ్వెల దీపావళి వేడుకలను ఆదివారం కరీంనగర్‌తో పాటు కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజలు నిర్వహించారు. ఇళ్లు, వాణిజ్య, వ్యాపార సముదాయాల వద్ద వివిధ ఆకృతుల దీపాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చారు. మహాశక్తి ఆలయంలో నిర్వహించిన హోమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లో సమాధుల వద్ద..

కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలో గల సమాధుల వద్ద దీపావళి వేడుకలు జరుపుకున్నారు. దీపావళి అనగానే లక్ష్మీపూజలు చేసుకుంటారు. కానీ ఇక్కడ ప్రజలు స్వర్గీయులైన తమ పెద్దలను స్మరించుకుని, శ్మశానవాటిక వద్దకెళ్లి సమాధిని పువ్వులతో అలంకరించి, దీపాలు వెలిగించి, తమ నుంచి దూరమైన వారికి నచ్చిన పిండి వంటలు, తీపి పదార్థాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి, దీపాలు వెలిగించి టపాసులు కాల్చారు. చనిపోయిన వారు తమ గడిపిన క్షణాలను గుర్తు చేసుకొని వారి పేరు మీద దానాలు చేశారు. సమాధుల వద్ద జరిగిన దీపావళి వేడుకల్లో మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌లు హాజరై ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ నగరంలో ఆరు దశాబ్దాలకు పైగా శ్మశానంలోనే దీపావళి పండుగ జరుపుకునే సాంప్రదాయం కొనసాగుతోందని అన్నారు. ఏటా దీపావళి రోజున నిర్వహించే సమాధుల పండుగ నిర్వహణకు పూర్తిస్థాయిలో లైటింగ్, మంచినీటి సదుపాయం కల్పించామని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు మెండి శ్రీలత చంద్రశేఖర్, గంట కల్యాణి శ్రీనివాస్, సరిల్ల ప్రసాద్, కంసాల శ్రీనివాస్, ఎదుళ్ల రాజశేఖర్, తిరుపతి, నక్క పద్మ, కృష్ణ, ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.


సమాధుల వద్ద పూజలు చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్


మహాశక్తి ఆలయంలో హోమంలో పాల్గొన్న బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

స్వశక్తి సంఘం.. చైతన్య పథం

- వీవో సమావేశాల్లో ఓటింగ్‌పై అవగాహన
- సభ్యులందరూ ఓటేసేలా చర్యలు


ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఐకేపీ ఏపీఎం భార్గవ్

కరీంనగర్‌రూరల్: అసలే ఇది ఎన్నికల సమయం. ఓటును ఆయుధంగా చేసుకుని భవితను నిర్దేశించుకునే తరుణమిది. ఓటరు నమోదు, సద్వినియోగం చేసుకోవడంపై ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఐదేళ్ల తిప్పలు పడాల్సి వస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములను మహిళలు ప్రభావితం చేసే అవకాశముండటంతో రాజకీయనాయకులందరూ మహిళా సంఘాలను ఆశ్రయిస్తున్నారు. గంపగుత్తగా ఓట్లను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈక్రమంలో ఓటరు చైతన్యానికి అధికార యంత్రాంగం పలు కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఓటింగే ప్రధాన ఎజెండా

ప్రతినెలా స్వశక్తి సంఘాల సభ్యులు సమావేశం నిర్వహిస్తుంటారు. గ్రామంలోని అన్ని సంఘాల ప్రతినిధులు కలిపి గ్రామైక్య సంఘం సమావేశాలు ఏర్పాటు చేస్తారు. కరీంనగర్ మండలంలోని 897 స్వశక్తి మహిళా సంఘాల్లో మొత్తం 10,390 మంది సభ్యులున్నారు. ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు వీవో సంఘాల చొప్పున మొత్తం 32 గ్రామైక్య సంఘాలున్నాయి. ప్రతీ నెలలో రెండు పర్యాయాలు సమావేశాలు ఏర్పాటు చేసి సంఘాల పొదుపు,అప్పు, రుణ వాయిదాల చెల్లింపు, మహిళల సమస్యలపై చర్చిస్తారు. అయితే ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో మహిళల్లో ఓటింగ్‌పై చైతన్యం కలిగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అర్హులైన మహిళలు ఓటర్లుగా నమోదు, ఓటు హక్కు కలిగిన వాళ్లందరూ ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యం తీసుకొచ్చే అంశాలను గ్రామైక్య సంఘం సమావేశాల్లో ప్రధాన ఎజెండాగా చేర్చారు.

సమర్థులనే ఎన్నుకోవాలని ప్రచారం

ఓటు హక్కును వినియోగించుకోవడం, ప్రలోభాలకు లొంగకుండా సమర్థులనే ఎన్నుకోవడంతో కలిగే ప్రయోజనాలపై సభ్యులకు వీవో అధ్యక్షులతోపాటు డీఆర్‌డీవో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. డబ్బు, మద్యం, కానుకలకు ఆశపడితే ఐదేళ్ల భవిష్యత్‌ను తాకట్టు పెట్టినట్లేనని ప్రచారం చేస్తున్నారు. ఓటుహక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని సభ్యులకు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

స్వశక్తి సంఘాల్లోని మహిళాసభ్యులందరినీ ఓటింగ్‌పై చైతన్యపరుస్తున్నాం. ఈనెలలో రెండు పర్యాయాలు జరిగే వీవో సంఘం సమావేశాల్లో వీవో అధ్యక్షులకు ముందుగా అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లోని వీవో సమావేశాల్లో ప్రత్యేకంగా ఓటింగ్‌పై చర్చించి చైతన్యం చేస్తున్నాం. మహిళలందరూ తప్పనిసరిగా ఓటు వేసేలా చర్యలు చేపట్టాం.

– భార్గవ్, ఐకేపీ ఏపీఎం, కరీంనగర్‌రూరల్

తెలంగాణలో మార్పు తథ్యం

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, రాష్ట్రంలో మార్పు తథ్యమని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన డీసీసీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ హామీలు ఇస్తుంటాడు తప్ప అమలు చేయడని, నీళ్లు నిధులు నియామకాలు కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే వచ్చాయని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, మెన్నేని రోహిత్‌రావు, వైద్యుల అంజన్‌కుమార్, సమద్‌నవాబ్, ఎండీ. తాజ్, పడాల రాహుల్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అసలైన ప్రకాశం పరమేశ్వరుడే

విద్యానగర్(కరీంనగర్): దారిద్ర్యం, దైన్యం, అజ్ఞానానికి సంకేతం చీకటి అని, ఆ చీకట్లను పారద్రోలే అసలైన ప్రకాశవంతుడు పరమేశ్వరుడే అని వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో గల కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లో పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో కేదారేశ్వర వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఐశ్వర్యం, ఆనందం, జ్ఞానం జ్యోతి స్వరూపాలన్నారు. ప్రాణుల హృదయాల్లో చైతన్య ప్రధాతగా ఉన్న ఆ పరంజ్యోతికి ప్రతీకలే దీపాకాంతులని తెలిపారు. ఈ పూజల్లో అపార్టుమెంట్ వాసులు తొడుపునూరి సంతోష్‌కుమార్, నీరజ, కొంజర్ల మాదవి, వంగళ మమత, బల్మూరి పద్మ, కృష్ణవేణి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.


కేదారేశ్వర వ్రతం నిర్వహిస్తున్న పురాణం మహేశ్వరశర్మ

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా అంజయ్య


అంజయ్య

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కరీంనగర్‌రూరల్ మండల కన్వీనర్‌గా బహదూర్‌ఖాన్‌పేటకు చెందిన తప్పెట్ల అంజయ్యను నియమించినట్లు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొర్వి అరుణ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించిన అంజయ్య సేవలను గుర్తించి కన్వీనర్‌గా నియమించామన్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ సెల్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పాతబజార్ శివాలయంలో..

కరీంనగర్‌కల్చరల్: కార్తీక మాసం సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు జరిపారు. తులసీ చెట్టు వద్ద దీపాలు వెలగించారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.


రామేశ్వరాలయంలో..

చిత్ర కథ: క్రీడాప్రాంగణంలో కొనుగోలు కేంద్రం



ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన స్థలాలు గ్రామాల్లో అందుబాటులో లేకపోవడంతో అధికారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత కొన్నేళ్ల నుంచి ఇదే స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో దాదాపు నెలరోజుల పాటు ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండటంతో విద్యార్థులతోపాటు యువకులకు ఆటలాడే అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాన్ని మరో చోట ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, యువకులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

వృద్ధాశ్రమానికి బీరువా వితరణ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మంకమ్మతోటలోని శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమానికి దీపావళి సందర్భంగా ఆదివారం విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డు గ్రహీత లయన్ ఎల్లాల లక్ష్మారెడ్డి బీరువాను విరాళంగా అందజేశారు. వృద్ధాశ్రమంలోని వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డీ ఏ.కిరణ్‌కుమార్, వృద్ధాశ్రమ ఇన్‌చార్జి సుమలత తదితరులు పాల్గొన్నారు.


బీరువా అందజేస్తున్న లక్ష్మారెడ్డి

అమెరికాలో చదువే టాప్ చాయిస్

అమెరికాలో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థుల క్యూ...

- 2022–23 విద్యా సంవత్సరంలో యూఎస్ వెళ్లిన 2,68,923 విద్యార్థులు
- గత విద్యా సంవత్సరంతో పోలిస్తే 35% పెరుగుదల
- అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో 25 శాతం భారతీయులే
- వెల్లడించిన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: కొలువులు, చదువుల కోసం మనోళ్లు విదేశాలకు క్యూ కడుతూనే ఉంటారు. అయితే, విదేశాల్లో విద్యాభ్యాసానికి భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్‌గా మాత్రం అమెరికానే ఉంటోంది. యూఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రితం విద్యా సంవత్సరంతో పోలిస్తే.. 2022–23 విద్యా సంవత్సరంలో 35 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. 2022–23లో అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు 2,68,923 మంది విద్యార్థులు వెళ్లినట్టు సోమవారం విడుదలైన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ (ఓడీఆర్) నివేదికలో వెల్లడైంది. ఈ నివేదికలోని వివరాలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయం తమ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న 10 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయ విద్యార్థులే అని ఓడీఆర్ వెల్లడించింది.

63 శాతానికి చేరిన గ్రాడ్యుయేషన్ విద్యార్థులు..

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ డేటా ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్యలో భారత్ చైనాను అధిగమించింది. క్రితం సంవత్సరంతో పోల్చితే 2022–23 విద్యా సంవత్సరంలో భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 63 శాతం పెరిగి 1,65,936 మందికి చేరుకుంది. దాదాపు 64,000 మంది విద్యార్థులు పెరిగారు. అదే సమయంలో భారతీయ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సైతం 16 శాతం పెరిగారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)ను అభ్యసించే వారి సంఖ్య 69,062కు చేరడంతో అమెరికాలో విద్యాభ్యాసం చేసే విదేశీ విద్యార్థుల్లో భారత్ అగ్రగామిగా నిలిచింది. ఓపీటీ అనేది ఒక రకమైన తాత్కాలిక పని అనుమతి. ఇది అర్హత కలిగిన విద్యార్థులు వారి అధ్యయన రంగానికి సంబంధించిన అనుభవాన్ని పొందడానికి అక్కడ విద్యాభ్యాసం చేసేందుకు ఈ విధానంలో అనుమతి లభిస్తుంది.

ఈ ఏడాది జూన్–ఆగస్టులో అత్యధిక వీసాలు జారీ..

అమెరికా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులకు ఎఫ్, ఎం, జే కేటగిరీల్లో వీసాల జారీ సైతం ఈ ఏడాది జూన్–ఆగస్టులో గణనీయంగా పెరిగింది. భారత దేశవ్యాప్తంగా ఉన్న యూఎస్ కాన్సులేట్, ఎంబసీల ద్వారా మొత్తం 95,269 వీసాలు జారీ అయ్యాయి. 2022లో జూన్–ఆగస్టులో జారీ చేసిన వీసాలతో పోలిస్తే ఇది 18 శాతం అధికం.

అమెరికాలో చదువు అంటే విలువైన పెట్టుబడే..



'అమెరికాలోని యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం అన్నది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఓ విలువైన పెట్టుబడి లాంటిదే. ఉజ్వల భవిష్యత్తు దిశగా ఈ విద్యార్థులంతా యూఎస్, భారత్‌ను మరింత దగ్గర చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీపడేందుకు విద్యార్థులను సిద్ధం చేసే భారతీయ విద్యా వ్యవస్థ బలం హర్షణీయం. విద్యాభ్యాసం కోసం యూఎస్ వచ్చే విద్యార్థుల్లో మహిళల సంఖ్య మరింత పెరగాలని మేం ఆశిస్తున్నాం'.

– యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి

ఉచిత సలహా కేంద్రాలు..

అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైల్లో ఒక్కొక్కటి, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు కలిపి మొత్తం ఆరు కేంద్రాలు ఉన్నాయి. అమెరికాలో విద్యాభ్యాసంపై వివరాల కోసం ఎడ్యుకేషన్‌యూఎస్‌ఏ ఇండియా యాప్ సైతం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లలో అందుబాటులో ఉన్నట్టు యూఎస్ ఎంబసీ అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో కళాశాల దరఖాస్తు ప్రక్రియ గురించి తాజా సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. https://educationusa.state.gov/country/in. వెబ్‌సైట్‌లోనూ పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల జోరు ఇలా...

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక	2021-21 విద్యా సంవత్సరం	2022-23 విద్యా సంవత్సరం	పెరుగుదల (%)
యూఎస్‌కు వెళ్లిన మొత్తం భారతీయ విద్యార్థులు	1,99,182	2,68,923	35
అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు	27,545	31,954	16
గ్రాడ్యుయేషన్ విద్యార్థులు	1,02,024	1,65,936	62.6
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)	68,188	69,062	1.3

'ఆల్మట్టి'పై పునరాలోచన చేయాలి

- ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీలు మళ్లిస్తే తెలంగాణకు నష్టం
- జూరాల, శ్రీశైలంకు వచ్చే వరద ప్రవాహానికి గండి పడుతుంది
- కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు ఉల్లంఘన
- నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ డీజీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా.. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నుంచి ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆ రాష్ట్రానికి 16 టీఎంసీలను కేటాయించాలనే ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలతో ఆల్మట్టి జలాశయం నుంచి దిగువన ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలకు గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనలపై పునరాలోచన చేయాలని కోరింది. నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ నెల 10న హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తెలంగాణ వాదనలను పేర్కొంటూ అదే రోజు ఎన్‌డబ్ల్యూడీఏకు లేఖ రాశారు.

ఆ హక్కు కర్ణాటకకు లేదు

ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆల్మట్టి నుంచి కర్ణాటకలోని మల ప్రభ సబ్ బేసిన్‌కు 16 టీఎంసీల కేటాయింపుతో జల నిబంధనల అమలులో పూర్తి సంక్లిష్టమైన పరిస్థితులు ఉత్పన్న మవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్–1 గంపగుత్తగా జరిపిన కేటాయింపుల మేరకు జూరాల, శ్రీశైలం జలాశయాలకు రావాల్సిన జలాలను వినియోగించుకునే హక్కు కర్ణాటకకు లేదని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్ పరిధిలోని సాగునీరు అందని ప్రాంతాలు పెద్ద ఎత్తున ఉండగా, వాటిని విస్మరించి కృష్ణా జలాలను పెన్నా బేసిన్‌కు తరలించడం సబబు కాదని ఆక్షేపించారు. గోదావరి బేసిన్‌లోని 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి సంబంధించి రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని, ఈ ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిన తర్వాతే నదుల అనుసంధానం విషయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించడంతో సాగర్‌లో కృష్ణా జలాల నిల్వలపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో 30లక్షల ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 20.3లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 12.2 లక్షల ఎకరాలకు ఇంకా సాగునీరు అందలేదని వివరించారు. ఈ మూడు జిల్లాల్లో సాగుకు యోగ్యమైన 86శాతం భూములకు సాగునీటి సదుపాయం లేదని పేర్కొన్నారు.

50% జలాలు కేటాయించాలి...

గోదావరి–కావేరి, బెడ్తి–వార్దా నదుల అనుసంధానంతో తరలించనున్న 166 టీఎంసీల్లో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కోరగా, కేవలం 45 టీఎంసీలు(27శాతం) మాత్రమే కేటాయించినట్టు ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. కేటాయింపులను 50శాతానికి పెంచాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పులోని 15(బీ) నిబంధన మేరకు బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ద్వారా తరలించనున్న 18 టీఎంసీల్లో 50శాతం .. అంటే 9టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని తెలిపారు. ఇచ్చంపల్లి వద్ద నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి గోదావరి జలాలను తరలించాలని సూచించారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని 148 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలించనున్నట్టు కేంద్రం పేర్కొంటున్న నేపథ్యంలో.. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి తీసుకోవాలని కోరారు.

ఏపీలో కుల గణనకు నాంది

రేపు 5 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కుల గణన ప్రారంభం

- 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో మొదలు
- రెండు రోజులు ప్రయోగాత్మకంగా కుల గణన
- కుల గణనపై ఈ నెల 22 వరకు శిక్షణ
- బుధవారం నుంచే జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు
- విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు బుధవారం నాంది పలకనుంది. రాష్ట్రంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా కుల గణన చేపట్టనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాల్లో మూడు గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుంది. సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడానికి ఈ నెల 3న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కుల గణన ముందస్తు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి ఎం. గిరిజా శంకర్ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న వివిధ శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు తెలియజేస్తూ యూఓ నోట్ విడుదల చేశారు. ముందస్తుగా ఐదు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో అవసరమైతే మార్పులు చేసి, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టనున్నట్లు సమాచారం.

సిబ్బందికి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా కుల గణనలో ఎన్యూమరేటర్లుగా వ్యవహరించే సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ చేసే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు మూడు విడతల్లో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో మంగళ, లేదా బుధవారం శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచే రౌండ్ టేబుల్ సమావేశాలు

కుల గణనపై ప్రభుత్వం బుధవారం నుంచి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత భాగస్వామ్యులతో ఈ సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఐదు ప్రాంతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు జరపనున్నారు. ఈ నెల 17న రాజమండ్రి, కర్నూలులో, 20న విశాఖ, విజయవాడలో, 24న తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రాంతీయ సదస్సులు జరిగే ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండవని రాష్ట్ర ప్రణాళిక శాఖ స్పష్టం చేసింది.

నేడు అల్పపీడనం!

16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 16వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే ఏపీపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. కాగా.. మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అలాగే బుధవారం తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది.

కల్యాణం.. కలవరం..

- ఇటు ఎన్నికల ప్రచారం.. అటు వరుస పెళ్లిళ్లు..
- కల్యాణ మండపాలే ప్రచార వేదికలు...
- ఈ నెల 16 నుంచి వరుస ముహూర్తాలు



వివాహవేడుక

నిర్మల్‌ఖిల్లా: నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోయి ఇక పూర్తిస్థాయి ప్రచారం ఊపొందుకోవడంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. మరోవైపు ఇదేనెల 16 నుంచి వివాహానికి మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు అధికంగా ఉండనున్నాయి. ఇక గత శ్రావణమాసంలో ముహూర్తాలు అంతంతమాత్రంగానే ఉండడంతో వివాహాలు పెద్దమొత్తంలో జరగలేదు. అయితే గతంలో శ్రావణ మాసానికంటే ముందుగా సంబంధాలను కుదుర్చుకున్న వధువు, వరుడు సంబంధిత కుటుంబాల వారు సమయం ఉండాలన్న ఉద్దేశంతో నవంబర్లో వివాహ ముహూర్తాలను నిశ్చయించుకున్నారు. అయితే ఇదే నెలలో 30 తేదీన ఎన్నికలు పోలింగ్ ఉండడంతో షెడ్యూల్ విడుదలై ప్రచార పర్వం ఉధృతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఈనెల 16 నుండి వరుస పెళ్లిళ్లకు ముహూర్తాలు ఉండడంతో ఆయా కుటుంబాల వారు, అటు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు కలవడానికి గురవుతున్నారు. ప్రచార పర్వంలో ప్రస్తుతం ఉన్నప్పటికీ పోలింగ్ నాటికి తలెత్తే ఇబ్బందులను అంచనా వేస్తున్నారు. ఫంక్షన్ హాళ్లు, వివాహ మండపాలు ఇప్పటికే రాజకీయపార్టీల సభలు, సమావేశాల కోసం వినియోగిస్తున్నారు. ఈక్రమంలో పెళ్లిళ్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు.

16 నుంచి ముహూర్తాలు..

నవంబర్ 16వ తేదీ నుంచి వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు పేర్కొంటున్నారు ఈ నెలలో 19, 21, 22, 23, 24, 26 మరియు 29 తదితర తేదీలలో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు వెల్లడిస్తున్నారు. ఆ తర్వాత డిసెంబర్ ముగింపు వరకు కూడా మంచి రోజులు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నెల 30న శాసనసభ ఎన్నికలు జరుగుతాయి. 15 రోజుల ముందు నుంచి కళ్యాణ ఘడియలు మొదలుకానున్నాయి. అభ్యర్థుల ప్రచారం వివాహాలు ఏకకాలంలో జరగనుండడంతో ఫంక్షన్ హాల్లు, వివాహ మండపాల కొరత ఏర్పడనుంది. నవంబర్ 29న కూడా పెళ్లిళ్లకు ముహూర్తం ఉండడంతో పోలింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని నాయకులు భావిస్తున్నారు.

ఫంక్షన్ హాళ్లలోనే ప్రచారానికి ప్రణాళికలు..

నవంబర్ 16 నుంచి 29 వరకు వరుస పెళ్లి ముహూర్తాలు ఉండడంతో ఈ వేడుకలు జరిగే ఫంక్షన్ హాళ్లలోనే అభ్యర్థులు ప్రచారం చేసుకునే వీలుంటుంది. అభ్యర్థులకు ప్రజలను కలిసేందుకు అవకాశం లభించనుంది. వధువు, వరుడు తరుపున బంధువులు ఆహ్వానం మేరకు అభ్యర్థులు ఆయా వేడుకలకు హాజరై అక్కడే ఓటును కూడా అభ్యర్థించేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం



కాలిపోయిన షాపును పరిశీలిస్తున్న అగ్నిమాపక అధికారులు

- రూ.35లక్షల ఆస్తి నష్టం
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

ఆదిలాబాద్‌టౌన్: దీపావళి పండగ రోజున ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అర్ధరాత్రి 12గంటల సమయంలో పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో గల శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్ని మాపకశాఖ అధికారులు చెబుతున్నారు. ఓ వైపు పట్టణంలో టపాసుల శబ్దాలు, విద్యుత్ దీపాల వెలుగులు విరజిమ్ముతుండగా ఒక్కసారిగా దుకాణంలో మంటలు ఎగిసిపడ్డాయి. షాపులో నుంచి పెద్ద ఎత్తున పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపకశాక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పేందుకు యత్నించారు. రెండు ఫైరింజన్ల ద్వారా తీవ్రంగా శ్రమించి అదుపులోకి తీసుకొచ్చారు. చుట్టుపక్కల షాపులకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తపడ్డారు. షాపులోని రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు వంటి గృహోపకరణలు పూర్తిగా ఆహుతయ్యాయి. సుమారు రూ.35లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి దుర్గే శివాజీ తెలిపారు. కాగా లక్ష్మీపూజ రోజున ఈ ఘటన చోటుచేసుకోవడంతో షాపు యజమాని తీవ్ర విషాదంలో మునిగారు.

బైక్‌కు రూ.26 వేల చలాన్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీలో భాగంగా నిర్మల్ బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ బైక్ చలాన్లు చెక్ చేయగా రూ.26 వేల చలాన్లు పెండింగ్ ఉండడంతో అవాక్కయ్యారు. ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీలో భాగంగా ఓ మైనర్ బాలుడు స్కూటీపై ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్నాడు. స్థానిక బస్టాండ్ వద్ద ఆ వాహనాన్ని ఆపి ఈ చలాన్లు చూడగా మొత్తం 42 చలాన్లు ఉన్నాయి. వెంటనే ఆ బాలుడిని బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాలుడి తండ్రిని పిలిపించారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రిపుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, సిగ్నల్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఇందులో ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

46వ వసంతంలోకి ఎన్టీపీసీ



ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు



నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు

- 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు
- తెలంగాణ స్టేజీ–1లో 800 మెగావాట్ల విద్యుత్..
- మరో 176 మెగావాట్ల సోలార్ ప్లాంటు నిర్మాణానికి ప్రణాళిక
- మొత్తం 3,510 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్(రామగుండం): దేశానికి ఎన్టీపీసీ వెలుగులు పంచుతూ రాష్ట్రంలో అతిపెద్ద విద్యుత్ హబ్‌గా నిలిచింది. విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తూ 46వ వసంతంలోకి అడుగిడుతోంది. రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో 2,600, తెలంగాణ స్టేజీ–1లో 800, ఫ్లోటింగ్ సోలార్ 100, సోలార్ 10 మెగావాట్లు మొత్తం 3,510 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, ఐఎస్‌ఓ– 14001 సర్టిఫికెట్ పొంది ×సూపర్ థర్మల్ పవర్ స్టేషన్'గా రూపాంతరం చెందింది. అప్పటి ప్రధానమంత్రి దివంగత మొరార్జీ దేశాయ్ నవంబర్ 14, 1978 పునాదిరాయి వేశారు. షెడ్యూల్ అమలుకు ముందే 7 యూనిట్లను ప్రారంభించిన ప్రాజెక్ట్ అమలులో ప్రత్యేక విజయాన్ని సాధించింది.

ప్లాంట్ పనితీరు..

ఎన్టీపీసీ రామగుండంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 9,696.78 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. అక్టోబర్ వరకు 9,696.78 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 79.04 శాతం పీఎల్ఎఫ్‌తో పూర్తి చేసినట్లు తెలిపారు.

పర్యావరణం

పర్యావరణ, కార్యాచరణ మార్గదర్శకాలకు అనుగుణంగా, రామగుండం సంస్థ మొక్కలను పెంచడంతో పాటు మియావాకి విధానం ప్రవేశపెట్టి ఉష్ణోగ్రతల తగ్గుదలకు తన వంతుగా ప్రయత్నం చేస్తుంది. 2019–20లో హరితహారం కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలో 80,000 పైగా మొక్కలు నాటారు.

బూడిద వినియోగం

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 100శాతం బూడిద వినియోగంలో ప్రణాళికాబద్ధంగా విజయం సాధించింది. యాష్‌పాండ్ నుంచి మొదటిసారిగా సెనోస్పియర్ సేకరణ, అమ్మకాలు ప్రారంభించింది. తెలంగాణ ప్రాజెక్ట్ లోపల ఇటీవల నిర్మించిన సిమెంట్ ఫ్రీ ఫ్లై యాష్ బేస్డ్ జియోపాలిమర్ రోడ్ నిర్మాణం చేపట్టింది.

నీటి సంరక్షణ

నీటి సంరక్షణలో భాగంగా మంచినీటి వినియోగాన్ని తగ్గించడంలో ప్రవహించే నీటిని రీసైకిల్ చేయడంతో పాటు యాష్ హ్యాండ్లింగ్ కోసం ఉపయోగించే నీటిని రీసైకిల్ చేస్తున్నారు. అలాగే హార్టికల్చర్ ప్రయోజనం కోసం ఎన్టీపీసీ నీటిని తిరిగి ఉపయోగిస్తున్నారు. ఇటీవల విద్యుత్ కేంద్రంలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రాజెక్టు ఏర్పాటైంది. రిమోట్ పరికరాలు ఉపయోగించి వైర్‌లెస్ వాటర్ వినియోగ డేటా పర్యవేక్షణను ప్రారంభించిన మొదటి ప్లాంట్ రామగుండంగా రికార్డులకెక్కింది.

భద్రత

ప్రాజెక్టులో ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల్లో భద్రతా అవగాహన కల్పించడానికి చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారు. మాక్ డ్రిల్స్ నిర్వహించడంతో పాటు పలు భద్రతా శిక్షణ అందిస్తున్నారు.

సంప్రదాయేతర ఇంధన విభాగంలో..

పునరుత్పాదక ఇంధన విభాగంలో తన పోర్ట్‌ఫోలియోను పెంచుకుంటూ డిసెంబర్ 31, 2013న 10 మెగావాట్ల సోలార్ పీవీ ప్లాంట్‌ను ప్రారంభించారు. దీనికి తోడు కొన్ని భవనాలకు సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్‌తో పాటు సీడబ్ల్యూ చానల్‌లో 125 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ నిర్మాణ దశలో ఉంది. రామగుండం 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పీవీ ప్రాజెక్ట్ (దేశంలో అతిపెద్దది)ను జలాశయంలో ఏర్పాటు చేశారు. మరో 176 మెగావాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు.

తెలంగాణ ప్రాజెక్ట్..

తెలంగాణ స్టేజీ –1 (2 X 800 మెగావాట్లు) అత్యాధునిక అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా బొగ్గు వినియోగంతో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతోంది. 1,600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఫేజ్–1లో 800 మెగావాట్ల మొదటి యూనిట్ విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చింది. రెండో యూనిట్‌లో ఉత్పత్తిని ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–2లో నిర్మించనున్న 3 X800=2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణానికి అడుగులు పడనున్నాయి.

తెలంగాణకు ఎన్టీపీసీ విద్యుత్



ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికి 85 శాతం అందించడం జరుగుతుంది. రామగుండంలో 120 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 56 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ ప్లాంట్‌ల భవిష్యత్ ప్రణాళిక ఉంది. మరో 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను ఉత్పత్తి దశలోకి తీసుకు రావడానికి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

– కేదార్ రంజన్‌పాండు, సీజీఎం,ఎన్టీపీసీ రామగుండం

సామాజిక సేవ

సామాజిక సేవా బాధ్యతా పథకంలో భాగంగా ఎన్టీపీసీ సమీప గ్రామాలల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించింది. విద్య, ఆరోగ్యం, నీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు యువతకు శిక్షణ అందిస్తున్నారు.

అవార్డులు

విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఎన్టీపీసీ అనేక పురస్కారాలు సాధించింది. ఇటీవల స్టేషన్‌కు నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు– 2019, ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ అవార్డు–2020, ముంబయ్‌లోని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ నుంచి ప్రశంసాపత్రం అవార్డు లభించింది. అలాగే గోల్డెన్ పీకాక్ అవార్డు– 2020, బెస్ట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ విభాగంలో స్వర్ణశక్తి అవార్డు–2021, 2022లో రాజభాషలో స్వర్ణ శక్తి తదితర అవార్డులు సాధించింది.



విద్య

బడి రెక్కలతో మళ్లీ బాల్యంలోకి...


● మళ్లీ బడి పిల్లలమై...

ఆ క్లాసురూమ్‌లో చిన్న శబ్దం కూడా పెద్దగా వినిపించేంత నిశ్శబ్దం. స్కూల్ యూనిఫామ్‌లో మెరిసిపోతున్న విద్యార్థులు టీచర్ చెప్పే పాఠాన్ని శ్రద్ధగా వింటున్నారు.

పాఠం పూర్తయిన తరువాత 'ఏమైనా డౌట్స్ ఉన్నాయా?' అని టీచర్ అడిగితే ఒక్కొక్కరు తమ డౌట్స్‌ను అడగడం మొదలు పెట్టారు...'ఈ దృశ్యంలో విశేషం ఏముంది... అన్ని స్కూళ్లలో కనిపించేదే కదా' అనే డౌటు రావచ్చు. అయితే ఈ క్లాసురూమ్‌లో కూర్చున్న విద్యార్థులు పిల్లలు కాదు. ముప్పై నుంచి డెబ్బై ఏళ్ల వయసు వరకు ఉన్న మహిళలు. ఏవో కారణాల వల్ల చదువును మధ్యలోనే మానేసిన వీరు 'బ్యాక్-టు-స్కూల్' ప్రోగ్రామ్‌తో మళ్లీ బడిపిల్లలయ్యారు....

దేశంలోనే పెద్దదైన స్వయం సహాయక బృందం 'కుదుంబశ్రీ మిషన్' చదువును మధ్యలోనే మానేసిన మహిళలను తిరిగి స్కూల్‌కు తీసుకువచ్చే విధంగా రెండు నెలల పాటు విస్తృత ప్రచారం చేసింది.

మెసేజ్‌లు, పోస్టర్లు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలోనూ ప్రచారం నిర్వహించింది. వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసింది.

కేరళలోని 14 జిల్లాలలోని రెండువేలకు పైగా స్కూల్స్‌లో తిరిగే స్కూల్ లిల్ (బ్యాక్ టు స్కూల్) కార్యక్రమంలో భాగంగా వందలాది మంది మహిళలు వీకెండ్ క్లాస్‌లకు హాజరవుతున్నారు.

'నా వయసు యాభై సంవత్సరాలు దాటింది. పెళ్లివల్ల పదవతరగతి పూర్తి కాకుండానే చదువు మానేయవలసి వచ్చింది. బ్యాక్ టు స్కూల్ కార్యక్రమంలో భాగంగా వీకెండ్ క్లాస్‌కు హాజరయ్యే ముందు అందరూ నవ్వుతారేమో అనిపించింది. నవ్వడానికి నేను చేస్తున్న తప్పేమిటి? అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఈ క్లాసులకు హాజరవడానికి ముందు మామూలు సెల్‌ఫోన్‌ను ఆపరేట్ చేయడం ఎలాగో నాకు తెలియదు. ఇప్పుడు మాత్రం


● బడిలో 100 సంవత్సరాలు దాటిన బామ్మ... రోహేల్ (మధ్యలో)

డిజిటల్‌కు సంబంధించి చాలా విషయాలు నేర్చుకున్నాను. బ్యాంకు వ్యవహారాల్లో నేర్పు సంపాదించాను. ఒకప్పుడు ఇతరులు ఎవరైనా నాతో వస్తేనే బ్యాంకుకు వెళ్లేదాన్ని. ఇప్పుడు మాత్రం సొంతంగా బ్యాంకింగ్ వ్యవహారాలను చక్కబెడుతున్నాను. సొంతంగా వ్యాపారం మొదలు పెట్టడానికి రెడీ అవుతున్నాను. స్కూల్ ద్వారా ఎన్నో విలువైన సలహాలు తీసుకున్నాను' అంటుంది కొట్టాయం జిల్లాకు చెందిన నీల.

'బ్యాక్ టు స్కూల్' వీకెండ్ క్లాస్‌లు అకడమిక్ పాఠాలకే పరిమితం కావడం లేదు. సుపరిపాలన, స్త్రీ సాధికారత, కష్టాల్లో ఉన్న వారికి కలిసికట్టుగా సహాయం చేయడం... ఇలా ఎన్నో సామాజిక, సేవా సంబంధిత చర్చలు క్లాస్‌రూమ్‌లో జరుగుతుంటాయి. ఈ చర్చలేవీ వృథా పోలేదు అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ఈ క్లాసులకు హాజరవుతున్న ఒక మహిళ భర్తకు కిడ్నీ మార్పిడి చేయాల్సి వచ్చింది. ఇందుకోసం మహిళలు అందరూ కలిసి ఇందుకు అవసరమైన డబ్బును సేకరించారు.

'తరగతులకు హాజరు కావడం ద్వారా ఆర్థిక స్వతంత్రత, డిజిటల్ అక్షరాస్యత, వ్యాపారదక్షత ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. ఎంతోమంది సొంతంగా వ్యాపారం ప్రారంభించారు' అంటుంది శ్రీష్మ అనే ట్రైనర్.

'యాభై దాటిన వారు స్కూల్‌కు రారేమో అనుకున్నాం. అయితే యాభై నుంచి అరవైఏళ్ల మధ్య వయసు ఉన్నవాళ్లే ఎక్కువ సంఖ్యలో ఉండడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. వారి ఉత్సాహం చూస్తుంటే ముచ్చటేస్తుంది' అంటుంది హసీనా అనే టీచర్.

స్కూల్‌కు హాజరవుతున్న వాళ్లలో భిన్నమైన సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన వాళ్లు, భిన్నమైన ప్రతిభాపాటవాలు ఉన్న మహిళలు ఉన్నారు.

పాలక్కాడ్ జిల్లా పుదుక్కోడ్ గ్రామానికి చెందిన రాధ రెండున్నర సంవత్సరాలుగా క్యాంటీన్ నడుపుతోంది. వీకెండ్ క్లాసులకు క్రమం తప్పకుండా హాజరవుతుంది.

'ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోగలిగాను అనేది ఒక సంతోషం అయితే, నేర్చుకున్న వాటి ద్వారా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడం మరో సంతోషం' అంటుంది రాధ.

'ఫైనాన్సియల్ ప్లానింగ్, మహిళకు కొత్త జీవనోపాధి అవకాశాలు పరిచయం చేయడం, డిజిటల్ అక్షరాస్యత, సామాజిక ఐక్యత మొదలైన అంశాలకు సంబంధించి మాడ్యుల్ తయారు చేశాం' అంటున్నాడు కుదుంబశ్రీ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నిషాద్.

'డిజైనింగ్‌కు సంబంధించి ఎన్నో క్లాసులు తీసుకున్నాను. క్లాసుకు హాజరవుతున్న మహిళల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే వారు భవిష్యత్‌లో తప్పకుండా విజయం సాధిస్తారనే నమ్మకం కలుగుతుంది' అంటుంది మనప్పదం గ్రామానికి చెందిన పుష్పలత. ఫ్యాషన్ డిజైనింగ్ యూనిట్‌ను నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోంది పుష్పలత.

శాస్త్రం

● పన్నెండు సంవత్సరాల వయసులోనే

ఫైర్-డిటెక్షన్ డివైజ్ ఆవిష్కరణ

సైన్స్ పాఠాలను కూడా చందమామ కథల్లా ఆసక్తిగా వింటుంది శణ్య గిల్. ఆ ఆసక్తి వృథా పోలేదు. చిన్నవయసులోనే ఆవిష్కర్తను చేసింది. థర్మో ఫిషర్ సైంటిఫిక్ జూనియర్ ఇన్వెంటర్స్ ఛాలెంజ్-2023లో పన్నెండు సంవత్సరాల శణ్య గిల్ తయారు చేసిన ఫైర్-డిటెక్షన్ డివైజ్ ప్రథమ స్థానంలో నిలిచింది...


● ఫైర్ డిటెక్షన్ డివైజ్




● శణ్య గిల్

కాలిఫోర్నియా(యూఎస్)లో సిక్స్-గ్రేడ్ చదువుతుంది శణ్య. సైన్స్, సైంటిస్టులు తనకు బాగా ఇష్టం. సైన్స్‌లో కొత్త ఆవిష్కరణల గురించి తెలుసుకోవడం అంటే ఆసక్తి. శణ్య గిల్ ఇంటికి సమీపంలోని ఒక రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం జరిగి భారీ నష్టం సంభవించింది. ఇంటా బయటా ఈ ప్రమాదానికి సంబంధించిన రకరకాల మాటలు ఎక్కడో ఒక చోట వినేది శణ్య గిల్. అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఒక పరికరం తయారు చేయాలనుకుంది. రకరకాల ప్రయోగాలు చేసింది.

ఆ ప్రయోగాలు వృథా పోలేదు.

కంప్యూటర్‌కు అనుసంధానించిన థర్మల్ కెమెరాను ఉపయోగించి సమర్థవంతమైన ఫైర్-డిటెక్షన్ సిస్టమ్‌ను రూపొందించింది శణ్య.

శణ్య తయారు చేసిన ఫైర్-డిటెక్షన్ డివైజ్ సాధారణ సంప్రదాయ స్మోక్ డిటెక్టర్ కంటే చాలా వేగంగా పనిచేస్తుంది. నష్టం జరగకుండా అప్రమత్తం చేస్తుంది.

'రెస్టారెంట్ అగ్నిప్రమాదం ప్రభావంతో అమ్మ రకరకాలుగా భయపడేది. కిచెన్‌లోని స్టవ్ ఆఫ్ అయిందో లేదో అమ్మ ఒకటికి రెండుసార్లు చెక్ చేసేది. ఎన్నో జాగ్రత్తలు తీసుకునేది. మరోవైపు ఎక్కడ చూసినా ఆ అగ్నిప్రమాదానికి సంబంధించే మాట్లాడుకునేవారు. ఇదంతా చూసిన తరువాత అగ్నిప్రమాదాలను నివారించే పరికరాన్ని తయారు చేయాలనుకున్నాను. నేను తయారు చేసిన ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ద్వారా ఎంతో మందిని అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కాపాడవచ్చు' అంటుంది శణ్య గిల్.

శణ్యకు సైన్స్‌తోపాటు ఆటలు, క్రాఫ్టింగ్, కోడింగ్ అంటే ఇష్టం. జూనియర్‌లకు పాఠాలు చెప్పడం అంటే ఇష్టం. బయో మెడికల్ ఇంజనీర్ కావాలనేది శణ్య గిల్ లక్ష్యం.

కళ

మనసైన మరో ప్రపంచంలోకి...

ప్రకృతి అనేది మనిషికి అతి పెద్ద పాఠశాల. జలపాతాల నుంచి పంటచేల వరకు ప్రతిదీ ఏదో ఒక పాఠం చెబుతూనే ఉంటుంది. అందుకే ప్రకృతి పిల్లలకు నచ్చిన ప్రపంచం. 'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్' అంశంపై రిజు వేసిన పెయింటింగ్... పిల్లలకూ ప్రకృతి ప్రపంచానికి మధ్య ఉండే అనుబంధానికి అద్దం పడుతుంది. ఈ పెయింటింగ్ చిల్డ్రన్స్ డే స్పెషల్ స్టాంప్ కోసం ఎంపికైంది...


● రిజు

కేరళ స్టేట్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ ప్రతి సంవత్సరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేస్తుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా అయిదు నుంచి పదకొండవ తరగతి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారు.

ఈ స్టాంపుల అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని పిల్లల సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగిస్తుంటారు.

ఈ సంవత్సరం రిజు వేసిన పెయింటింగ్ చిల్డ్రన్స్ డే స్టాంప్ కోసం ఎంపికైంది.

'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్ థీమ్ నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. ప్రకృతి కూడా గురువులాంటిదే అనే ఐడియాతో ఈ బొమ్మ వేశాను. ప్రకృతి, విద్యాప్రపంచం రెండూ కలిసిపోయి కనిపించేలా బొమ్మ వేశాను' అంటుంది కోచిలోని సెయింట్ థామస్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న రిజు. 'రిజు పెయింటింగ్ అద్భుతమైన ఊహతో భావగర్భితంగా ఉంది' అని జ్యూరీ ప్రశంసించింది. 'నిజంగా చెప్పాలంటే బహుమతి వస్తుంది అనుకోలేదు. నేనే కాదు నా తల్లిదండ్రులు, టీచర్‌లు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ పోటీలో పాల్గొనడంలో భాగంగా రకరకాల స్కెచ్‌లు వేశాను. అయితే అవేమీ నాకు నచ్చలేదు. ఆలోచిస్తున్న కొద్దీ కొత్త కొత్త ఆలోచనలు వచ్చేవి. ఆలోచిస్తున్న క్రమంలో ప్రకృతి ప్రపంచాన్ని పుస్తకంగా అనుకున్నాను. ఆ పుస్తకం తెరుచుకున్నప్పుడు ఆ దారుల్లో పిల్లలు ఉత్సాహంగా పరుగులు తీస్తుంటారు. ఈ ఊహతో పెయింటింగ్ వేసినప్పుడు చాలా సంతృప్తిగా అనిపించింది. నేను వేసిన పెయింటింగ్ స్టాంప్‌గా ఎంపిక కావడం, స్టాంప్‌లు నాన్న వృత్తిలో భాగం కావడం ఆనందంగా ఉంది ' అంటుంది రిజు.


● స్టాంప్‌కు ఎన్నికైన రిజు పెయింటింగ్

రిజు తండ్రి రాజేష్ పరక్కాడవు పోస్ట్ ఆఫీసులో పోస్ట్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. 'రోజూ తప్పకుండా ఏదో ఒక పెయింటింగ్ వేస్తుంటుంది రిజు. చిత్రకళకు సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటుంది. తన పెయింటింగ్ స్టాంప్‌గా ఎంపిక కావడం రిజూకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో ఆర్టిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నాను' అంటున్నారు రిజు తండ్రి రాజేష్. బాలల దినోత్సవం సందర్భంగా తిరువనంతపురంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ సమక్షంలో 'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్' స్టాంప్‌ను అధికారికంగా విడుదల చేస్తారు.

● పశు వ్యాధులకు హోమియో మందులతో చికిత్స ఎంతో మేలు

ఖర్చు తక్కువ... వెంటనే ఫలితం..!



పాడి పశువులు రోగాల బారిన పడినప్పుడు రైతులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ఖర్చుల కన్నా చికిత్స ఖర్చులు భారంగా మారుతుండటంతో పాడి రైతుల ఆదాయం తగ్గిపోతోంది. ఈ సమస్యకు సరైన పరిష్కారం హోమియో చికిత్సా విధానం. ఇది తక్కువ ఖర్చుతో వెంటనే ఫలితాన్ని ఇచ్చేదే కాకుండా సహజమైన, మానవీయమైన, సమర్థవంతమైన చికిత్సా పద్ధతి కూడా అంటున్నారు పశువైద్యాధికారి డాక్టర్.జి.రాంబాబు. కడప లోని పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో సేవలందిస్తున్న ఆయన హోమియో పశువైద్యంలో తన అనుభవాలను 'సాక్షి సాగుబడి'తో పంచుకున్నారు..

సహజ రోగ నిరోధక శక్తికి ప్రేరణ కలిగించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే హోమియో వైద్య విధానం లక్షణం. హోమియో విధానంలో వాడే ఔషధాలన్నీ కూడా సహజమైన మొక్కలు, లవణాలతో తయారు చేసినవే. ఈ వైద్య విధానానికి 200 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా యూరోపియన్, ఆసియా దేశాల్లో పశువ్యాధుల చికిత్సలో హోమియోపతి మందులు వాడుతున్నారు. మన దేశంలోనూ అక్కడక్కడా ఈ ప్రయత్నాలు జరుగుతుండటం ఆహ్వానించదగిన విషయం.

పశువులకు హోమియో ప్రయోజనాలేమిటి?

- ఖర్చు తక్కువ. ఒక మందు ఖరీదు కేవలం రూ. 10 లోపే. అల్లోపతిలో ఈ ధరకు ఏ మందూ రాదు.
- సైడ్ ఎఫెక్ట్స్ /దుష్ప్రభావాలు ఉండవు. పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసే వరకు మందులు వాడకుండా ఉండాల్సిన పని లేదు. రోగ లక్షణాన్ని బట్టి చికిత్స చేస్తే చాలు.
- ఒకసారి పశువులకు, దూడలకు, ముఖ్యంగా శునకాలకు హోమియో (తీపి) మాత్రలు ఒక సారి ఇస్తే మళ్లీ అవే వచ్చి మందు అడుగుతాయి.
- హోమియో మందులు త్వరితగతిన పనిచేస్తాయి. ఇవి నెమ్మదిగా పనిచేస్తాయని చాలా మంది అనుకుంటారు. అది అపోహ మాత్రమే.
- ఇతర వైద్య పద్ధతుల్లో మందుల మాదిరిగా భరించలేని వాసన ఈ మందులకు ఉండదు.
- డోసు కొద్దిగా ఎక్కువయినా ఇబ్బంది లేదు. అది మిగతా వైద్య పద్ధతుల్లో ఇది సాధ్యం కాదు. కాబట్టి, అవగాహన పెంచుకున్న రైతులు పశువులకు ఇంటి దగ్గరే ఈ వైద్యం చేసుకోవచ్చు.
- కొన్ని వ్యాధులకు అల్లోపతిలో లేని వైద్యం కూడా హోమియోపతిలో ఉండటం విశేషం.
- ఈ మందుల వల్ల పర్యావరణం కలుషితం కాదు.

హోమియో మందులతో పొదుగువాపు మాయం!

రాథి ఆవు ఇది. రాజస్తాన్‌కు చెందిన జాతి. స్థానిక రైతు అక్కడి నుంచి కడప జిల్లాకు చూడి ఆవును తీసుకువచ్చారు. వారం తరువాత ఈనిన ఆవు కోడె దూడకు జన్మనిచ్చింది. పాలు ఇచ్చిన 5వ రోజు నుంచి రెండు చన్నుల నుంచి పాలతో పాటు రక్తం వచ్చింది. పశువైద్యునిగా పొదుగువాపును గుర్తించి యాంటి బయోటిక్ మందులతో చికిత్స ఇచ్చాను. 5 రోజులకు తగ్గింది. 7వ రోజు నుంచి మళ్లీ పొదుగువాపు వచ్చింది. ఆవు నుంచి తీసిన రక్తంతో కూడిన పాలను యాంటి బయోటిక్ సెన్సిటివిటి పరీక్షకు ప్రయోగశాలకు పంపించాం. పరీక్ష ఫలితాలు 3వ రోజున వస్తాయి. ఈ లోపు మళ్లీ కొత్త అల్లోపతి మందులు ఇవ్వడం కన్నా ఆయుర్వేద లేదా హోమియో మందులు వాడుతుంటాం. ఈ ఆవుకు హోమియో మందులు వాడితే.. రెండు విధాలుగా ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. మొదటిది: పాల పరీక్ష ఫలితాల్లో మొత్తం 13 యాంటీ బయోటిక్ మందులకు నిరోధకత వచ్చింది. అంటే, ఆ ఆవుపై ఇక ఏ యాంటి బయోటిక్ మందూ పనిచేయదని అర్థం. రెండోది: ఈ లోగా హోమియో మందులు వాడటం వల్ల 3 రోజుల్లోనే పొదుగువాపు తగ్గిపోయింది. అల్లోపతి మందులకు దాదాపుగా రూ. 2,200 ఖర్చు చేశాం. హోమియో మందుల ఖర్చు కేవలం రూ. 50 మాత్రమే. పొదుగువాపు తగ్గించడానికి ఫైటో లక్క, కొనియం, బెల్లడోన, ఫెర్రం ఫాస్ అనే హోమియో మందులను వినియోగించాం.




● పచ్చి మేతలో కలిపి హోమియో మాత్రలు ఇలా తినిపించవచ్చు

రెండు వారాలైనా తగ్గనిది.. హోమియోతో 2 రోజుల్లో తగ్గింది!

ఒక హోటల్ యజమాని ఒంగోలు ఆవును కొన్నారు. మంచిదని హోటల్ దగ్గరే ఆవును కట్టేస్తున్నారు. గడ్డి తక్కువ వేస్తూ ఎక్కువ మొత్తంలో కూరగాయలు మేపేవారట. కొద్ది రోజులకే ఆవుకు సుస్తీ చేసింది. మేత తినటం దాదాపుగా ఆపేసింది. ఆకలి పెంచేందుకు పౌడర్లు, బీకాంప్లెక్స్ ఇంజక్షన్లు, లివర్ టానిక్‌లు, కసురు తాగించినా ఫలితం లేకపోవటంతో కడప పశువుల ఆసుపత్రికి తీసుకువచ్చారు. అల్లోపతి మందులతో దాదాపు 2 వారాల పాటు వైద్యం అందించినా, కొద్దిగా కూడా ఫలితం కనిపించలేదు. ఆ దశలో నక్స్ వామిక, రుస్ టాక్స్ అనే హోమియో మందులు రెండు రోజులు ఇచ్చాం. 3వ రోజుకు సమస్య పూర్తిగా తగ్గిపోయింది.


● నాలుకపై ఇలా వేయొచ్చు..

(పశువైద్యులు డాక్టర్ జి. రాంబాబును 94945 88885 నంబరులో సంప్రదించవచ్చు)

ఏ వ్యాధికి ఏయే హోమియో మందులు?

పశువుల వ్యాధులకు హోమియోపతి మందులను శువు వయసును బట్టి, వ్యాధి లక్షణాల తీవ్రతను బట్టి ఎంత పొటెన్సీ కలిగిన మందు ఇవ్వాలో నిర్ణయించాలి. వయసులో చిన్న పశువులకు 30 పొటెన్సీలో ఇవ్వాలి. పెద్ద పశువులకు 200 పొటెన్సీలో 5 నుండి 10 మాత్రలు ఇవ్వాలి. పశువైద్యులు హోమియోపతి వైద్య విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలిగితే తమ ప్రాంతంలోని రైతులకు మంచి సలహాలు అందించగలుగుతారు. పశుపోషణపై మక్కువ కలిగిన రైతులు హోమియోపై అవగాహన పెంచుకోవాలి. తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా, వెంటనే బాగా ఉపయోగపడుతుందని గ్రహించాలి.




నొప్పి నివారణకు - ఆర్నిక
జ్వరం - బెల్లడోన
చెవి నుంచి చీము - మెర్క్ సాల్
కాలిన బొబ్బలు - కేంతారిస్
పుండ్లకు - క్యాలెండుల
చర్మ వ్యాధులకు - సల్ఫర్
విరిగిన ఎముకలకు - సిం ఫైటం
పొదుగువాపు- ఫైటో లక్క
పాము కాటు - నాజా
తేనెటీగ/కందిరీగ కరిస్తే - ఎపిస్
తేలు కాటు - లేడం పాల్
దగ్గు - బాసిలినం
నోటి పుండ్ల నివారణకు - బోరాక్స్
గడ్డల కరుగుదలకు - ఆరం మూర్ నైట్రికం
వాపు, గడ్డలు తగ్గటానికి - బ్రయోనియ
పాలు పెరుగుదలకు - కాల్కేరియ కార్బ్
క్యాల్షియం లోపానికి - కాల్కేరియ ఫాస్
డీవార్మింగ్/ నట్టల నివారణకు - సినా / చైనా
కడుపులో గ్యాస్ - కొల్చికం
కడుపులో నొప్పి- కోలో సింథసిస్
అండాశయంలో ఫాలికల్ పెరుగుదలకు-ఆరం అయోడం
ఎద లక్షణాలు రావడానికి - ఆగ్నస్ కాస్టాస్
కంటి పొరల ఎరుపు - యుఫ్రేసియ
రక్త వృద్ధి - ఫెర్రం మెట్, ఫెర్రం ఫాస్
చీముతో కూడిన ఇన్ఫెక్షన్ - గన్ పౌడర్
రక్తస్రావం తగ్గించడానికి - హిమామిలిస్
నరాల చివర గాయం వద్ద నొప్పి నివారణ - హైపెరికం
పాలలో రక్తం - ఇపెకాక్
ఎడిమ/ ఎక్కడయినా నీరు చేరే ఉబ్బు - నాట్రం సల్ఫ్
ఆకలి పెరగడానికి - నక్స్ వామిక
గర్భాశయ ద్వారం తెరుచుకోవడానికి - కాలోఫయలం
ఎఖినేసియ -రక్తశుద్ధి, రోగనిరోధక శక్తి
మెయ్య దిగడం - సేపియ
పడ్డ దూడలు ఎదకు రాకపోతే - పల్సటిల్ల
చీము బాగా ఉంటే - పైరోజినం
రుమేన్/ పశు పొట్ట కదలికలకు - రాఫనస్
కీళ్ళ నొప్పులు - రుస్ టాక్స్
గర్భస్రావం కాకుండా - సబినా
గర్భాశయ కండరాల కదలికలకు - సీకల్ కోర్నోటం

సాగుబడి
విశాఖ కార్తె: నవంబర్ 20 వరకు

➡ 20 సెంట్లలో 20 రకాల పంటల ప్రకృతి సేద్యం
➡ నిరంతర ఆదాయం.. 2 నెలల్లోనే రూ. పది వేల ఆదాయం

పంట చేసే ఏటీఎం!


● ఏటీఎం సాగు చేసిన పృథ్వీరాజ్



ప్రకృతి వ్యవసాయంలో సరికొత్త అధ్యాయం ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) నమూనా. కొద్ది సెంట్ల భూమిలోనే ఏడాది పొడవునా రకరకాల కూరగాయ పంటల సాగు ద్వారా రైతుకు నిరంతర ఆదాయం ఇస్తున్న పంటల నమూనా ఇది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ ద్వారా క్షేత్రస్థాయిలో రైతులు ఏటీఎం సాగును చేపట్టి అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారు. కౌలు రైతు దూసరి పృథ్వీరాజ్ ఇందుకో నిదర్శనం. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలంలోని తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెం పృథ్వీరాజ్ నివాసం. కౌలుకు తీసుకున్న ఎకరం 20 సెంట్ల రేగడి భూమిలో ఏటీఎం మోడల్‌ను గత రెండు నెలలుగా సాగు చేస్తున్నారు. నాలుగు అడుగుల వెడల్పుతో ఎత్తుమడులను ఏర్పాటు చేసుకొని పైన డిజైన్‌లో చూపిన విధంగా 20 కూరగాయ పంటలు వేశారు. ఘనజీవామృతం, జీవామృతం 15 రోజులకోసారి ఇస్తున్నారు. జిల్లాలో 40 మంది రైతులతో ఏటీఎం మోడల్‌ను ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నామని డీపీఎం రాజకుమారి తెలిపారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

రెండు నెలల్లో రూ. పది వేల ఆదాయం

2 నెలల క్రితం 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం ఏటీఎం మోడల్‌లో పంటలు సాగు చేస్తున్నాను. 4 అడుగుల వెడల్పుండే 8 బెడ్స్‌లో 20 రకాల పంటలు వేశాం. గోంగూర, రెడ్ తోటకూర, పాలకూర, చుక్కకూర 20 రోజులకోసారి కోతకు వస్తున్నాయి. మరో ఐదారు బెడ్లలో ఆకుకూరలు కోయాల్సి ఉంది. బెండ, వంగ, బీర, గోరుచిక్కుడు, అనుములు, చెట్టుచిక్కుడు కోతకు వచ్చాయి. అన్నీ కలిపి ఇప్పటికి రూ. 10 వేల ఆదాయం వచ్చింది. చేలో ఒకే ఒక పంట వేసి చేతికొచ్చేవరకు ఆగకుండా రకరకాల పంటలను సాగు చేయటం ద్వారా ఎప్పటి కప్పుడు అధికాదాయం పొందుతున్నాం. ఏడాదికి 20 సెంట్లలో రూ. లక్షన్నర వరకు ఆదాయం వస్తుందనుకుంటున్నాం. భార్యాభర్తలు ఇద్దరం పంటలను కనిపెట్టుకుంటూ పనులను మేమే చేసుకుంటున్నాం. రసాయనాల్లేని ఆహారం తీసుకుంటూ తగిన ఆదాయం పొందుతున్నాం.

– డి. పృథ్వీరాజ్ (63058 37151), క్రిస్టియన్‌పాలెం, గుంటూరు జిల్లా

స్పోర్ట్స్

9 ఒకే ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 9 మ్యాచ్‌ల్లో గెలుపొందడం ఇదే తొలిసారి. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 8 మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఆస్ట్రేలియా జట్టు 2003, 2007 ప్రపంచకప్‌లలో వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచి చాంపియన్‌గా నిలిచింది.

7 వన్డేల్లో 400 అంతకంటే ఎక్కువ స్కోరు చేయడం భారత్‌కిది ఏడోసారి. దక్షిణాఫ్రికా జట్టు అత్యధికంగా 8 సార్లు ఈ మైలురాయిని దాటింది.

9 ప్రపంచకప్ మ్యాచ్‌లో తొలిసారి భారత్ తొమ్మిది మంది బౌలర్లతో బౌలింగ్ వేయించింది. గతంలో ఇంగ్లండ్ (1987లో శ్రీలంకపై), న్యూజిలాండ్ (1992లో పాకిస్తాన్‌పై) జట్లు మాత్రమే తొమ్మిది మంది బౌలర్లకు అవకాశం ఇచ్చింది.

24 ఈ ఏడాది వన్డేల్లో భారత్ సాధించిన విజయాలు. 1998లోనూ భారత్ అత్యధికంగా 24 వన్డేల్లో గెలిచింది.

60 ఒకే ఏడాది వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ (60) నిలిచాడు. 2015లో ఏబీ డివిలియర్స్ 58 సిక్స్‌లు కొట్టాడు.

215 ఈ ఏడాది భారత జట్టు 30 వన్డేలు ఆడి కొట్టిన సిక్స్‌లు. 2019లో వెస్టిండీస్ అత్యధికంగా 209 సిక్స్‌లు కొట్టింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	9	9	0	18	2.570
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	9	7	2	14	0.841
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	9	4	5	8	-0.199
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	9	3	6	6	-0.572
బంగ్లాదేశ్	9	2	7	4	-1.087
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	9	2	7	4	-1.825

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

‘హాల్ ఆఫ్ ఫేమ్’లో సెహ్వాగ్, ఎడుల్జీ

అరవింద డిసిల్వాకు కూడా చోటు





దుబాయ్: భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ, మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో చోటు దక్కించుకున్నారు. ఈ ఇద్దరు భారత క్రికెటర్లతో పాటు శ్రీలంక దిగ్గజం అరవింద డిసిల్వాను కూడా తాజాగా ఐసీసీ ఈ విశిష్ట క్రికెటర్ల జాబితాలో చేర్చింది. భారత్ నుంచి ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో ఇప్పటి వరకు తొమ్మిది మందికి చోటు లభించగా... ఎడుల్జీ ఈ జాబితాలో చోటు దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్ కావడం విశేషం. ఆయా జట్లకు అందించిన సేవలు, నడిపించిన తీరు, గెలిపించిన ఘనతలు అన్నీ పరిగణించే ఐసీసీ ‘హాల్ ఆఫ్ ఫేమ్’లోకి ఎంపిక చేస్తారు.

డయానా ఎడుల్జీ: భారత్‌లో అమ్మాయిల క్రికెట్‌వైపు కన్నెత్తి చూడని రోజుల్లోనే క్రికెటరై తర్వాత సారథిగా ఎదిగింది. 1976 నుంచి 1993 వరకు భారత జట్టుకు ఆడి స్పిన్ ఆల్‌రౌండర్‌గా రాణించింది. 20 టెస్టులాడి 63 వికెట్లు తీసి, 404 పరుగులు చేసింది. 34 వన్డేల్లో 211 పరుగులు సాధించి 46 వికెట్లు పడగొట్టింది.

సెహ్వాగ్: భారత టెస్టు క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా సెహ్వాగ్ రికార్డుల్లోకెక్కాడు. భారత్ 2007 టి20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ సాధించడంలో తనవంతు పాత్ర పోషించాడు. సెహ్వాగ్ 104 టెస్టులు ఆడి 8586 పరుగులు సాధించాడు. 23 సెంచరీలు చేశాడు. 40 వికెట్లు తీశాడు. 251 వన్డేలాడి 8273 పరుగులు, 15 సెంచరీలు సాధించాడు. 96 వికెట్లు కూడా తీశాడు. 19 టి20లు ఆడి 393 పరుగులు సాధించాడు.

అరవింద డిసిల్వా: ఆస్ట్రేలియాతో జరిగిన 1996 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో డిసిల్వా వీరోచిత సెంచరీతో జట్టును విశ్వవిజేతగా నిలిపాడు. 308 వన్డేల్లో 9284 పరుగులు చేశాడు. 106 వికెట్లు పడగొట్టాడు. 93 టెస్టుల్లో 6361 పరుగులు సాధించాడు.

6 బంతుల్లో 6 వికెట్లు

ఆస్ట్రేలియా క్లబ్ క్రికెట్‌లో ఘనత


గారెత్ మోర్గాన్

గోల్డ్‌కోస్ట్: ఆస్ట్రేలియా క్లబ్ క్రికెట్‌లో ఒక అరుదైన రికార్డు నమోదైంది. గోల్డ్ కోస్ట్ ప్రీమియర్ లీగ్ డివిజన్-3 పోటీల్లో ఒక బౌలర్ ఓవర్‌లోని ఆరు బంతుల్లో ఆరు వికెట్లు పడగొట్టడం విశేషం. ముద్గీరబ నేరంగ్ అండ్ డిస్ట్రిక్స్ క్లబ్ కెప్టెన్ గారెత్ మోర్గాన్ ఈ ఘనత సాధించి చరిత్రకెక్కాడు. సర్ఫర్స్ ప్యారడైజ్ సీసీ జట్టుపై అతను ఈ రికార్డు సృష్టించాడు. 40 ఓవర్ల మ్యాచ్‌లో 179 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ఫర్స్ క్లబ్ 39 ఓవర్లలో 174/4 వద్ద నిలిచింది. చివరి ఓవర్లో మరో 5 పరుగులు చేస్తే చాలు. అయితే గారెత్ ఆరు బంతుల్లో ఆరు వికెట్లు తీసి సంచలనం సృష్టించడంతో 4 పరుగుల తేడాతో గెలుపు ముద్గీరబ జట్టు సొంతమైంది. అంతకుముందే ఈ ఇన్నింగ్స్‌లో మరో వికెట్ తీసిన గారెత్ మొత్తంగా 7/16తో ముగించాడు. గతంలో ప్రొఫెషనల్ క్రికెట్‌లో నీల్ వాగ్నర్ (న్యూజిలాండ్), అల్ అమీన్ (బంగ్లాదేశ్), అభిమన్యు మిథున్ (భారత్) ఒకే ఓవర్లో ఐదు వికెట్లు పడగొట్టారు.

ఎనిమిదోసారి ‘టాప్’ ర్యాంక్‌తో...


సీజన్ ముగింపు నంబర్‌వన్ ర్యాంక్ ట్రోఫీతో జొకోవిచ్

టురిన్ (ఇటలీ): సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రికార్డుస్థాయిలో ఎనిమిదోసారి ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనున్నాడు. సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్ తొలి లీగ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 7-6 (7/4), 6-7 (1/7) 6-3తో హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి 2023 సీజన్ ముగింపు ‘టాప్’ ర్యాంక్‌ను ఖరారు చేసుకున్నాడు. 36 ఏళ్ల జొకోవిచ్ రెండేళ్ల క్రితమే ఏడోసారి సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించి సంప్రాస్ (అమెరికా; 6 సార్లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. జొకోవిచ్ 2011, 2012, 2014, 2015, 2018, 2020, 2021లలో నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించాడు. ఏటీపీ ఫైనల్స్ ముగిశాక జొకోవిచ్ ఓవరాల్‌గా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 400 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందనున్నాడు.

భారత్ 9/9

లీగ్ దశను అజేయంగా ముగించిన టీమిండియా

- చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై 160 పరుగుల తేడాతో ఘనవిజయం
- శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ శతకాలు
- రోహిత్, గిల్, కోహ్లి అర్ధ సెంచరీలు
- రేపు ముంబైలో న్యూజిలాండ్‌తో భారత్ సెమీఫైనల్ పోరు

సంపూర్ణం... లీగ్ దశలో భారత్ జైత్రయాత్ర! నెదర్లాండ్స్ జట్టుతో మిగిలిన లాంఛనాన్ని ఫుల్ ప్రాక్టీస్‌తో టీమిండియా ముగించింది. టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి ఫిఫ్టీలతో.. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్; కేఎల్ రాహుల్ సెంచరీలతో డచ్ బౌలర్లను నెట్ ప్రాక్టీస్‌లో ఆడుకున్నంత ఈజీగా ఆడేశారు. అనంతరం ఏకంగా 9 మంది భారత బౌలర్లు నెదర్లాండ్స్ బ్యాటర్లకు పరీక్ష పెట్టారు. చివరకు భారీ విజయం సాధించిన రోహిత్ శర్మ బృందం అజేయంగా లీగ్ దశను పూర్తిచేసి బుధవారం న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ పోరుకు సై అంటోంది.

బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో భారత్ వంద శాతం అంకితభావంతో తొమ్మిదికి తొమ్మిది విజయాలతో లీగ్ దశను అజేయంగా దాటింది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 160 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై జయభేరి మోగించింది. క్రికెట్ కూనపై టాస్ గెలవగానే బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 410 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 102; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకాన్ని... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శ్రేయస్ అయ్యర్ (94 బంతుల్లో 128 నాటౌట్; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీని సాధించారు. రోహిత్ శర్మ (54 బంతుల్లో 61; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (32 బంతుల్లో 51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), కోహ్లి (56 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం నెదర్లాండ్స్ 47.5 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. తేజ నిడమనూరు (39 బంతుల్లో 54; 1 ఫోర్, 6 సిక్స్‌లు) మెరిపించాడు. బౌలర్లలో బుమ్రా, సిరాజ్, కుల్దీప్, జడేజా తలా 2 వికెట్లు తీస్తే... కోహ్లి, రోహిత్ శర్మ చెరో వికెట్ పడగొట్టారు. బుధవారం ముంబైలో జరిగే తొలి సెమీఫైనల్లో గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌తో భారత్ ఆడుతుంది.

ఐదుగురూ చితగ్గొట్టారు...

ఓపెనర్లు రోహిత్ బౌండరీలతో... శుబ్‌మన్ సిక్సర్లతో భారత్ 10 ఓవర్లలోనే 91/0 స్కోరు చేసింది. 30 బంతుల్లోనే గిల్ ఫిఫ్టీ పూర్తవగానే నిష్క్రమించాడు. 100 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లి వచ్చాక కెప్టెన్ రోహిత్ 44 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. కాసేపటికే అతనూ పెవిలియన్ చేరాడు. కోహ్లి, అయ్యర్ జోడీ కూడా పాతుకుపోవడంతో డచ్ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. కోహ్లి 53 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకోగా, భారత్ స్కోరు 29వ ఓవర్లో 200 దాటింది. అక్కడే కోహ్లి వికెట్ పడింది. ఇక్కడితో అర్ధశతకాల ఆట ముగియగా... శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ శతకాల బ్యాటింగ్‌ను చూపెట్టారు. 48 బంతుల్లో అయ్యర్, 40 బంతుల్లో రాహుల్ అర్ధశతకాలు సాధించారు. 42వ ఓవర్లో భారత్ 300 పరుగులు చేయగా... ఆ తర్వాత రాహుల్ ఆట పూర్తిగా మారింది. పరుగుల వేగం పుంజుకుంది. అయ్యర్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఆఖరి 8.2 ఓవర్లలోనే భారత్ 110 పరుగులు చేసింది. 49వ ఓవర్లో అయ్యర్ మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో 25 పరుగులు పిండుకుంటే... ఆఖరి ఓవర్లో తొలి రెండు బంతుల్ని సిక్సర్లుగా బాదిన రాహుల్ 62 బంతుల్లో సెంచరీ పూర్తిచేశాడు. దీంతో భారత్ స్కోరు 400 మార్క్ దాటింది. ఐదో బంతికి రాహుల్ అవుటయ్యాడు. రాహుల్, అయ్యర్ 208 పరుగులు జోడించి ప్రపంచకప్ చరిత్రలో నాలుగో వికెట్‌కు అత్యధిక పరుగుల భాగస్వామ్యం రికార్డు సృష్టించారు.


శ్రేయస్ అయ్యర్


కేఎల్ రాహుల్

కూన కుదేల్

లక్ష్యం కొండంత ఉన్నా దాని గురించి ఏమాత్రం ఆలోచించకుండా నెదర్లాండ్స్ బ్యాటర్లు తమ వంతుకు వచ్చిన ఆటే ఆడారు. మ్యాక్స్ ఓ డౌడ్ (30), అకెర్మన్ (35), సైబ్రాండ్ (80 బంతుల్లో 45; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. విజయవాడలో జన్మించి నెదర్లాండ్స్‌లో స్థిరపడ్డ తేజ నిడమనూరు మిడిలార్డర్‌లో కాసేపు భారీ సిక్సర్లతో మురిపించాడు. అయ్యర్, కీపర్ రాహుల్ మినహా 9 మంది భారత తరఫున బౌలింగ్‌కు దిగారు. ప్రధాన బౌలర్లు బుమ్రా, సిరాజ్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా తలా ఒక చేయివేశారు. తేజ 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తికాగానే ఆ మెరుపులకు రోహిత్ స్వయంగా బౌలింగ్ చేసి ముగింపు పలికాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) వెస్లీ (బి) లీడే 61; గిల్ (సి) తేజ (బి) మీకెరన్ 51; కోహ్లి (బి) మెర్వ్ 51; అయ్యర్ (నాటౌట్) 128; రాహుల్ (సి) సైబ్రాండ్ (బి) లీడే 102; సూర్యకుమార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 410. వికెట్ల పతనం:** 1-100, 2-129, 3-200, 4-408. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 7-0-52-0, వాన్ బీక్ 10-0-107-0, అకెర్మన్ 3-0-25-0, మీకెరన్ 10-0-90-1, వాన్‌డెర్ మెర్వ్ 10-0-53-1, బస్ డి లీడే 10-0-82-2.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; ఒ డౌడ్ (బి) జడేజా 30; అకెర్మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 35; సైబ్రాండ్ (బి) సిరాజ్ 45; ఎడ్వర్డ్స్ (సి) రాహుల్ (బి) కోహ్లి 17; లీడే (బి) బుమ్రా 12; తేజ (సి) షమీ (బి) రోహిత్ 54; వాన్ బీక్ (బి) కుల్దీప్ 16; మెర్వ్ (సి) షమీ (బి) జడేజా 16; ఆర్యన్ (బి) బుమ్రా 5; మీకెరన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 250. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-111, 5-144, 6-172, 7-208, 8-225 9-236, 10-250. **బౌలింగ్:** బుమ్రా 9-1-33-2, సిరాజ్ 6-1-29-2, షమీ 6-0-41-0, కుల్దీప్ 10-1-41-2, జడేజా 9-0-49-2, కోహ్లి 3-0-13-1, గిల్ 2-0-11-0, సూర్యకుమార్ 2-0-17-0, రోహిత్ 0.5-0-7-1.


కోహ్లి


రోహిత్

సినిమా

పండగ పోస్టర్ గురూ

దీపావళి పండక్కి ఇండస్ట్రీలో సినీ టపాసులు బాగానే పేలాయి. టీజర్, ట్రైలర్, ఫస్ట్ లుక్, కొత్త పోస్టర్.. ఇలా సినీ ప్రేమికులకు కావాల్సిన మతాబులు అందాయి. ఈ విశేషాల్లోకి...


విక్రాంత్, విష్ణు విశాల్, రజనీకాంత్


వెంకటేష్


రవితేజ


ప్రభాస్

- రజనీకాంత్, కపిల్‌దేవ్ కీలక పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా జీవితా రాజశేఖర్ ఓ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘లాల్ సలామ్’. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. దీపావళి సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. క్రికెట్‌ను ప్రేమించే కొందరు హిందు, ముస్లిం యువకుల మధ్య రాజకీయ జోక్యంతో తలెత్తిన వివాదాలను మొయిద్దీన్ భాయ్ (రజనీ పాత్ర పేరు) ఎలా సరిదిద్దుతాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం సాగుతుందని యూనిట్ చెబుతోంది.
- ‘రాంగ్ యూసేజ్’ అంటూ ‘సైంధవ్’ సినిమా కోసం పాట పాడారు వెంకటేశ్. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, బేబీ సారా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ‘రాంగ్ యూసేజ్’ పాట లిరికల్ వీడియోను ఈ నెల 21న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, ఈ సాంగ్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది.
- రవితేజ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం ‘ఈగల్’. ఇందులో కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది.
- ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ ‘సలార్’. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ‘సలార్: సీజ్‌ఫైర్’ డిసెంబరు 22న విడుదల కానుంది. తొలి భాగం ట్రైలర్‌ను డిసెంబరు 1న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ప్రభాస్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరంగదూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.


గోపీచంద్

- మాస్ పోలీసాఫీసర్ పాత్రలో గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ ‘భీమా’. ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఓ మాస్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.
- సూర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘కంగువా’. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్. దీపావళి సందర్భంగా ‘కంగువా’ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యూవీ క్రియేషన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఈ సినిమాను నిర్మిస్తోంది. రెండు విభిన్న కాలాల్లో సాగనున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఏప్రిల్ 11న విడుదల కానుందని టాక్.
- విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఫ్యామిలీ స్టార్’. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. ఈ సినిమా తాజా షూటింగ్ షెడ్యూల్‌ను బ్యాంకాక్‌లో ప్లాన్ చేశారు. సంక్రాంతికి ‘ఫ్యామిలీ స్టార్’ విడుదల కానుంది.


సూర్య


విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

- ఎన్టీఆర్ పెద్ద కుమారుడు జయకృష్ణ తనయుడు చైతన్యకృష్ణ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘బ్రీత్’. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనారోగ్యంతో హాస్పిటల్‌లో జాయిన్ అయిన తర్వాత చోటు చేసుకునే ఘటనల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని యూనిట్ చెబుతోంది.
- ప్రముఖ నటుడు ఉపేంద్ర భార్య, నటి ప్రియాంకా ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటించిన ప్రయోగాత్మక చిత్రం ‘క్యాప్చర్’. ఈ సినిమాకు లోహిత్ దర్శకుడు. రాధికా కుమారస్వామి సమర్పణలో రవిరాజ్ నిర్మించారు. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ‘‘ఇప్పటి వరకూ సినీ ప్రపంచంలో రాని ఓ ప్రయోగాత్మక చిత్రం ఇది. సింగిల్ లెన్స్‌తో తీసిన మొట్ట మొదటి సినిమా కూడా ఇదే. సినిమా మొత్తం కూడా సీసీటీవీ ఫుటేజ్ నుంచి షూట్ చేసినట్టుగా అనిపిస్తుంది. 30 రోజులు గోవాలో ఏకధాటిగా షూటింగ్ జరిపాం. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది.
- కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి సతీమణి, నటి రాధికా కుమారస్వామి నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ‘అజాగ్రత్త’. శశిధర్ దర్శకత్వంలో రవిరాజ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏడు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. అలాగే రాధికా కుమారస్వామి నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం ‘భైరా దేవి’. శ్రీ జై దర్శకత్వం వహిస్తున్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునే అఘోరా భైరాదేవిగా రాధిక నటిస్తున్నారు.
- క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో రూపొందుతున్న సినిమా ‘చే’. ‘లాంగ్ లివ్’ అనేది ఉపశీర్షిక. లావణ్య సమీరా, పూల సిద్ధేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమామహేశ్వర్, బి.ఆర్ సభావత్ నాయక్ కీలక పాత్రల్లో నటించారు. బి.ఆర్ సభావత్ నాయక్ దర్శకత్వంలో సూర్య, బాబు, దేవేంద్ర నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ‘‘చేగువేరా బయోపిక్ తీయాలన్నది నా 20 ఏళ్ల కల. విప్లవ వీరుడు చేగువేరా లైఫ్‌లో జరిగిన ఎన్నో అరుదైన విషయాలు ఈ సినిమాలో ఉన్నాయి. డిసెంబరులో ఈ సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం’’ అన్నారు బి.ఆర్ సభావత్ నాయక్.


రాధిక


చైతన్య కృష్ణ


ప్రియాంక


‘చే’ పోస్టర్

మంగళవారం ప్రకటించగానే ఆయన ఫోన్ చేశారు


- దర్శకుడు అజయ్ భూపతి



‘‘మంగళవారం’ అంటే మంచిది కాదని ఓ అభిప్రాయం ఉంది. అయితే మంగళవారం చాలా శుభప్రదమైన రోజు. జయవారం అంటారు. గతంలో మనకు ఆ రోజే సెలవు ఉండేది.. బ్రిటీషర్లు వచ్చాక ఆ సెలవుని ఆదివారానికి మార్చారు. ‘మంగళవారం’ టైటిల్ పోస్టర్ విడుదల చేయగానే సీనియర్ డైరెక్టర్ వంశీగారు ఫోన్ చేసి, ‘చాలా మంచి టైటిల్ అజయ్. నేను చాలాసార్లు ఆ టైటిల్ అనుకుంటే నిర్మాతలు ఒప్పుకోలేదు’ అన్నారు. ఆయన నుంచి ఫోన్ రావడం చాలా సంతోషంగా అనిపించింది’’ అని దర్శకుడు అజయ్ భూపతి అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతి రెడ్డి గునుపాటి, ఎం.సురేష్ వర్మతో కలిసి అజయ్ భూపతి ‘ఎ’ క్రియేటివ్ వర్క్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అజయ్ భూపతి చెప్పిన విశేషాలు.

- ‘మహాసముద్రం’ సినిమా చిత్రీకరణలో ఉన్నప్పుడు ‘మంగళవారం’ చిత్రం చేయాలని ఫిక్స్ అయ్యాను. కమర్షియల్ సినిమాలు ఒక మీటర్ మీద వెళతాయి కాబట్టి చేయడం కష్టం కాదు. కానీ, ‘మంగళవారం’ లాంటి చిత్రం తీయడం చాలా కష్టం. ప్రొడక్షన్ అండ్ టెక్నికల్ వేల్యూస్, ఆర్టిస్టుల యాక్టింగ్ వంటివి చాలా ఉంటాయి. అలాగే నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులందర్నీ ఒక్క తాటిపైకి తీసుకు రావడం కష్టంగా అనిపించింది.
- ‘మహాసముద్రం’ సమయంలో అదితీరావు హైదరీకి కూడా ‘మంగళవారం’ కథ చెప్పాను.. ఆమె చేస్తానన్నారు. అయితే ఆ తర్వాత ఆమెను నేను సంప్రదించలేదు. ‘మంగళవారం’ కోసం సుమారు 40, 50 మందిని ఆడిషన్ చేశా. ఆ తర్వాత ఓ రోజు ‘మనం మళ్లీ సినిమా చేద్దాం’ అంటూ పాయల్ నుంచి ఓ మెసేజ్ వచ్చింది. ఆ పాత్రకి తను సరిపోతుందా? లేదా అని విజువలైజ్ చేసుకున్నాను.. రెండు రోజుల తర్వాత ఫొటో షూట్ చేశాం. తను సరిపోతుందని తెలిశాక ఓకే చేశా.
- ‘మంగళవారం’ ఏ స్థాయి సినిమా అని నేను ముందు ఊహించకపోతే 20 కోట్లు ఖర్చు పెట్టను. అల్లు అర్జున్‌గారికి ఏడాదిన్నర క్రితమే ఈ కథ చెప్పాను. అందుకే ఆయన ట్రైలర్ చూసిన తర్వాత సినిమా ఎలా ఉంటుందో ఊహించి, మాట్లాడారు. మా బ్రదర్ సురేష్ వర్మ, స్వాతి రెడ్డిగార్లతో కలిసి ఈ సినిమా నిర్మాణంలో భాగమవడం సంతోషంగా ఉంది. ‘మంగళవారం’ సినిమాకు కొనసాగింపు ఉంటుంది’’ అన్నారు.

ఉత్తరాంధ్రను ఊపేసేలా...


శ్రీకాంత్

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘కోట బొమ్మాళి పీఎస్’. తేజా మార్ని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్‌పై ‘బన్నీ’ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ 24న విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి ‘ఉత్తరాంధ్రను ఊపేసేలా... శ్రీకాకుళం చిందేసేలా...’ అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. శ్రీకాకుళం జిల్లాలోని కోట బొమ్మాళి గ్రామంలోని కోటమ్మ తల్లి సన్నిధానంలో ఈ పాటను విడుదల చేశారు. రంజిన్ రాజ్ సంగీతం అందించిన ఈ పాటకు రాంబాబు గోసాల సాహిత్యం అందించారు. ఈ పాట విడుదలలో రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, తేజా మార్ని, చిత్రసహ నిర్మాత భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వినోదాల జమాన


భాస్కర్, సూర్య శ్రీనివాస్, వెంకీ కుడుముల

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్, స్వాతి కశ్యప్, జారా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ‘జమాన’. భాస్కర్ జక్కులని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీ లక్ష్మీ వల్లభ క్రియేషన్స్, వీఎస్ అసోసియేట్స్‌పై తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్ నిర్మించారు. ఈ మూవీ టైటిల్ ప్రోమోను దర్శకుడు వెంకీ కుడుముల విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘జమాన’ టైటిల్ ప్రోమో చాలా ఆసక్తిగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘నేటి యువతరం ఆలోచనలకు అద్దం పట్టే ఆసక్తికరమైన కథ, కథనాలతో రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘జమాన’’ అన్నారు సూర్య శ్రీనివాస్. ‘‘చార్మినార్, పాత బస్తీ నేపథ్యంలో యువతకి నచ్చేలా ఈ సినిమా తీశాను. ఈ కథని నమ్మి సినిమా నిర్మించిన మా నిర్మాతలకి కృతజ్ఞతలు’’ అన్నారు భాస్కర్ జక్కుల.

సాక్షి బిజినెస్
మంగళవారం
14-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
326	82
64,934	19,444

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,781	▽	20
డోజోన్స్	34,367	△	84
ఎఫ్‌టీఎస్ఈ 100	7,426	△	65
డాక్స్	15,345	△	111
షాంఘై	3,047	△	8
నికాయ్	32,585	△	17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,892
బంగారం (99.5 స్వచ్ఛత)	59,652
వెండి (కేజీ)	69,400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.55	84.22
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.29	103.62
€	యూరో	ఒకటి	87.53	90.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.14	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.92	54.21
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.29	62.24
SAR	సౌదీ రియాల్	రూపాయల్లో	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	రూపాయల్లో	21.79	23.59
¥	చైనా యువాన్	రూపాయల్లో	10.31	12.38

65 వేల దిగువకు సెన్సెక్స్

- ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో అప్రమత్తత
- 19,400 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- బలిప్రతిపద సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు



ముంబై: ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, రూపాయి బలహీనతలు సెంటిమెంట్‌పై మరింత పెంచాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 326 పాయింట్లు నష్టపోయి 64,934 వద్ద ముగిసింది. నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 19,444 వద్ద నిలిచింది. దీంతో సూచీలకు మూహూరత్ ట్రేడింగ్ లాభాలన్నీ మాయమయ్యాయి. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 406 పాయింట్లు నష్టపోయి 64,853 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు క్షీణించి 19,415 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. నష్టాల మార్కెట్లోనూ ఇంధన, యుటిలిటీ, విద్యుత్, ఆటో షేర్ల రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.85%, 0.32% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,244 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.830 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. బలిప్రతిపద సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు. ట్రేడింగ్ తిరిగి యథావిధిగా బుధవారం ప్రారంభవుతుంది.

> "అంతర్జాతీయ అనిశ్చితితో దీపావళి మరుసటి రోజూ భారత ఈక్విటీ మార్కెట్లలో దిద్దుబాటు కొనసాగింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు ప్రభావాలతో ఐఐపీ వృద్ధి, తయారీ రంగ పీఎంఐ భారీగా క్షీణించాయి. అయితే మెరుగైన కార్పొరేట్ ఆదాయాలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, సంస్థాగత కొనుగోళ్ల తదితర అంశాలు దిగువ స్థాయిలో దేశీయ మార్కెట్‌కు దన్నుగా నిలిచే వీలుంది'.
> – దీపక్ జెసానీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్

- ప్రొటీయన్ ఈగవ్ టెక్నాలజీస్ షేరు లిస్టింగ్ రోజు 11% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.792) వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో క్రమంగా కొనుగోళ్ల మద్దతు పెరగడంతో ఈ షేరు పుంజుకుంది. ట్రేడింగ్‌లో 12% ర్యాలీ చేసి రూ.891 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 11% లాభంతో రూ.883 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.3,571 కోట్లుగా నమోదైంది.

రిటైల్ ధరల ఉపశమనం

అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.87%

న్యూఢిల్లీ: రెండు నెలల నుంచి దిగివస్తున్న వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా మూడవనెల అక్టోబర్‌లోనూ మరింత తగ్గింది. తాజా సమీక్షా నెల్లో 4.87 శాతంగా (2022 అక్టోబర్ నెలతో పోల్చి) నమోదయ్యింది. అంతక్రితం నాలుగు నెలల్లో (జూన్‌లో 4.81 శాతం) ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి.



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 ప్లస్ లేదా మైనస్‌తో 4 శాతం వద్ద (మినహాయింపులకు లోబడి ఎగవముఖంగా 6 శాతం) ఉండాలన్నది సెంట్రల్ బ్యాంక్‌కు కేంద్రం నిర్దేశం. సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఆర్‌బీఐకి నిర్దేశిత పరిధిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయినప్పటికీ, తమ లక్ష్యం 4 శాతమేనని గవర్నర్ శక్తికాంతదాస్ పలు సందర్భాల్లో స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 6.7 శాతంకాగా, 2023–24లో రేటు 5.4 శాతానికి తగ్గుతుందన్నది ఆర్‌బీఐ అంచనా.

కొనసాగుతున్న ఎఫ్‌పీఐ అమ్మకాలు

నవంబర్‌లో ఇప్పటివరకు రూ. 5,800 కోట్ల విక్రయాలు



న్యూఢిల్లీ: మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లు పెరుగుతుండటం వంటి అంశాల నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) దేశీయంగా ఈక్విటీలను విక్రయించడం కొనసాగిస్తున్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం .. నవంబర్‌లో ఇప్పటివరకు (1 నుంచి 10వ తేదీ వరకు) రూ. 5,800 కోట్ల మేర అమ్మేశారు. ఇప్పటికే అక్టోబర్‌లో రూ. 24,548 కోట్లు, సెప్టెంబర్‌లో 14,767 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దాని కన్నా ముందు ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (మార్చి నుంచి ఆగస్టు వరకు) దాదాపు రూ. 1.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. మరోవైపు, అక్టోబర్‌లో డెట్ మార్కెట్లో రూ. 6,381 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో ఇప్పటివరకు రూ. 6,053 కోట్లు పెట్టుబడులు పెట్టారు. మొత్తం మీద ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఈక్విటీల్లో రూ. 90,161 కోట్లు, డెట్ మార్కెట్లో రూ. 41,554 కోట్లకు చేరాయి.

ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా ట్రెజరీ బాండ్ ఈల్డ్‌లు పెరగడం వంటి అంశాల కారణంగా ఎఫ్‌పీఐల విక్రయాల ధోరణి కొనసాగుతోందని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాంశు శ్రీవాస్తవ చెప్పారు. పరిస్థితులు మెరుగుపడి ఈక్విటీల్లో తిరిగి ఇన్వెస్ట్ చేసే వరకు నిధులను స్వల్పకాలికంగా డెట్ మార్కెట్లోకి మళ్లించే వ్యూహాన్ని మదుపుదారులు అమలు చేస్తున్నట్లు పరిశీలకులు తెలిపారు. ఆర్థిక రంగ సంస్థలు మెరుగైన క్యూ2 ఫలితాలు ప్రకటిస్తూ, ఆశావహ అంచనాలు వెలువరిస్తున్నప్పటికీ ఎఫ్‌పీఐలు వాటిలో అత్యధికంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ వేల్యుయేషన్లు ఆకర్షణీయంగా మారినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు.

బికనీర్‌వాలా చైర్మన్ అగర్వాల్ కన్నుమూత



న్యూఢిల్లీ: స్వీట్స్, స్నాక్స్ బ్రాండ్ బికనీర్‌వాలా చైర్మన్ కేదార్‌నాథ్ అగర్వాల్ (86) సోమవారం కన్నుమూశారు. 'కాకాజీ' అంటూ అంతా ఆప్యాయంగా పిల్చుకునే అగర్వాల్ మరణం తమకు తీరని లోటని సంస్థ డైరెక్టరు, ఆయన కుమారుడు రాధే మోహన్ అగర్వాల్ తెలిపారు. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు రసగుల్లాలు, భుజియా వంటి తినుబండారాలను విక్రయించిన అగర్వాల్.. అంచెలంచెలుగా బికనీర్‌వాలాతో దేశ, విదేశాల్లోనూ కార్యకలాపాలు విస్తరించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం భారత్‌తో పాటు అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తదితర దేశాల్లో 60 పైచిలుకు అవుట్‌లెట్స్ ఉన్నాయి.

దీపావళి ధమాకా!

- పండుగ సీజన్‌లో ఇప్పటివరకు రూ. 3.75 లక్షల కోట్ల వ్యాపారం
- మరో రూ. 50,000 కోట్ల వరకు వ్యాపార అంచనాలు
- సీఏఐటీ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పండుగ సీజన్ సందర్భంగా రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రూ. 3.75 లక్షల కోట్ల మేర విక్రయాలు జరిగినట్లు అఖిల భారతీయ ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) వెల్లడించింది. రాబోయే గోవర్ధన పూజ, భాయ్ దూజ్, ఛత్ పూజ వంటి పర్వదినాల సందర్భంగా మరో రూ. 50,000 కోట్ల మేర వ్యాపారం జరగవచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించింది. ఈసారి దీపావళికి ఎక్కువగా దేశీయంగా తయారైన ఉత్పత్తులే అమ్ముడైనట్లు సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. చైనా ఉత్పత్తులకు రూ. 1 లక్ష కోట్ల మేర వ్యాపారం తగ్గిపోయిందని పేర్కొన్నారు. 'గతంలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మకాల్లో చైనా ఉత్పత్తుల వాటా దాదాపు 70 శాతం ఉండేది. కానీ ఈసారి దేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునకు ఇటు వ్యాపారవర్గాలు, అటు వినియోగదారుల నుంచి భారీగా స్పందన లభించింది' అని ఆయన వివరించారు.



ఇలా ఖర్చు చేశారు..

కస్టమర్లు ఈ దీపావళికి ఫుడ్, గ్రాసరీపై 13 శాతం వెచ్చించారు. వస్త్రాలు, దుస్తులపై 12 శాతం, ఆభరణాలకు 9 శాతం, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 8 శాతం, బహుమతులకు 8 శాతం, కాస్మెటిక్స్‌కు 6 శాతం ఖర్చు చేశారు. డ్రైఫ్రూట్స్, స్వీట్స్, నమ్కీన్ 4 శాతం, ఫర్నీషింగ్, ఫర్నీచర్ 4 శాతం, గృహాలంకరణ 3 శాతం, పూజా సామగ్రి 3, పాత్రలు, వంటింటి ఉపకరణాలు 3 శాతం, కన్ఫెక్షనరీ, బేకరీ 2 శాతం కైవసం చేసుకున్నాయి. ఆటోమొబైల్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్, బొమ్మలు, ఇతర వస్తువులకు 20 శాతం వెచ్చించారని సీఏఐటీ తెలిపింది.

అన్ని విభాగాల్లోనూ జోష్..

రిటైల్‌లో అన్ని విభాగాలు మెరుగ్గా పనితీరు కనబరిచాయి. అమ్మకాల పరంగా ఆన్‌లైన్‌కు, ఆఫ్‌లైన్‌కు వ్యత్యాసం లేదని రిటైల్ రంగ నిపుణుడు కళిశెట్టి పి.బి.నాయుడు తెలిపారు. మొత్తం రిటైల్ వ్యాపారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 16 శాతం ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో గతేడాదితో పోలిస్తే ఈ దీపావళికి డైమండ్ జువెల్లరీ విక్రయాలు 15–20 శాతం, బంగారు ఆభరణాలు 35 శాతం దూసుకెళ్లాయని హీరావాలా జెమ్స్, జువెల్లర్స్ ఎండీ గౌతమ్ చవాన్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో రూ. 19,000 కోట్లపైనే..

ఇక, దీపావళి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.19,000 కోట్లపైన వ్యాపార అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో అత్యధికంగా దుస్తులు, నిత్యావసర వస్తువులు, టపాసులు, గృహోపకరణాలు జరిగినట్లు తెలిపాయి. దీపావళి అంటే టపాసులతో పాటు స్వీట్లకు అత్యధిక ప్రాధాన్యత ఉండటంతో వీటికోసమే రూ.3,800 కోట్ల వరకు వ్యయం చేసినట్లు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా సగటున ప్రతి ఒక్కరు దీపావళి పర్వదినం సందర్భంగా రూ.3,500 వరకు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని, ఆ లెక్కన చూస్తే రాష్ట్రంలో దీపావళి సందర్భంగా రూ.19,000 కోట్లపైన మార్కెట్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

ఓఎన్‌జీసీ లాభం డౌన్

క్యూ2లో రూ. 10,216 కోట్లు

న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్‌లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 10,216 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 12,826 కోట్ల నికర లాభం ఆర్జించింది. చమురు ఉత్పత్తితోపాటు ధరలు తగ్గడం ప్రభావం చూపింది. ఈ ఏడాది క్యూ1 (ఏప్రిల్–జూన్)లోనూ నికర లాభం 34 శాతం వెనకడుగు వేయడం గమనార్హం! కాగా.. ప్రతీ బ్యారల్ చమురుకు 84.84 డాలర్లు లభించగా.. గత క్యూ2లో 95.5 డాలర్లు సాధించింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య తలెత్తిన యుద్ధం కారణంగా క్యూ1లో చమురు ధరలు పెరిగినప్పటికీ తిరిగి క్యూ2లో కొంతమేర నీరసించాయి.



ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు 0.6% నీరసించి రూ. 196 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

సీటెట్ జనవరి-2024

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జనవరి–2024 ఏడాదికి సంబంధించి సీటెట్ నోటిఫికేషన్ విడుదలచేసింది.

అర్హత

» పేపర్–1: 50 శాతం మార్కులతో పన్నెండో తరగతితో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో రెండేళ్ల డిప్లొమా(డీఈఎల్‌ఈడీ)/డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(ప్రత్యేక విద్య) లేదా డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

» పేపర్–2: 50 శాతం మార్కులతో డిగ్రీతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్(బీఈడీ)/బీఈడీ(ప్రత్యేక విద్య) లేదా సీనియర్ సెకండరీతో పాటు నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (బీఈఎల్‌ఈడీ)/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

» పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్‌లను కలిగి ఉంటుంది. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాలనుకునే వారికి కోసం, రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోరు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషలలో నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.

» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.11.2023

» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది: 21.01.2024

» వెబ్‌సైట్: ctet.nic.in

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు

సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి హార్టికల్చర్ ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» ఎంఎస్సీ(హార్టికల్చర్)–30 సీట్లు: స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఆరోమాటిక్ క్రాప్స్. అర్హత: బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ(హార్టికల్చర్)తో పాటు ఐకార్–ఏఐఈఈఏ(పీజీ)–2023 స్కోరు సాధించి ఉండాలి.

» పీహెచ్‌డీ(హార్టికల్చర్)–06 సీట్లు: స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఆరోమాటిక్ క్రాప్స్. అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్సీ(హార్టికల్చర్)తో పాటు ఐకార్ ఏఐసీఈ–జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్(పీహెచ్‌డీ)–2023 స్కోరు సాధించి ఉండాలి.

» వయసు: గరిష్ఠ వయోపరిమితి 31.12.2023 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

» ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, జాతీయ స్థాయి పరీక్షల్లో సాధించిన స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, ములుగు, సిద్ధిపేట జిల్లా చిరునామకు పంపించాలి.

» దరఖాస్తులకు చివరితేది: 20.11.2023.

» వెబ్‌సైట్: www.skltshu.ac.in

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ- హార్టిసెట్-2023

సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి హార్టిసెట్–2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» కోర్సు: బీఎస్సీ ఆనర్స్(హార్టికల్చర్). మొత్తం సీట్ల సంఖ్య: 32

» కోర్సు వ్యవధి: నాలుగేళ్లు.

» అర్హత: శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ నుంచి హార్టికల్చర్ డిప్లొమా(పాలిటెక్నిక్) ఉత్తీర్ణులైఉండాలి.

» వయసు: 31.12.2023 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

» ప్రవేశ పరీక్ష: తెలుగు మాధ్యమం, బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో ఉంటుంది.

» ఎంపిక విధానం: హార్టిసెట్ ర్యాంక్‌కు 75%, డిప్లొమా మార్కులకు 25% వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» దరఖాస్తు విధానం: దరఖాస్తును రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, ములుగు, సిద్ధిపేట జిల్లా.

» దరఖాస్తులకు చివరితేది: 20.11.2023.

» ప్రవేశ పరీక్ష తేది: 28.11.2023.

» వెబ్‌సైట్: skltshu.ac.in

సైన్స్ పరిశోధనలకు మార్గం..

సీఎస్ఐఆర్ నెట్

» సీఎస్ఐఆర్ నెట్‌తో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు మార్గం

» సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల

» సైన్సెస్, ఇంజనీరింగ్, పీజీ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు

» మొత్తం అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహణ

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఎంపికకు మార్గం.. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్. ఈ పరీక్షను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సంయుక్తంగా నిర్వహిస్తాయి. ప్రతి ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్) ఈ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షకు దరఖాస్తు సమయంలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యం ఆధారంగా జేఆర్ఎఫ్‌కు లేదా లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌నకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

అయిదు విభాగాలు

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ద్వారా సైన్సెస్‌కు సంబంధించిన అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.
- ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులు పరిశోధన సంస్థల్లో పీహెచ్‌డీ చేసేందుకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అందుకునే అవకాశం లభిస్తుంది. ఈ అయిదు విభాగాలకు సంబంధించి అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది.

అర్హతలు

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌కు సైన్సెస్, ఇంజనీరింగ్, పీజీ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు. 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈ/బీటెక్/ బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా అర్హులే. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఆయా కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత ఉండదు. అదే విధంగా బీఎస్సీ ఆనర్స్ చివరి సంవత్సరం చదువుతున్న వారికి, ఫలితాల కోసం వేచి చూస్తున్న వారికి దరఖాస్తుకు అర్హత లేదు.

వయసు

జేఆర్ఎఫ్‌కు అభ్యర్థుల వయసు జూలై 1, 2023 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్.. లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ స్కోర్ ఆధారంగా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాథమ్యం తెలియజేయాలి. ఫలితాల సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.

200 మార్కులకు పరీక్ష

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. పరీక్షలో పార్ట్ ఏ, పార్ట్ బీ, పార్ట్ సీ ఉంటాయి. పార్ట్ ఏ అందరికీ కామన్‌గా జనరల్ ఆప్టిట్యూడ్‌పై ఉంటుంది. పార్ట్ బీ సబ్జెక్ట్ పేపర్ కాగా, పార్ట్ సీలో సబ్జెక్ట్ పేపర్–2 ఉంటుంది.

పెరిగిన జేఆర్ఎఫ్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌లో విజయం సాధించి నిర్దేశిత ఇన్‌స్టిట్యూట్‌లు లేదా రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన అభ్యర్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.37 వేలు చొప్పున రీసెర్చ్ ఫెలోషిప్, రెండేళ్లపాటు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున కాంటింజెంట్ గ్రాంట్ కూడా లభిస్తుంది. రెండేళ్ల తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే సీనియర్ రీసెర్చ్ ఫెలోగా పరిగణిస్తూ నెలకు రూ.42 వేలు చొప్పున ఫెలోషిప్ లభిస్తుంది. ఇలా గరిష్ఠంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి.
- గత ఏడాది వరకు జేఆర్ఎఫ్‌కు రూ.31 వేలు; ఎస్ఆర్ఎఫ్‌కు రూ.35వేల ఫెలోషిప్ ఉండేది. తాజాగా ఫెలోషిప్‌లను పెంచుతూ యూజీసీ మార్గదర్శకాలు విడుదల చేయడంతో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్–డిసెంబర్–2023లో అర్హత సాధించిన వారికి ఈ పెరిగిన మొత్తాలను అందిస్తారు.



సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2023

అధ్యాపకులకు కనీస అర్హత

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత వల్ల కలిగే మరో ప్రయోజనం.. అధ్యాపక వృత్తిలో అవకాశాలు కచ్చితంగా లభించడం. యూజీసీ నిబంధనల ప్రకారం.. ఉన్నత విద్యా సంస్థలు లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో నియామకాలకు సీఎస్ఐఆర్ –యూజీసీ నెట్ ఉత్తీర్ణులను నియమించుకునే విధంగా మార్గదర్శకాలు రూపొందించింది. ఈ నేపథ్యంలో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టేందుకు, యూజీసీ నిర్దేశించిన పే-స్కేల్‌కు అనుగుణంగా వేతనాలు పొందేందుకు ఆస్కారం లభిస్తుంది.

మంచి స్కోర్‌కు మార్గమిదే

జనరల్ ఆప్టిట్యూడ్

అన్ని కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం.. జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో రాణించేందుకు తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

సబ్జెక్ట్ పేపర్-1 (పార్ట్-బి)

పార్ట్–బి పేరుతో ఉండే సబ్జెక్ట్ పేపర్–1లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ స్థాయి పుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

సబ్జెక్ట్ పేపర్-2 (పార్ట్-సి)

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది. శాస్త్రీయ భావనలపై అవగాహన, అన్వయ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. విశ్లేషణాత్మక దృక్పథంతో అధ్యయనం చేయడం ద్వారా సమాధానాలను గుర్తించొచ్చు. కాబట్టి అభ్యర్థులు తమ అకడెమిక్స్ సంబంధించి పీజీ స్థాయి పుస్తకాలను చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

పరిశోధన దృక్పథం

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లో పీజీ స్థాయి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రస్తుత సమస్యలు, వాటి పరిష్కారం దిశగా పరిశోధనల గురించి అవగాహన పెంచుకోవాలి. తద్వారా పార్ట్–సిలో రాణించేందుకు మార్గం సుగమం అవుతుంది.


ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 30, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: డిసెంబర్ 2 – డిసెంబర్ 4,2023
- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తేదీలు: డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో,2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

‘అపార్’మైన అడ్డంకులు!

- ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీలో జాప్యం
- అనుమతి పత్రాలివ్వడానికి భయపడుతున్న తల్లిదండ్రులు
- ఎన్నికల విధుల్లో టీచర్లు... వివరించలేని పరిస్థితి
- నెల రోజులైనా ముందుకు సాగని 12 అంకెల విధానం
- త్వరగా పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల ఒత్తిడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో చేపట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ముందుకు సాగేట్టు కన్పించడం లేదు. ఎన్నికల తర్వాతే దీనిపై దృష్టి పెట్టగలమని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికిప్పుడు ఒత్తిడి చేయడం సరికాదంటూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పాన్‌కార్డు తరహాలో ప్రతి విద్యార్థికి 12 అంకెల అకడమిక్ నంబర్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థి ఒకటవ తరగతి నుంచి అన్ని కేటగిరీల విద్య వరకూ కేటాయించిన నంబరే ఉంటుంది. దీన్ని ఆన్‌లైన్‌తో అనుసంధానం చేస్తారు. భవిష్యత్‌లో మార్కుల మెమోలను డిజిటల్ చేయడానికి కూడా ఇది తోడ్పతుందని భావించారు. దేశంలోనే కాకుండా, ఇతర దేశాల్లోనూ విద్యార్థి అకడమిక్ అర్హతలు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవడం దీని ఉద్దేశమని కేంద్రం పేర్కొంది. ఈ ప్రక్రియను అన్ని రాష్ట్రాలూ పూర్తి చేయాలని గత నెల 11వ తేదీన ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ‘అపార్’లో విద్యార్థులను చేర్చాలని సూచించింది. ఈ ప్రక్రియను అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత దీన్ని నవంబర్ 10 వరకూ పొడిగించారు. కానీ అపార్‌కు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



తల్లిదండ్రులను ఒప్పించడమెలా..?

విద్యార్థులకు అమలు చేసే ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజనం అమలు అన్నింటికీ ఆపార్‌ను ప్రామాణికంగా తీసుకునే వీలుంది. భవిష్యత్‌లో విద్యార్థి తల్లిదండ్రుల పాన్, ఆధార్ కార్డులను దీనికి జత చేసే వీలుందని అధికార వర్గాలు అంటున్నాయి. దీని ఆధారంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే, ఆపార్‌లో విద్యార్థి పేరు చేర్చడానికి గల ఉద్దేశాన్ని తల్లిదండ్రులకు వివరించాలని, వారి అనుమతి పొందాలని కేంద్రం షరతు పెట్టింది. విద్యార్థి వివరాలతోపాటు తల్లిదండ్రుల అమోద పత్రాలన్నింటినీ సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో జతపర్చాల్సి ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు కొంత కసరత్తు జరిగింది. అయితే, అనుమతి పత్రాలు ఇవ్వడానికి తల్లిదండ్రులు భయపడుతున్నట్టు హెచ్‌ఎంలు అంటున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ప్రయోజనాలు దెబ్బతింటాయనే అపోహ వారిలో ఉందని గుర్తించినట్టు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటే తప్ప వారిని ఒప్పించడం సాధ్యం కాదంటున్నారు.

ఎన్నికలతో బ్రేక్..!

ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో అపార్ నమోదు కార్యక్రమం ముందుకు సాగడం లేదని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. తాము ఎన్నికల విధుల్లోకి వెళ్ళాల్సిన పరిస్థితి, ఇందుకోసం పోలింగ్‌పై శిక్షణ తీసుకోవాల్సి రావడంతో అపార్‌పై దృష్టి పెట్టలేకపోతున్నామని చెప్పారు. దీంతో పాటే స్థానిక ప్రజాప్రతినిధులతో తల్లిదండ్రులను ఒప్పించేందుకు ప్రయత్నించడం ఈ పరిస్థితుల్లో సరికాదని భావిస్తున్నారు. స్థానికంగా ఏ నాయకుడితో దీనిపై సంప్రదింపులు జరిపినా ఈ అంశం రాజకీయంగా మారే వీలుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఎన్నికలయ్యే వరకూ అపార్ కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సిందేనని హెచ్‌ఎంలు కోరుతున్నారు. కానీ ఉన్నతాధికారులు మాత్రం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఒత్తిడి తెస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడు రేఖల అంతుచిక్కని చిత్రం

తెలంగాణలో తొలిసారి ‘లాబ్రింత్’ గుర్తింపు | బొమ్మలరామారం మండలంలో గుర్తించిన పరిశోధకులు

సాక్షి, హైదరాబాద్: అదో చక్రం లాంటి ఆకారం.. లోపల వరుసగా ఏడు వరసలుంటాయి. కానీ వృత్తం కొసలు కలుసుకోవు.. మొదటి గీత ఆధారంగా ప్రయాణిస్తే చివరకు ఓ కేంద్ర బిందువును చేరతాం.. మధ్యలో ఎక్కడా మరో దారి ఉండదు. అంతా గజిబిజిగా ఉంటుంది. మహాభారతంలో ‘పద్మ వ్యూహం’ లాంటిదన్న మాట.

ఈ చిత్రాలను గీసింది ఇప్పుడు కాదు, దాదాపు మూడు వేల ఏళ్లకుపైమాటే. ఇలాంటి చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో వెలుగు చూశాయి. అన్ని వృత్తాల్లో ఏడు వరుసలుగానే ఉండటం విశేషం. ఏమాత్రం కమ్యూనికేషన్ వ్యవస్థ లేని ఆదిమానవుల కాలంలో ఇలా ఒకే తరహాలో వేరు వేరు దేశాల్లో ఎలా గీశారన్నది మాత్రం అంతు చిక్కని అంశం. అసలు ఆ చిత్రాలకు అర్థమేంటో ఇప్పటికీ స్పష్టంగా తేలలేదు. ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు వాటిపై అధ్యయనం చేస్తూనే ఉన్నారు. పరిశోధకులు పరిభాషలో వాటిని ‘లాబ్రింత్స్’ అంటారు. అంతుచిక్కని చిత్రం అన్న అర్థం వచ్చే గ్రీకు భాష పదమిది. తెలంగాణలో తొలిసారి అలాంటి చిత్రం వెలుగు చూసింది. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం మాచన్‌పల్లి గ్రామ శివారు రామునిగుట్ట మీద ఈ లాబ్రింత్ చిత్రాన్ని గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు మహ్మద్ నజీర్, అన్వర్, అహోబిలం కరుణాకర్, కొరివి గోపాల్ ఆ గుట్టమీద రామాలయం, శివాలయాలకు తూర్పున సహజనీటి గుండం ఒడ్డున దీన్ని గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో ఆ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కోకన్వీనర్లు భద్రగిరీశ్, రమేశ్‌లు ఆ చిత్రాన్ని పరిశీలించారు. ఇది ఏ కాలంలో చెక్కారో ఇతమిత్థంగా తేలనప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా చరిత్ర పరిశోధకుల్లో ఆసక్తి రేపుతున్న లాబ్రింత్‌గా గుర్తించారు. ‘ఇది మానవ సాంస్కృతిక విశ్వాసాలకు సంబంధించిన అంతుచిక్కని చిత్రం.



జంతువులతో పోలిస్తే మనిషి తెలివితేటలతో ఉండటం, పుట్టుక తర్వాత గమ్యం ఏంటో తెలియని పరిస్థితిలో ఈ తరహా చిత్రాలను గీసినట్టు తెలుస్తోంది’ అని హరగోపాల్ పేర్కొన్నారు. అయితే, వేటలో లక్ష్యం చేసుకున్న జంతువుకు దారి తెలియని పరిస్థితి కల్పించేందుకు ఏర్పాటు చేసుకునే ఉచ్చు ఊహా రూపం అయి ఉంటుందని చరిత్ర పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ‘నీటి వనరులు అంతగా లేని ప్రాంతాల్లో భూగర్భంలో నీటి జాడలు కనుక్కునేందుకు నాటి మానవులు ఈ తరహా ప్రణాళిక రూపొందించుకుని భూ ఉపరితలంపై చిత్రించి దాని ఆధారంగా తవ్వి నీటిని పొందేవారు’ అని ఆదిమానవుల అంశాలపై విస్తృత పరిశోధనలు చేసిన రవి కొరిశెట్టార్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వెలుగు చూసిన ఈ తరహా చిత్రాల ఆధారంగా దీనిపై పరిశోధన చేస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయని హరగోపాల్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ

కర్ణాటకకు జస్టిస్ సుమలత, మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ సుధీర్‌కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల బదిలీకి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోమవారం రాత్రి ట్వీట్ చేశారు. జస్టిస్ సుధీర్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ చిల్లకూర్ సుమలతను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కొద్ది రోజుల కిందట సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఆ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. వీరితోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మరో ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకికూడా రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. తెలంగాణ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య (సీజేతో కలిపి) 42 కాగా, ప్రస్తుతం 28 మంది ఉన్నారు. జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ సుధీర్‌కుమార్ బదిలీతో ఆ సంఖ్య 26కు చేరగా.. ఖాళీల సంఖ్య 16కు పెరిగింది.

ఇది ఐదడుగుల ‘డ్రమ్‌స్టిక్కు’!



ఈ చిత్రంలో మీరు చూస్తున్నది మునక్కాయే. కడప నగరం ముత్యంజయకుంట దగ్గరలోని వేణుగోపాల్ ఇంటి ఆవరణలో ఉన్న మునగ చెట్టుకు 5 అడుగుల 7 అంగుళాల మునక్కాయ కాసి చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇటీ వల ఆ చెట్టుకు పశువుల ఎరువుతో పాటు రసాయనిక ఎరువులను వేయడంతో చెట్టుకు ఉన్న కాయలు ఏపుగా పెరిగినట్లు వేణుగోపాల్ చెప్పారు. – కడప అగ్రికల్చర్

ప్రభుత్వ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: ఏపీలోని విద్యార్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్టు రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ సాయుధ బలగాల నియామకంలో భాగంగా త్వరలో 80 వేలకుపైగా కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందన్నారు. ఆసక్తి కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 23 ఏళ్లలోపు ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఓబీసీ, 28 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. రామ్‌కీ ఫౌండేషన్‌- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన 600 మంది అభ్యర్థులకు హైదరాబాద్, గుంటూరు(పెదపరిమి గ్రామం)లోని రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రాలలో శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ నెల 26వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించి, 29న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. సమాచారం కోసం 97036 51233, 73375 85959, 90007 97789 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మళ్లీ ఐటీ సోదాలు

ఈసారి ఫార్మా రంగానికి చెందిన వారి ఇళ్లపై..

సాక్షి, హైదరాబాద్/పటాన్‌చెరు: నగరంలో ఐటీ అధికారుల వరుస సోదాలు సోమవారం మరోసారి కొనసాగాయి. ఫార్మా రంగానికి చెందిన పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో ఉదయం నుంచి ఐటీ అధికారుల బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడ, ఆర్‌సీపురం, వట్టినాగులపల్లి, గచ్చిబౌలిలోని మైహోం భుజాలో సోదాలు నిర్వహించాయి. మై హోమ్ భుజాలో నివాసం ఉంటున్న ప్రదీప్ అనే ఫార్మా వ్యాపారి ఇంట్లో సోదాలు చేసినట్టు సమాచారం. ప్రదీప్ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబానికి సన్నిహితులని తెలిసింది. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్ గూడాలో అంతర్జాతీయ రసాయన పరిశ్రమకు చెందిన ఓ డైరెక్టర్ ఇంటిపై ఐటీ శాఖ అధికారులు దాడులు చేశారు. తనిఖీల సమయంలో ఎవరినీ లోపలికి రానీయకుండా సీఆర్పీఎఫ్ జవాన్‌లు బందోబస్తు నిర్వహించారు. ఆయా కంపెనీలకు చెందిన ఆర్థిక లావాదేవీల వివరాలకు సంబంధించిన పత్రాలను ఐటీ అధికారులు పరిశీలించినట్టు సమాచారం. కాగా, ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులకు పలు ఫార్మా కంపెనీల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు ఇస్తున్నట్టు అందిన పక్కా సమాచారం మేరకు ఐటీ అధికారులు మెరుపుదాడులు చేపట్టినట్టు ప్రచారం జరుగుతోంది.



ఇంట్లోకి వెళ్తున్న ఐటీ శాఖ అధికారులు

హనుమంత వాహనంపై పద్మావతీ అమ్మవారు

చంద్రగిరి: తిరుపతి జిల్లా శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన సోమవారం రాత్రి 8 గంటలకు అమ్మవారు హనుమంత వాహనంపై శ్రీరామచంద్రమూర్తిగా మాడవీధుల్లో ఊరేగారు. అలాగే, ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో చర్నాకోలు, దండం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. జియ్యర్ల దివ్య ప్రబంధ పారాయణం, మంగళ వాయిద్యం, భజన బృందాల కోలాటం, సంప్రదాయ కళా బృందాల ప్రదర్శన, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. కాగా, ఆదివారం అమ్మవారు ముత్యపు పందిరి,సింహ వాహనాలను అధిష్టించి భక్తులను అనుగ్రహించారు.



యాదాద్రి ఆలయ క్యూలైన్‌లో భక్తురాలు మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ధర్మ దర్శనం క్యూలైన్‌లో ఓ భక్తురాలు మృతి చెందింది. నారాయణపేట జిల్లాకు చెందిన మల్లమ్మ (75) కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకునేందుకు సోమవారం వచ్చింది. మధ్యాహ్నం 3.45 గంటలకు ధర్మదర్శనం క్యూలైన్‌లో కుటుంబసభ్యులతో వెళ్తున్న సమయంలో తూర్పు రాజగోపురం ముందు గోల్డ్ క్యూలైన్‌లోకి రాగానే ఛాతీలో నొప్పి వస్తుందని అక్కడే కూర్చుంది. అప్పటికే ఆలయ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది వచ్చి గేట్ తాళాలు తీసేసరికి మల్లమ్మ మృతి చెందింది. ఆలయ సిబ్బంది ఆమెను 108 వాహనంలో మరోసారి పరీక్షించి మృతి చెందిందని నిర్ధారించిన తర్వాత భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆలయాన్ని ఆచార్యులు మూసివేసి, శుద్ధి, సంప్రోక్షణ చేశారు. 5 గంటలకు ఆచార్యులు పలు పూజలు నిర్వహించి, భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.